




# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

సంపుటి 28, సంచిక: 68 | బుధవారం | 27-08-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00

## శుభాకాంక్షలు



పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు 'ప్రజాపక్షం' వినాయక చవితి శుభాకాంక్షలు

## సెలవు

వినాయక చవితి సందర్భంగా 'ప్రజాపక్షం' కార్యాలయానికి బుధవారం సెలవు. గురువారం పత్రిక వెలువడదు. పునర్దర్శనం శుక్రవారం.

\- ఎడిటర్

# స్థానిక కసరత్తు



## పంచాయతీ ఎన్నికలకు ఎన్నికల సంఘం ముమ్మర ఏర్పాట్లు

- పోలింగ్ కేంద్రాలు, తుది ఓటర్ల జాబితా విడుదలకు నోటిఫికేషన్ జారీ
- ఫొటో ఓటర్ల జాబితా తయారుచేసి ప్రచురించాలని ఆదేశం
- 28న ఓటర్ల జాబితా తయారీ, 29న ఎంపిడిఒల ద్వారా మండల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు
- 30న ఓటర్ల జాబితాపై అభ్యంతరాల స్వీకరణ
- సెప్టెంబర్ 2న తుది ఓటర్ల జాబితా ప్రచురణ

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల కోసం కసరత్తును రాష్ట్ర ఎన్నికల సంఘం ముమ్మరం చేసింది. అందులో భాగంగా మంగళవారం గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం పోలింగ్ కేంద్రాలు, తుది ఓటర్ల జాబితా విడుదలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆ క్రమంలో నోటిఫై చేయబడిన అన్ని గ్రామ పంచాయతీల్లోని ఫొటో ఓటర్ల జాబితాను తయారు చేసి ప్రచురించాలని పంచాయతీ అధికారులను రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. గ్రామ పంచాయతీల ఓటర్ల జాబితా తయారీ ప్రచురణ కోసం షెడ్యూల్ సైతం విడుదల చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐ.రాణి కుముదిని జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం, సెప్టెంబర్ 2న తుది ఓటరు జాబితాలను ప్రచురించనున్నారు. ఈ ప్రక్రియలో భాగంగా, జూలై 1, 2025 నాటికి ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాల ఫొటో ఓటరు జాబితాలను ఆధారంగా చేసుకుని గ్రామ పంచాయతీలకు వార్డుల వారీగా ఓటరు జాబితాలను తరువాయి 2లో

## భారత్ ఎగుమతులపై నేటి నుండి అదనపు సుంకాలు




- 50 శాతం టారిఫ్‌లు అమలుచేయనున్న అమెరికా
- 48.2 బి.డాలర్లు పైగా విలువైన సరుకులపై వసూళ్ళు

**వాషింగ్టన్/న్యూఢిల్లీ :** భారత్ ఎగుమతులపై అమెరికా అదనంగా విధించిన 50 శాతం పూర్తి టారిఫ్‌లు బుధవారం నుండి అమలులోకి వస్తాయి. భారత్ చేసే ఎగుమతులపై విధించిన 25 శాతం అదనపు సుంకాలు ఈనెల మొదటివారంలోనే అమలులోకి రాగా, మరో 25 శాతం పెనాల్టీ సుంకాలు బుధవారం నుండి అమలులోకి వస్తాయి. అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్ మంగళవారం తరువాయి 2లో

## బాలికపై అత్యాచారం నిందితుడికి 51 ఏళ్లు జైలు

- పోక్సో కింద 20, అట్రాసిటి 20, మైనర్ బాలిక కిడ్నాప్ 10, బెదిరింపునకు ఏడాది జైలు
- బాధితురాలికి రూ.7 లక్షల రూపాయల పరిహారం
- నల్లగొండ కోర్టు సంచలన తీర్పు

ప్రజాపక్షం/నల్లగొండ

మైనర్ బాలిక ను బలవంతంగా అత్యాచారం చేసిన నిందితునికి 51 ఏళ్ల జైలు శిక్షతోపాటు జరిమానా విధించడం జరిగిందని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలానికి తరువాయి 2లో

## 30 నుంచి అసెంబ్లీ

- ఉభయ సభలు ఉదయం 10 గంటలకు భేటీ
- అదేరోజు మంత్రివర్గ సమావేశం
- స్థానిక ఎన్నికల నిర్వహణ, బిసిలకు 40శాతం రిజర్వేషన్లు, కాళేశ్వరంపై ఘోష్ కమిషన్ నివేదికపై చర్చ




ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర శాసనసభ, శాసనమండలి వర్షాకాల సమావేశాలు ఈ నెల 30వ తేదీ నుంచి జరగనున్నాయి. ఉభయ సభలు ఆరోజు ఉదయం 10.30 గంటలకు సమావేశం కానున్నాయి. తెలంగాణ 3వ శాసనసభ 6వ సమావేశాలను, శాసనమండలి 24వ సమావేశాలను 30వ తేదీ నుంచి నిర్వహించాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆదేశాలను జారీ చేశారు. ఈ మేరకు తెలంగాణ లెజిస్లేచర్ సెక్రటరీ డాక్టర్ వి.నరసింహాచార్యులు మంగళవారం సర్క్యులర్ జారీ చేశారు. కాగా తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఆగస్టు 30న మధ్యాహ్నం తరువాయి 2లో

## సాదా బైనామాలకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్

- 2020 అక్టోబర్ 12 నుంచి నవంబర్ 10 వరకు స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారానికి అనుమతులు
- 9 లక్షలకు పైగా దరఖాస్తులకు మోక్షం : మంత్రి పొంగులేటి
- సాధ్యమైనంత త్వరగా సాదాబైనామాలు పరిష్కరిస్తామని వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్



కొన్నేళ్లుగా అమలుకాకుండా ఉన్న సాదా బైనామాల క్రమబద్ధీకరణకు అవరోధాలు తొలగిపోయాయి. హైకోర్టులో ఉన్న స్టే తొలగింపుతో రెగ్యులరైజేషన్‌కు గ్రీన్ సిగ్నల్ లభించింది. సాదాబైనామా క్రమబద్ధీకరణ నిమిత్తం ఐదేళ్ల క్రితం రాష్ట్ర సర్కార్ జీవో 112ను జారీ చేయగానిర్మల్ జిల్లాకు చెందిన షిండే దేవిదాస్ సవాలు చేస్తూ పిల్ దాఖలు తరువాయి 2లో

## బంగాళాఖాతంలో అల్పపీడనం



- రానున్న ఐదురోజులు భారీ వర్షాలు
- పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిక

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో రాగల ఐదురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. ఒడిశా తీరాన్ని ఆనుకొని వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని వెల్లడించారు. తుఫాను ప్రసరణ సముద్రమట్టానికి సగటున 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందన్నారు. ఎత్తుకు వెళ్లేకొద్దీ నైరుతి వైపునకు వంగి ఉందని తెలిపారు. పశ్చిమ వాయువ్య దిశగా కదిలి రాబోయే రెండురోజుల్లో మరింత బలపడే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలో మంగళవారం భూపాలపల్లి, ములుగు తరువాయి 2లో

## రాజ్యాంగాన్ని రక్షించాలంటే... ఓటు హక్కు కాపాడుకోవాలి

- ఓటు చోరీ వల్లే మరో 50 ఏళ్లు పాలిస్తామంటున్న అమిత్ షా
- 'ఓట్ అధికార్ యాత్ర'లో రాహుల్‌గాంధీ విమర్శ
- యాత్రలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**సుపౌల్ :** బిహార్‌లో జరుగుతున్న ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వంపై ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ మాటల దాడిని ముమ్మరం చేశారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి ప్రజలు తమ ఓటు హక్కును కాపాడుకోవాలని అన్నారు. బిహార్‌లోని ఎస్ఐఆర్ బిజెపి, ఇసి చర్యలను బహిర్గతం చేసింది, అందువల్ల ప్రజలు కాషాయ పార్టీ నాయకులను 'ఓటు చోర్' అని పిలవడం ప్రారంభించారని, కాంగ్రెస్ 'ఓటర్ అధికార్ యాత్ర'లో భాగంగా మధుబని జిల్లాలో మంగళవారం జరిగిన తరువాయి 2లో

## దొంగ ఓట్లు తొలగించి ఎన్నికలకు వెళదామా?

- కాంగ్రెస్ గెలిస్తే రాజకీయ సన్యాసం
- హిందూ ఓటు బ్యాంకుతోనే గెలిచా
- కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు



ప్రజాపక్షం/కరీంనగర్

దొంగ ఓట్లతో బిజెపి నేతలు గెలిచారని, దేవుళ్ల పేరుచెప్పి ఓట్లడుగుతారని, దేవుళ్ల పేరుతో రాజకీయాలు చేస్తారని జనహిత కార్యక్రమంలో పిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చేసిన ఆరోపణలపై మంగళవారం కరీంనగర్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్రంగా స్పందించారు. ఓట్ల కోసం బిచ్చమెత్తుకునే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, తరువాయి 2లో

## రాజకీయ సన్యాసానికి సిద్ధంగా ఉండు



- రాముడి పేరు చెప్పకుండా గెలవగలవా?
- బిజెపి, కాంగ్రెస్ పాలనలపై చర్చకు సిద్ధమా?
- బండి సంజయ్‌కి మహేష్‌కుమార్ సవాల్

ప్రజాపక్షం / హైదరాబాద్

దేశంలో 12 ఏళ్ల బిజెపి పాలన, తెలంగాణ రాష్ట్రంలో ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనపై కరీంనగర్ నడిబొడ్డున చర్చకు సిద్ధమా? అని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని సవాల్ చేశారు. బిజెపి ఇచ్చిన హామీ మేరకు గత 12 ఏళ్ల బిజెపి పాలనలో 24 కోట్ల ఉద్యోగాలు భర్తీ కావాలని, తెలంగాణకు తరువాయి 2లో

## రాజ్యాంగ సంస్థలపై తీవ్ర ప్రభావం

- వాటిని తిరిగి గాడిలో పెట్టేందుకు దృఢంగా ఆలోచించాలి
- ఇండియా కూటమి వెలుపలి వ్యక్తులూ తనకు మద్దతు ఇస్తున్నందుకు కృతజ్ఞతలు
- జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి



**న్యూఢిల్లీ :** రాజ్యాంగ సంస్థలపై తీవ్ర ప్రభావం ఉందని, వాటిని తిరిగి గాడిలో పెట్టేందుకు దృఢంగా ఆలోచించాల్సిన అవసరం ఉందని ప్రతిపక్షాల రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి అన్నారు. ఉపరాష్ట్రపతి పదవి రాజ్యాంగ పదవి అని పునరుద్ఘాటించారు. రాష్ట్రపతి తర్వాత అత్యున్నతపదవి అయిన ఉపరాష్ట్రపతి పదవి రాజకీయ పదవి కాదని, అది ఉన్నతమైన రాజ్యాంగ పదవి అని సుదర్శన్‌రెడ్డి అన్నారు. తాను రాజ్యాంగ విలువలకు దృఢంగా కట్టుబడి ఉన్నానని, వాటిని తరువాయి 12లో

## రెండు,మూడు వారాల్లో గాజా యుద్ధం ముగియొచ్చు

డొనాల్డ్ ట్రంప్ సంకేతాలు

**వాషింగ్టన్ :** గాజాలో యుద్ధం రెండు మూడు వారాలలో ముగిసిపోవచ్చునని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంకేతాలు ఇచ్చారు. గాజాలో జర్నిస్టుల మరణాలపట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "రాబోయే రెండు మూడు వారాల్లో యుద్ధం మంచి ముగింపునకు రావడం మీరు చూడొచ్చు, యుద్ధ పరిష్కారం కోసం చాలా ఉద్ధృతంగా, చిత్తశుద్ధితో ప్రయత్నాలు జరుగుతున్నాయి" అని వాషింగ్టన్ ఓవల్ ఆఫీసులో మంగళవారం పాత్రికేయులతో ట్రంప్ చెప్పారు. ఆగస్టునెలలో 15 రోజుల తేడాలో తరువాయి 12లో





# ప్రపంచం
WORLD NEWS

## పాలస్తీనాను గుర్తించేందుకు జర్మనీ తిరస్కృతి

**బెర్లిన్:** పాలస్తీనాను సార్వభౌమాధికార,స్వయంప్రతిపత్తిదేశంగా గుర్తించేందుకు జర్మనీ తిరస్కరించింది. సెప్టెంబరునెలలో పలు యూరప్ దేశాలు పాలస్తీనాను స్వయంప్రతిపత్తిగల దేశంగా గుర్తించేందుకు సిద్ధమవుతున్న తరుణంలో జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ మాట్లాడుతూ, ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో పాలస్తీనాను ఒక దేశంగా గుర్తించేందుకు పశ్చిమ దేశాలు చొరవ చేసి తీసుకున్న నిర్ణయంలో తమదేశం భాగస్వామి కావడంలేదని స్పష్టం చేశారు. కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీతో సంయుక్త పత్రికాగోష్ఠిలో ఆయన ఈ విషయం ప్రకటించారు. ''తమ ఫెడరల్ ప్రభుత్వ వైఖరి చాలా స్పష్టంగా ఉంది, మార్క్ కార్నీకి తెలుసు, ఆ పరిస్థితులు ఇంకా వచ్చినట్లు మాకు అనిపించడంలేదు, పశ్చిమ దేశాలు తీసుకున్న చొరవలో మేం భాగస్వామ్యం కావడంలేదు'' అన్నారు. గతనెలలో బ్రిటన్, ఫ్రాన్స్‌దేశాలు పాలస్తీనాను ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో ఒక స్వయంప్రతిపత్తిగల దేశంగా గుర్తిస్తామని ప్రకటించిన తర్వాత కెనడా కూడా అదేబాటలో పయనిస్తుందని, పాలస్తీనాను గుర్తించిన మూడవ జి–7 దేశం తమదేనని ప్రధాన మంత్రి మార్క్ కార్నీ ప్రకటించారు. 193దేశాలలో 147 దేశాలు ఇప్పటికే లాంఛనంగా పాలస్తీనాను స్వయంప్రతిపత్తిగల దేశంగా గుర్తించాయి.

## ఇజ్రాయెల్‌లో మిన్నంటిన నిరసన ప్రదర్శనలు

**స్తంభించిన ప్రధాన రహదారులు, కూడళ్లు**
**ఒప్పందం చేసుకోవాలని నెతన్యాహూపై ఒత్తిడి**



**టెల్‌అవీవ్:** హమాస్ చెరలో ఉన్న బందీలను విడుదల చేయాలని, కాల్పుల విరమణ ఒప్పందం చేసుకోవాలని నెతన్యాహూ ప్రభుత్వంపై ఒత్తిడిచేస్తూ ఇజ్రాయెల్ వ్యాప్తంగా మంగళవారం నిరసనలు మిన్నంటాయి. దక్షిణగాజాలోని నస్సెర్ ఆసుపత్రిపై ఐడిఎఫ్ భీకర హింసాత్మకదాడికి పాల్పడిన మరునాడే ఇజ్రాయెల్ అంతటా నిరసన వెల్లువ పెల్లుబికింది. అనేక ప్రాంతాలలో రోజంతా నిరసనలు కొనసాగాయి. కాల్పుల విరమణను ఖరారు చేయాలని డోనాల్డ్ ట్రంప్‌ను కోరుతూ ప్రదర్శకులు నినాదాలు చేశారు. దేశంలో దాదాపు ప్రధాన రహదారులన్నీ స్తంభించిపోయినట్లు పోలీసులు చెప్పారు. ప్రజలకున్న నిరసన తెలియజేసే హక్కును కాపాడేందుకు తాము అన్ని భద్రతా చర్యలూ తీసుకున్నట్లు పోలీసులు చెప్పారు. బందీల బంధువులు, గల్లంతైనవారి కుటుంబీకులు, మిత్రుల వేదిక ఆధ్వర్యంలో టెల్‌అవీవ్‌లో భారీ నిరసన ప్రదర్శనలు జరిగాయి. మంగళవారం రోజంతా నగరం అంతటా ఈ ప్రదర్శనలు కొనసాగాయి. సాయంత్రం టెల్‌అవీవ్‌లోని సావిడోర్ ట్రైన్ స్టేషన్ నుండి హోస్టేజెస్ స్కేవర్ వరకు జరిగిన భారీ ప్రదర్శన, సమావేశం తర్వాత నిరసనలు ముగిశాయి. ఉదయం ఆరున్నర గంటలకే ప్రదర్శకులు వీధుల్లోకి దూసుకువచ్చారు. అన్ని ప్రధాన కూడలి ప్రాంతాలకూ చేరుకుని వాహనాలు కదలకుండా అడ్డుకున్నారు. ట్రాఫిక్‌ను స్తంభింపజేశారు. తక్షణం యుద్ధం నిలిపివేయాలని, బందీల విడుదలకు ఒప్పందం చేసుకోవాలని కోరారు. రహదారులపై రాకపోకలు స్తంభించాయి. 30 కి.మీ మేరకు ట్రాఫిక్ రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. అయోలెన్ హైవేపై దక్షిణ దిశగా వెళ్ళే వాహనాలను ప్రదర్శకులు నిలిపివేశారు. రాజధాని టెల్‌అవీవ్‌లో అమెరికా దౌత్య కార్యాలయంవద్ద ప్రదర్శకులు గుమిగూడి ఇజ్రాయెల్ పతాకాలను ప్రదర్శిస్తూ, నిరసన తెలియజేశారు. బందీల విడుదలకు తక్షణం ఒప్పందం చేసుకోవాలని, అసలు హమాస్ చెరలో ఎంత మంది బందీలు సజీవులుగా ఉన్నారో తాజా గణాంకాలను విడుదల చేయాలని కోరుతూ ప్రదర్శకులు వేలాదిమంది వీధుల్లోకి వచ్చారు. గడచిన మూడు నెలలుగా బందీల బంధువులు, మిత్రుల వేదిక నెతన్యాహూ ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి పెంచింది. హమాస్ ఉగ్రవాదులు తమ చెరలో ఉన్న బక్కచిక్కిన బందీల వీడియోలను విడుదల చేయడంతో బందీల బంధువులలో ఆందోళన తీవ్ర భావోద్వేగాలు పెల్లుబుకుతున్నాయి. బందీలు సజీవంగా ఉండగానే వారి సమాధులను వారిచేతే తవ్వించే దృశ్యాలున్న వీడియోలు పోస్టు చేయడంతో బందీయులు తమ ఆందోళన ఉధృతి పెంచారు. నెతన్యాహూ తక్షణం హమాస్‌తో ఒప్పందం చేసుకుని యుద్ధం విరమించాలని కోరుతూ వారు తరచు నిరసనలు తెలియజేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలలో కూడా గాజాలో యుద్ధం విరమించాలని నెతన్యాహూపై ఒత్తిడిచేస్తూ ప్రతిరోజూ నిరసన ప్రదర్శనలు జరుగుతున్నప్పటికీ గాజా ఆక్రమణ ప్రణాళికను ఐడిఎఫ్ ముందుకు తీసుకువెళుతూ పాలస్తీనా ప్రజలను ఆకలితో మార్చిచంపే కుట్రలకు పాల్పడుతున్నది. గాజాలో 50 మంది బందీలు ఇంకా ఉండిపోయారు. కానీ వీరిలో 20 మంది మరణించారని ఇజ్రాయెల్ అధికారికంగా నమ్ముతున్నది. ఇటీవల ట్రంప్ ఒక ప్రకటన చేస్తూ, కేవలం 20 మంది బందీలు మాత్రమే సజీవంగా ఉన్నారని, వీరిలో మరో ఇద్దరు తాజాగా మరణించారని ప్రకటించడంతో ఇజ్రాయెల్‌లో బందీల బంధువులు, మిత్రు ల వేదిక నిజమైన గణాంకాలు వెల్లడించాలంటూ నిరసన ప్రదర్శనలను ఉధృతం చేసింది.

## యుద్ధ నివారణకు భారత్ తనవంతు కృషి చేయాలి:జెలెన్‌స్కీ



**కీవ్:** రష్యా చేస్తున్న యుద్ధాన్ని నివారించడంలో భారతదేశ తనవంతు కృషి చేయాలని, తాము ఈ కృషిని పరిగణనలోకి తీసుకుంటామని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పేర్కొన్నారు. యుద్ధాన్ని నివారించేందుకు ఉక్రేన్‌కు భారతదేశం కూడా సహకరించాలని కోరారు. ఉక్రేన్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ సందేశం పంపారు. ఇందుకు ప్రతిగా ఎక్స్ వేదిక ద్వారా మోదీకి జెలెన్‌స్కీ కృతజ్ఞతలు తెలియజేస్తూ పైవిధంగా స్పందించారు. శాంతి సాధనకు, చర్చల ద్వారా సమస్యల పరిష్కారంపట్ల భారత్ కనబరుస్తున్న చిత్తశుద్ధి ఎంతో శ్లాఘనీయమైనదని ఆయన ప్రశంసించారు. ''రష్యా చేస్తున్న భీకర యుద్ధాన్ని ఎంతో హుందాగా, మర్యాదకరమైన పద్ధతులలో ముగించి, దీర్ఘకాలిక శాంతి సాధించేందుకు ఇప్పుడు యావత్ ప్రపంచం పోరాటం చేస్తోంది, ఇందులో భారతదేశం చేసే కృషిని కూడా ఉక్రేన్ దేశం పరిగణనలోకి తీసుకుంటుంది'' అని జెలెన్‌స్కీ ఎక్స్ పోస్టింగ్‌లో పేర్కొన్నారు. ''తీసుకునే ప్రతి నిర్ణయం దౌత్యమార్గాలను మరింత పటిష్టవంతం చేసేందుకు దారితీస్తాయి, ఇది యూరప్ ప్రాంత భద్రతకు మాత్రమే కాకుండా, ఇండో–పసిఫిక్, అంతకుమించి ఇతర ప్రాంతాల భద్రతకు కూడా ఉత్తమస్థాయిలో భద్రతకు ఉపయోగపడుతుంది'' అని పేర్కొన్నారు. ఈనెల 16వ తేదీన ఉక్రేన్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మోదీ ఆ దేశ ప్రజలకు, అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఉక్రేన్ శాంతి సాధించి అభివృద్ధి మార్గంలో పయనించాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. జెలెన్‌స్కీ పోస్టింగ్‌పై మోదీ కూడా ప్రతిస్పందించారు. భారత్–ఉక్రేన్ మధ్య సన్నిహిత సంబంధాలు నెలకొనేందుకు మన ఉమ్మడి చిత్తశుద్ధికి ఎంతో విలువ ఇస్తామని మోదీ పేర్కొన్నారు.

## శ్రీలంక మాజీ అధ్యక్షుడు విక్రమసింఘేకు బెయిలు



**కొలంబో:** ప్రభుత్వ నిధుల దుర్వినియోగం కేసులో అరెస్టైన శ్రీలంక మాజీ అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే (76)కు బెయిలు లభించింది. ముగ్గురు ష్యూరిటీలు, 50 లక్షల శ్రీలంక రూపాయల పూచీకత్తుపై ఆయనను విడుదల చేయాలని కొలంబో ఫస్ట్ మెజిస్ట్రేట్ నిలుపులి లంకపుర మంగళవారంనాడు ఆదేశించారు. కొలంబో నేషనల్ ఆసుపత్రిలోని ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చికిత్సపొందుతున్న విక్రమసింఘే ఆసుపత్రి పడకమీద నుండే దృశ్యమాధ్యమ పద్ధతిలో కోర్టు విచారణ ప్రక్రియలో పాల్గొన్నారు. ఐతే విక్రమసింఘేకు బెయిలు మంజూరు చేయడాన్ని ప్రభుత్వ తరపు న్యాయవాది తీవ్రంగా వ్యతిరేకించారు. విచారణ పూర్తయ్యేవరకూ ఆయన రిమాండ్‌లో ఉండాల్సిందేనని పట్టుపట్టారు. ఐతే ఈ కేసును తిరిగి అక్టోబరు నెలాఖరులో విచారణకు చేపడతామని న్యాయమూర్తి ప్రకటించారు. విక్రమసింఘే తరపున కోర్టుకు హాజరైన న్యాయవాది థిలక్ మరపన, అనుజ ప్రేమరత్నే న్యాయమూర్తి ఎదుట వాదిస్తూ, విక్రమసింఘే గుండెలకు రక్తం సరఫరా చేసే నాలుగు నాళాలు మూసుకుపోయాయని, సరిగ్గా పనిచేయడంలేదని, ఆయన ఆరోగ్య పరిస్థితి బాగోలేదని తెలియజేశారు. భారీభద్రతా ఏర్పాట్లమధ్య కోర్టులో ఈ కేసు విచారణ జరిగింది. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేశారన్న ఆరోపణలపై సిఐడి అధికారులు ఈనెల 22వ తేదీన విక్రమసింఘేను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. తొలుత ఆయనను ప్రిజన్ ఆసుపత్రిలో చేర్చారు. అక్కడి నుండి నేషనల్ ఆసుపత్రి ఐసియుకు తరలించారు. 2023లో కుటుంబ సమేతంగా బ్రిటన్ పర్యటన సందర్భంగా 16.6 మిలియన్ శ్రీలంక రూపాయలను దుర్వినియోగం చేశారన్నది ఆయనపై ప్రధాన ఆరోపణ.

## 30 నుంచి అసెంబ్లీ

(మొదటి పేజీ తరువాయి)

1 గంటకు అసెంబ్లీ కమిటీ హాలులో జరుగనుంది. మంత్రివర్గ సమావేశం నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మంగళవారం సర్క్యులర్ జారీ చేశారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహణ, వెనుకబడిన తరగతుల (బిసి)కు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం, కాళేశ్వరంపై జస్టిస్ పిసి.ఘోష్ కమిషన్ నివేదిక, అసెంబ్లీ వర్షాకాల సమావేల నిర్వహణ తేదీల ఖరారు తదితర అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకోవచ్చని సమాచారం. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు హైకోర్టు నిర్ణయించిన కాలపరిమితి సెప్టెంబర్ 30వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్న బిసి రిజర్వేషన్ బిల్లులు ఆమోదం పొందకపోతే, అధికార కాంగ్రెస్ పార్టీ పరంగా బిసి వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని ఇప్పటికే సూత్రప్రాయంగా నిర్ణయించిన సంగతి తెలిసిందే. అయితే ఈ విషయంపై న్యాయ నిపుణుల అభిప్రాయం తీసుకోవడానికి అధికార కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. మంత్రివర్గ సమావేశానికి ముందు, ఈ కమిటీ తన నివేదికను టిపిసిసికి, అలాగే ప్రభుత్వానికి సమర్పిస్తుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నివేదికను కేబినెట్ సమావేశంలో చర్చించిన తరువాత ప్రభుత్వం ఈ అంశంపై ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. దీనితో పాటు, కాళేశ్వరంపై జస్టిస్ పిసి.ఘోష్ కమిషన్ నివేదికను కూడా క్యాబినెట్ సమావేశంలో చర్చించి, తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. రైతులకు యూరియా సరఫరా, ఇతర అంశాలపై కూడా ఈ సమావేశంలో చర్చించనున్నారు.

## ఎన్నికలకు వెళదామా? (మొదటి పేజీ తరువాయి)

ఓట్ల కోసం మసీదులకు పోయి ప్రార్థనలు చేస్తున్నట్లు నటించి జీవించే పార్టీ కాంగ్రెస్ అని విమర్శించారు. బరాబార్ హిందూ ధర్మం కోసం పనిచేస్తానని హిందూ ఓటు బ్యాంకుతోనే తాను కరీంనగర్ ఎంపిగా గెలిచానని, గల్లా ఎగిరేసి గర్వంగా చెబుతానని అన్నారు. తెలంగాణలోనూ హిందూ ఓటు బ్యాంకును తయారు చేస్తానని స్పష్టం చేశారు.

రాష్ట్రంలో అధికారంలోఉన్న కాంగ్రెస్ పార్టీ దొంగ ఓట్ల జాబితాను బయటపెట్టాలని, దొంగ ఓట్లను తొలగించాలని ఎలక్షన్ కమిషన్‌కు లేఖ రాయాలని డిమాండ్ చేశారు. అనంతరం అసెంబ్లీ రద్దుచేసి ఎన్నికలు నిర్వహించాలని... ఒకవేళ కాంగ్రెస్ ఎన్నికల్లో గెలిస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని.. ఇందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమా..? అంటూ సవాల్ విసిరారు. పార్లమెంట్ ఎన్నికల్లో 2 లక్షల 25 వేల భారీ మెజారిటీతో గెలిస్తే దొంగ ఓట్లతో గెలిచావంటూ కరీంనగర్ ప్రజలను అవమాన పరుస్తున్నారని మండిపడ్డారు. ఓట్ల చోరి జరిగిందని చెబుతున్న పీసీసీ అధ్యక్షునికి ఓట్ల గురించి ఏం తెలుసని ఎద్దేవా చేశారు. దొంగ ఓట్లతో గెలిస్తే 8 ఎంపీలు మాత్రమే ఎందుకు గెలుస్తం.. మొత్తం ఎంపీలు మేమే గెలిచేవాళ్లం కదా..? అని అన్నారు. కర్నాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రా ల్లో కాంగ్రెస్ అధికారంలోకి ఎలా వస్తుందని ప్రశ్నించారు.

గ్రామ పంచాయతీలకు కాంగ్రెస్ ప్రభుత్వం 20నెలల పాలనలో నయాపైసా ఇవ్వలేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధుల కోసమే పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తున్నారని.. పంచాయతీ ఎన్నికలపై కాగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని విమర్శించారు.

## అల్పపీడనం (మొదటి పేజీ తరువాయి)

జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశామన్నారు. కొత్తగూడెం, హన్మకొండ, జనగాం, కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, ఆసిఫాబాద్, మంచిర్యాల, నల్లగొండ, పెద్దపల్లి, సూర్యాపేట, వరంగల్, భువనగిరి, మహబూబాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయనే అంచనా ఉందన్నారు. బుధవారం కొత్తగూడెం, భూపాలపల్లి, ఆసిఫాబాద్, మంచిర్యాల, ములుగు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయన్నారు. గురువారం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయన్నారు. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని తెలిపారు. శుక్రవారం ఆదిలాబాద్, కొత్తగూడెం, హన్మకొండ, హైదరాబాద్, జగిత్యాల, జనగాం, భూపాలపల్లి, కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి, ములుగు, నల్లగొండ, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వికారాబాద్, వరంగల్, భువనగిరి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. శనివారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, భూపాలపల్లి, కామారెడ్డి, ఆసిఫాబాద్, మంచిర్యాల, మెదక్, ములుగు, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని తెలిపారు.

## 51 ఏళ్లు జైలు (మొదటి పేజీ తరువాయి)

చెందిన మైనర్ బాలికపై అత్యాచారం కేసు మూడున్నర ఏండ్లు అనంతరం ఫోక్సో న్యాయస్థానం ఇన్చార్జి రోజా రమణి మంగళవారం తుది తీర్పు వెల్లడించిందన్నారు.ఘటనలో నిందితుడు ఖయ్యూం పై న 2015 న తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి విచారణ అనంతరం కోర్టులో ఛార్జ్ సీట్ దాఖలు చేయగా మంగళవారం ఏడిజె2 కమ్ ఎస్‌సి,ఎస్‌టి కోర్టు అత్యాచారం ఫోక్సో కేసుల కోర్ట్ నిందితున్ని దోషిగా నిర్ధారించి,సెక్షన్376 ఐపిసి అండ్ పోక్సో చట్టం2012 యాక్ట్ ప్రకారం 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష,రూ.25వేలు జరిమానా అదేవిదంగా ఎస్‌సి,ఎస్‌టి చట్టం ప్రకారం 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష,రూ.25వేలు జరిమానాతో పాటు మైనర్ బాలిక కిడ్నాప్ కింద 10 సంవత్సరాల కారాగార శిక్ష,రూ.25వేలు జరిమానా,నేరమైన బెదిరింపుకు1 సంవత్సరపు కారాగార శిక్ష రూ.5వేలు జరిమానా మొత్తం గా 51 సంవత్సరాల కారాగార శిక్ష రూ.85వులు జరిమానా విదించడం జరిగింది.కేసులో బాధితురాలికి రూ.7 లక్షల రూపాయల పరిహారంగా జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా అందించాలని తీర్పు వెలువడిందని తెలిపారు.ఈ కేసులో సరి అయిన సాక్ష్యదారలు సేకరించి కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు సమర్పించి నిందితునికి శిక్ష పడే విధంగా చేసిన ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ డిఎస్‌పి వెంకట్ రెడ్డి, ఏఎస్ఐ మట్టయ్య,ప్రాసెక్యూషన్ కు సహకరించిన నల్లగొండ డిఎస్‌పి కె.శివరాం రెడ్డి, సిఐ కె.కొండల్ రెడ్డి, తిప్పర్తి ఎస్ఐ వి.శంకర్,పబ్లిక్ ప్రాసిక్యూటర్స్‌వేముల రంజిత్ కుమార్, సిడిఓ కిరణ్ కుమార్ ,లైజన్ అధికారులు పి.నరేందర్, మల్లికార్జున్ లను జిల్లా ఎస్‌పి అభినందించారు.

## స్థానిక కసరత్తు (మొదటి పేజీ తరువాయి)

రూపొందించనున్నారు. ఆగస్టు 28వ తేదీ లోపు గ్రామ పంచాయతీల ముసాయిదా ఓటర్ల జాబితా తయారీ చేసి గ్రామ పంచాయతీ, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను ప్రదర్శించాలని నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. ఆగస్టు 29వ తేదీన ఎంపిడిఓల ద్వారా మండల స్థాయిలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించనున్నారు. ఆగస్టు 30వ తేదీ న ఓటర్ల జాబితాపై అభ్యంతరాల స్వీకరిస్తామని ఎన్నికల సంఘం వెల్లడించింది. అలాగే ఆగస్టు 31వ తేదీన జిల్లా పంచాయతీ అధికారి గ్రామ పంచాయతీ ల వార్డుల వారీగా ఫొటో ఓటర్ల తుది జాబితాలను ప్రచురణ చేస్తారని ఎన్నికల సంఘం తెలిపింది. ఈ ఏడాది సెప్టెంబర్ 30వ తేదీలోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని తెలంగాణ హైకోర్టు ఆదేశించిన విషయం తెల్సిందే. గడువు ముగిసిన స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం లేదంటూ పలువురు తెలంగాణ హైకోర్టులో పిటిషన్‌లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లను విచారించిన హైకోర్టు సెప్టెంబర్ 30వ తేదీలోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించింది.

## సిద్ధంగా ఉండు (మొదటి పేజీ తరువాయి)

ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చర్చిద్దామా? అని నిలదీశారు. కేంద్రం నుండి రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టుల కేటాయింపులో అన్యాయం జరుగుతుందని ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేక దాట వేస్తూ పక్కదారి పట్టిస్తున్నారని ఆయన విమర్శించారు. స్థానిక ఎన్నికల్లో బిజెపికి ఘోర పరాజయం తప్పదని, రాజకీయ సన్యాసం తీసుకోవడానికి బండి సంజయ్ సిద్ధంగా ఉండా లన్నారు. ఈ మేరకు మహేష్ కుమార్‌గౌడ్ మంగళవారం ఒక ప్రకటన విడేదల చేశారు. 'కేంద్ర మంత్రిగా తెలంగాణకు, కరీంనగర్‌కు ఏమీ చెశారో లెక్కలు చెప్పగలవా? కరీంనగర్‌కు ఎన్ని ప్రాజెక్టులు తెచ్చారు? ఎంతమంది యువత కు ఉద్యాగాలు ఇప్పించారు? బిసిలకు 42 శాతం రిజర్వేషన్లపై కేంద్రం అన్యాయం చేస్తున్నా బిసి బిడ్డగా ఎందుకు ప్రశ్నించడంలేదు? మతం పేరుతో గెలుస్తూ భావోద్వేగాలను రెచ్చగొడు తుంది మీరు కాదా?' ముస్లిం పేరుతో బిసి రిజర్వేషన్లు అడ్డుకుంటున్న బిజెపి నేతలు బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ముస్లింలు బిసిల్లో ఉండడంపై ఏమి సమాధానం చెబుతారు? అక్కడ ముస్లింలకు రిజర్వేషన్లు ఇస్తే అభ్యంతరం లేనిది తెలంగాణాలో ఇస్తే తప్పేటి? ముస్లింలలో పేదలు లేరా? వారికి న్యాయం జరగకూడదా? అని బండి సంజయ్‌కి మహేష్‌కుమార్ గౌడ్ ప్రశ్నల వర్షం కురిపించారు. 'ఈ ప్రశ్నలకు సమాధానం లేని బండి సంజయ్ రాజకీయ సన్యాసం తీసుకోవడానికి సిద్ధంగా ఉండాలి. సంజయ్‌కి సన్యాసం ఖాయం. మఠంలో ఆయనకు స్థిర నివాసం ఖాయం' అని ఆయన పేర్కొన్నారు. ఓట్ల చోరీపై రాహుల్ గాంధీ నిర్దిష్టంగా ఆధారాలతో నిరూపించడంతో సమా ధానం చెప్పుకులేక బిజెపి విషయాన్ని పక్కదారి పట్టిస్తుందన్నారు.

యూరియా కొరతతో రైతులు అనేక అవస్థలు పడుతుంటే చొరవ తీసుకొని మాట్లాడలేని కేంద్ర మంత్రి బండి సంజయ్ అని మహేష్‌కుమార్ విమర్శించారు. బండి సంజయ్ కేంద్ర హోం మంత్రిగా ఉండి రోహింగ్యాల గురించి మాట్లాడితే ఎలా అని ప్రశ్నించారు. బండి సంజయ్ కార్పొరేటర్ కాదని, కేంద్ర మంత్రి అనే సంగతి మర్చిపోవద్దని, కరీంనగర్ ఎంఎల్‌ఏగా ఎన్నిసార్లు పోటీ చేసి ఓడిపోయారో గుర్తు లేదా అన్నారు.

## కాపాడుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

బహిరంగ ర్యాలీలో రాహుల్ పేర్కొన్నారు. బిజెపి నాయకులు ఎన్నికల కమిషన్ ద్వారా ఓటు చోరీలో మునిగిపోతున్నారని మండిపడ్డా రు. ప్రజలు తమ ఓటు హక్కును కాపాడుకోవడానికి, భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవడానికి ముందుకు రావాలి అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు అన్నారు. ప్రజలు తమ ఓటు హక్కును కోల్పోతే, రాజ్యాంగాన్ని రక్షించలేరని గుర్తుంచుకోవాలన్నారు. బిజెపికి సహాయం చేయడానికి బిహార్‌లోని 65 లక్షల మంది ఓటర్ల పేర్లను ఇసి ఓటర్ల జాబితా నుండి తొలగించిందని, ఇప్పుడు 65 లక్షల మంది ఓటర్లను చేర్చుతామని ఆయన అన్నారు. బిజెపి ప్రభుత్వం మరో 40–50 సంవత్సరాలు కొనసాగుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెప్పారని, వారు 'ఓటు చోరీ'లో పాల్గొంటున్నందున ఆయన అలా చెప్పారని ఇప్పుడు తమకు అర్థమైందని ఎద్దేవా చేశారు. అది గుజరాత్ నుండే ప్రారంభమైందన్నారు. బిజెపి 'ఓటు దొంగతనం' చేసిందని తాను చేసిన ఆరోపణపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లేదా అమిత్ షా ఒక్క మాట కూడా మాట్లాడలేదన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ రాజ్యాంగాన్ని గౌరవించదని, ఎందుకంటే ప్రతి ఒక్కరికి సమాన హక్కులను ఇవ్వడం వారికి నచ్చదని విమర్శించారు. కాగా, 'ఓటర్ అధికార్ యాత్ర'లో కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా మంగళవారం తన సోదరుడితో కలిసి పాల్గొన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆర్‌జెడి నాయకుడు తేజస్వి యాదవ్, ఇండియా కూటమికి చెందిన ఇతర ప్రతినిధులతో పాటు వాద్రా, గాంధీ ఎస్‌యువి పైకప్పుపై కూర్చుని కనిపించారు. ఒక రోజు విరామం తర్వాత మంగళవారం యాత్ర తిరిగి ప్రారంభమైంది. ఆదివారం అరారియాలో విలేకరుల సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ బిహార్‌లోని అన్ని ఇండియా కూటమి నియోజకవర్గాలు రాబోయే అసెంబ్లీ ఎన్నికల కోసం ఐక్యంగా పనిచేస్తున్నాయని, ఫలితాలు ఫలవంతంగా ఉంటాయని ఆయన నొక్కి చెప్పారు.

## అదనపు సుంకాలు (మొదటి పేజీ తరువాయి)

ఈ ముసాయిదా ఉత్తర్వు జారీ చేసింది. మనదేశం నుండి ఎగుమతయ్యే 48.2 బిలియన్ డాలర్లు కంటే ఎక్కువ విలువైన సరుకులపై ఈ అదనపు సుంకాల భారం పడుతుంది. భారత్ నుండి అమెరికాలోకి ప్రవేశించే మొత్తం సరుకులపై కొన్ని మినహాయింపులతో 50 శాతం సుంకాలను ఇకపై చెల్లించాల్సి ఉంటుంది. ట్రంప్ విధించిన 25 శాతం అదనపు సుంకాలు ఆగస్టు ఏడో తేదీనుండి అమలులోకి వచ్చాయి. రష్యాతో భారీ వాణిజ్యం చేస్తూ ఉక్రేన్‌లో యుద్ధానికి పరోక్షంగా భారత్ ఆజ్యం పోస్తోందని ఆరోపిస్తూ విధించిన మరో 25 శాతం జరిమానా సుంకాలు ఆగస్టు 27 నుండి అమలులోకి వస్తాయని ప్రకటించారు. రష్యా నుండి ముడి చమురు, సైనిక సామాగ్రి దిగుమతి చేసుకుంటున్నందుకుగాను ఈ జరిమానా విధించారు. అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 12.01 గంటల నుండి (ఆగస్టు 27) అమెరికాలోకి ప్రవేశించే భారత సరుకులపై ఈ పెనాల్టీ సుంకాలు అమలులోకి వస్తాయని ప్రకటించింది. టెక్స్‌టైల్స్, క్లోతింగ్,వజ్రాలు, ఆభరణాలు, రొయ్యలు, తోలు వస్తువులు, చెప్పులు, జంతు ఉత్పత్తు, రసాయనాలు, ఎలక్ట్రికల్స్, మెకానికల్ యంత్రాల దిగుమతులపై అమెరికా ఈ అదనపు సుంకాలను వసూలు చేస్తుంది. ఔషధరంగం, ఇంధన ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు కూడా ఈ సుంకాల పరిధిలోకి వస్తాయి. ఐతే పైన పేర్కొన్న అమెరికా కాలమానం కంటే ముందుగానే నౌకల్లోకి ఎగుమతి చేసిన సరుకులకు ఈ సుంకాల నుండి మినహాయింపు లభిస్తుందని కూడా అమెరికా జారీ చేసిన ముసాయిదా నోటీసు వెల్లడించింది.

ప్రపంచంలో అమెరికాతో వాణిజ్యం చేస్తున్న దేశాలలో బ్రెజిల్‌పై అత్యధికంగా ట్రంప్ సుంకాలు విధించారు. ఆ తర్వాత రెండో స్థానంలో భారత్‌పై భారీగా సుంకాలు విధిం చారు. మిగిలిన దేశాలన్నీ అమెరికా వసూలు చేసే సుంకాలలో తర్వాతస్థానాల్లోనే ఉన్నాయి. భారత వాణిజ్య మంత్రిత్వశాఖ సమాచారం ప్రకారం 48.2 బిలియన్ డాలర్లు విలువైన సరుకులపై ఈ అదనపు సుంకాలభారం పడుతుంది. ఈ విధంగా సుంకాలు విధించడం అన్యాయం, అక్రమం అని భారతదేశం ఆగస్టు ఆరోతేదీన ప్రకటించింది. అన్నిదేశాలూ తమ తమ ప్రయోజనాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నాయని, భారత్ కూడా అదే మార్గంలో ప్రయాణించిందని వివరణ ఇచ్చింది. 2021–22 నుండి భారతదేశం అమెరికాకు అతిపెద్ద వాణిజ్యభాగస్వామిగా కొనసాగుతోంది. 2024–25లో రెండు దేశాల మధ్యా ద్వైపాక్షిక వాణిజ్య ఎగుమతులు 131.8 బిలియన్ డాలర్లుకు చేరుకున్నాయి.

## హైకోర్టు గ్రీన్ సిగ్నల్ (మొదటి పేజీ తరువాయి)

చేశారు. 2020లో వెలువడిన జీవోను రద్దు చేయాలని కోరగా అదే ఏడాది నవంబర్‌లో హైకోర్టు స్టే ఇచ్చింది. ఆర్ఓఆర్ యాక్ట్ 71 రద్దు అవ్వడంతో భూభారతి చట్టం అమల్లోకి వచ్చిందని ప్రభుత్వం చెప్పింది. పాత చట్టం మేరకు వేసిన పిల్‌లోని స్టే ఎత్తివేయాలని కోరింది. ఈ మేరకు అనుబంధ పిటిషన్ వేసింది. కొత్త చట్ట నిబంధనలకు అనుగుణంగా తాము కూడా సవరణ పిటిషన్ వేశామని, స్టేను కొనసాగించాలని పిటిషనర్ కోరారు. దీనిపై స్పందించిన హైకోర్టు, పాత చట్టంలోని నిబంధనలను సవాల్ చేసిన పిల్ విషయంలో కొత్త చట్ట నిబంధనలను కూడా ఎందుకు ఉత్తర్వులు ఎలా కోరతారని ప్రశ్నించింది. గతంలో పలుసార్లు వాయిదాలు తీసుకుని ఇప్పుడు సవరణ పిటిషన్ వేయడంలో ఉద్ధేశ్యం ఏమిటని కూడా అడిగింది. ఇప్పుడు సవరణ పిటిషన్‌ను అనుమతిస్తే, మరింత జాప్యం అవుతుందని చెప్పింది. పాత చట్టం స్థానంలో కొత్త చట్టం వచ్చినందున కొత్తగా పిల్ దాఖలు చేసుకోవచ్చునని పిటిషనర్‌కు వెసులుబాటు కల్పించింది. పాత పిల్‌లోని విషయాలను ఆధారంగా చేసుకుని కొత్త చట్టంలోని అంశాలపై ఉత్తర్వులు కోరడం సబబు కాదని పేర్కొంది కొత్త అంశాలతో దాఖలు చేసిన సవరణ పిటిషన్‌ను అనుమతి ఇవ్వలేమని వెల్లడించింది. కొత్త చట్టం తీసుకువచ్చిన ప్రభుత్వం సన్న, మధ్యతరగతి రైతులకు చెందిన సాదా బైనామాల క్రమబద్ధీకరణకు గత మధ్యంతర ఉత్తర్వులు అడ్డంకిగా ఉన్నాయని చెబుతోందని గుర్తు చేసింది. పాత చట్టం మేరకు దాఖలైన పిల్‌ను విచారణ కొనసాగింపు వ్యర్థం అవుతుందని స్పష్టం చేసింది. దీంతో సాదా జైనామాల క్రమబద్ధీకరణకు అవరోధాలు తొలగిపోయాయి. ఈ మేరకు చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్లతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం తుది ఉత్తర్వులను జారీ చేసింది. పిల్‌పై విచారణను కొనసాగించేందుకు నిరాకరించింది. ఇకపై విచారించాల్సిన అవసరంలేదంది. పాత చట్టానికి బదులుగా వచ్చిన కొత్త చట్ట నిబంధనలను కూడా సవాల్ చేస్తూ పిల్‌ను సవరిస్తూ అనుబంధ అఫిడవిట్ వేశామన్న పిటిషనర్ అభ్యర్థనను తిరస్కరించింది. కొత్త చట్ట నిబంధనలపై పిటిషన్ వేసుకోవచ్చునని హితవు చెప్పింది. సాదా బైనామాల క్రమబద్ధీకరణ జీవోను సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిల్‌ను గతంలో విచారించిన హైకోర్టు, క్రమబద్ధీకరణకు జీవో అమలును నిలిపివేస్తూ. 2020 నవంబర్ 11న మధ్యంతర స్టే ఇచ్చింది. కొత్త చట్టం తెచ్చామని, గతంలోని స్టేను రద్దు చేయాలని కోరుతూ ప్రభుత్వం మధ్యంతర పిటిషన్ దాఖలు చేసింది.దీనితోపాటు ప్రధాన పిటిషన్‌లను కలిపి బెంచ్ విచారణ జరిపి ఈ ఉత్తర్వులను వెలువరించింది. అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి వాదిస్తూ, 2014కు ముందు 12 ఏళ్లుగా సాదా బైనామాల కింద కొనుగోలు చేసిన భూములను క్రమబద్ధీకరణకు ప్రభుత్వం జీవో ఇచ్చిందన్నారు. ప్రభుత్వ గడువు మేరకు సుమారు 9.25 లక్షల అప్లికేషన్లు ప్రభుత్వానికి అందాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా భూభారతి చట్టం తీసుకువచ్చిందని, ఇందులో సెక్షన్ 6 ప్రకారం 2014కు ముందు 12 ఏళ్లపాటు భూమి స్వాధీనంలో ఉన్నవారికి క్రమబద్ధీకరణ చేసేందుకు ఆస్కారం ఉందన్నారు.

పిటిషనర్ తరఫు సీనియర్ అడ్వకేట్ ప్రభాకర్ వాదిస్తూ, పాత చట్టంలోని నిబంధనల మేరకు పిల్ వేసిన మాట వాస్తవమేనని, అయితే, ప్రభుత్వం కొత్తగా రూపొందించిన భూభారతి చట్ట నిబంధనను కూడా సవాలు చేస్తూ సవరణ పిటిషన్ వేసినట్లు చెప్పారు. పిల్‌ను విచారించాకే తుది ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. పాత చట్టం బదులు కొత్తచట్టంలోని నిబంధన వచ్చిందని ప్రభుత్వం చెప్పి స్టే ఎత్తివేయాలని కోరడం చెల్లదన్నారు. సవరణ పిటిషన్ లోని అంశాలను పరిశీలిస్తే స్టే ఎత్తివేయాల్సిన అవసరం లేదన్నారు. సవరణ పిటిషన్‌పై వాదనలకు అనుమతి ఇవ్వాలని కోరారు. కొత్త చట్టంలో కూడా పాతదరఖాస్తులను మాత్రమే అనుమతిస్తున్నారని చెప్పారు. కొత్తవాటిని తీసుకోకపోవడం లేదన్నారు. ఇది వివక్ష కిందకే వస్తుందన్నారు. కొత్తగా పిల్ దాఖలు చేస్తామని, కనీసం వారం రోజుల వరకు సాదా బైనామాల క్రమబద్ధీకరణకు ఆదేశాలు ఇవ్వొద్దని కోరారు. ఇరుపక్షాల వాదనల తర్వాత హైకోర్టు పిల్‌పై విచారణ అవసరం లేదని చెప్పి గతంలోని స్టేను ఎత్తివేయడంతో సాదా జైనామాల క్రమబద్ధీకరణకు అడ్డంకులు తొలగిపోయాయి.

భూభారతి చట్టం ద్వారా సాదా బైనామాల దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. సాదా బైనామాల దరఖాస్తులను పరిష్కరించి, పేదలకు న్యాయం చేయాలన్న ఆలోచనతో తమ ప్రభుత్వం నిరంతరం హైకోర్టులో కేసుకు సంబంధించిన అంశాలపై ప్రత్యేక కృషి చేసిందని పేర్కొన్నారు. సాదాబైనామాలపై ఉన్న స్టేను హైకోర్టు తొలగించిన నేపథ్యంలో లక్షలాది మంది పేద ప్రజల కలలను సాకారం చేస్తుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాదా బై నామాల విషయంలో గత ప్రభుత్వం పేద ప్రజలను నమ్మించి మోసం చేసిందన్నారు. ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించినప్పటికీ 2020 ఆర్ ఓ ఆర్ చట్టంలో ఆ దరఖాస్తుల పరిష్కారానికి మార్గం చూపించలేదని ఆరోపించారు. తద్వారా 9.26 లక్షల దరఖాస్తులు పరిష్కారం కాలేదన్నారు. సాధాబైనాలమకు భూభారతి చట్టంలో స్పష్టమైన నిబంధనలను పొందుపరిచామని, ఇప్పటికే దీనికి సంబంధించిన గ్రౌండ్ వర్క్ పూర్తి చేశామన్నారు. రోల్ మోడల్‌గా నిలిచిన ఈ భూభారతి చట్టం మేరకు రైతులు, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు సదస్సులు నిర్వహించగా 8.60 లక్షల దరఖాస్తులు వచ్చాయని వివరించారు. ప్రతి దరఖాస్తుకూ పరిష్కారాన్ని చూపించాలనే కృత నిశ్చయంతో తమ ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## లొంగిపోయిన ఎనిమిది మంది మావోయిస్టు దళసభ్యులు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** నిషేదిత మావోయిస్టు పార్టీకి చెందిన ఎనిమిది మంది దళసభ్యులు మంగళవారం ఎస్‌పి రోహిత్ రాజ్ ముందు లొంగిపోయారు. ఈ మేరకు ఎస్‌పి వారిని మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఆపరేషన్ చేయూతలో భాగంగా పోలీసులు కల్పిస్తున్న సదుపాయాలను తెలుసుకుని నక్సలిజాన్ని వీడి జన జీవన స్రవంతిలో కలిసేందుకు ఎనిమిది మంది లొంగిపోయినట్లు చెప్పారు. ఇప్పటి వరకు 314 మంది లొంగిపోయారని, వారికి ప్రభుత్వం తరుపున పునరావాసం కల్పించామన్నారు. ప్రస్తుతం భద్రాద్రికొత్తగూడెం జిల్లా నుండి ఐదుగురు సభ్యులు మావోయిస్టు పార్టీలో పనిచేస్తున్నారని, దళంలో ఉన్న వారు మావోయిస్టు పార్టీని వీడి కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంతమైన జీవితాన్ని గడిపేందుకు ముందుకు రావాలన్నారు. తక్షణ సహాయం కింద ఒక్కొక్కరికి రూ. 25వేలు చొప్పున మొత్తం రూ.2 లక్షలు ఇచ్చారు. వారి ర్యాంకుల ఆధారంగా మిగతా నగదు, ఆధార్ కార్డులు, బ్యాంకుఖాతాలు ఇచ్చిన తర్వాత బ్యాంకులో జమ చేస్తామని చెప్పారు.

## టియు అభివృద్ధి కోసం రూ.వెయ్యి కోట్లు కేటాయించాలి




ఎఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు విరాజ్

**ప్రజాపక్షం/జక్రాన్‌పల్లి :** డిచ్‌పల్లి మండలంలోని తెలంగాణ యూనివర్సిటీ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి కోట్ల ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని ఎఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు విరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఎఐఎస్ఎఫ్ తెలంగాణ యూనివర్సిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆరోపించారు. నూతన జాతీయ విద్యావిధానాన్ని అమలు చేస్తూ, విద్యా ప్రైవేటీకరణ, విద్యా కాషాయీకరణను అమలు చేస్తున్నారని విమర్శించారు. విద్యార్థులు పోరాడి సాధించుకున్న తెలంగాణలో సైతం ప్రజా ప్రభుత్వమని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం విద్యాశాఖ మంత్రి నియమించలేదని ప్రభుత్వ యూనివర్సిటీల పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు.

టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయాలని, లేదంటే యూనివర్సిటీలకు భవిష్యత్ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ పేరుతో నిజామాబాద్ జిల్లాలోని తెలంగాణ యూనివర్సిటీలో మౌలిక సదుపాయాలు లేవని, మెడికల్ ఎమర్జెన్సీ వస్తే నర్స్, డాక్టర్ లేరని, ఎమర్జెన్సీ వాహనం కూడా లేదని ఆరోపించారు. తెలంగాణ యూనివర్సిటీతో రాష్ట్రంలోని ప్రభుత్వ యూనివర్సిటీల పరిరక్షణ, ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో ఎఐఎస్ఎఫ్ యూనివర్సిటీల ఇన్‌చార్జి రహమాన్, జిల్లా కార్యదర్శి రఘురాం, టియు ఎఐఎస్ఎఫ్ మాజీ నాయకులు భరత్, కన్వీనర్ సంజీవ్, చందు, సాయి, అజయ్, భార్గవి, మోక్షిత్, భీమేష్, ప్రభాస్, పీర్ సింగ్ పాల్గొన్నారు.

## వరల్డ్ ఛాంపియన్ చికితకు సిఎం అభినందన




**ప్రజాపక్షం/హైదరాబాద్:** కెనడాలో జరుగుతున్న ప్రపంచ యూత్ చాంపియనిన్‌షిప్‌లో స్వర్ణ పతకం సాధించి వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన చికిత తానిపర్తికి తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. అండర్ 21 కేటగిరీ ఫైనల్‌లో కొరియాకు చెందిన పార్క్ యెర్పి విజయం సాధించి స్వర్ణం చేజిక్కించుకుని చికిత వరల్డ్ ఛాంపియన్‌గా నిలవడం దేశానికే గర్వకారణమని సిఎం అన్నారు. ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత, లక్ష్యాన్ని సాధించాలన్న చికిత సంకల్పం యువతీ యువకులకు స్ఫూర్తిదాయమని అన్నారు. ఆటుపోట్లను తట్టుకుంటూ గ్రామీణ ప్రాంతం నుంచి ఒక్కో మెట్టు ఎక్కుతూ ఆర్చరీలో రాణించిన చికిత భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. చిన్ననాటి నుంచి చికితలోని ప్రతిభను గుర్తించి అందుకు అనుగుణంగా ప్రోత్సహించిన తల్లిదండ్రులకు రేవంత్‌రెడ్డి అభినందనలు తెలియజేశారు.

## మహేంద్ర వర్సిటీలో డ్రగ్స్ కలకలం

### నార్కోటిక్ పోలీసుల వలలో ముఠా

**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ మున్సిపాలిటీ బహదూరపల్లిలోని టెక్ మహీంద్రా యూనివర్సిటీలో డ్రగ్స్ కలకలం రేపాయి. మంగళవారం యాంటీ ఆక్సిడెంట్ నార్కోటిక్ డీసీపీ సైదులు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో 1.5 కేజీల గంజాయి, 45 గ్రాముల ఓజీ వీడ్, 28 డ్రగ్స్ ప్యాకెట్లు, వెయింగ్ మిషన్, స్మార్ట్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 14 మంది విద్యార్థులను పరీక్షించగా ఐదుగురు విద్యార్థులకు పాజిటివ్ అని నిర్ధారణ అయ్యింది ముగ్గురి ఆటతో విద్యార్థులు, స్థానిక పెడ్లర్స్ కలిసి పెద్ద ఎత్తున డ్రగ్ వ్యాపారమే నడిపారు. ఎట్టకేలకు తెలంగాణ నార్కోటిక్ బృందం జాగ్రత్తగా వారి రహస్య రాకెట్‌ను గుట్టురట్టు చేసింది. ఢిల్లీ, బీదర్‌ల నుంచి గంజాయి, ఓజి వీడ్ కొరియర్ సేవల ద్వారా హైదరాబాద్‌కు తరలించారు. నైజీరియాకు చెందిన నిక్ అనే వ్యక్తి ఎండిఎంఏ మాత్రలు సరఫరా చేస్తూ ఉండగా, దుండిగల్ మహీంద్రా యూనివర్సిటీ విద్యార్థులు భాస్కర్, దినేష్ అతనితో సంప్రదింపులు జరిపారు. ఫోన్‌పే, ఎటిఎం లావాదేవీల ద్వారా చెల్లింపులు చేసి, కొరియర్ ద్వారా వాటిని తెప్పించారు. క్యాంపస్‌లో చదువుతున్న విద్యార్థులని, స్నేహితుల నమ్మకాన్ని ఆయుధంగా మార్చుకొని హాస్టళ్లలో, గుమిగూడి మత్తు పదార్థాలను పంచారు. ఒక్క గ్రాము ఓజి వీడ్‌ను 2,500కి అమ్ముతూ, విద్యార్థులు రోజూ భారీగా ఖర్చు చేస్తు నార్కోటిక్ పోలీసులకు పట్టుబడ్డారు. నిందితులపై పోలీసులు క్రైమ్ నం.8/2025 కింద, సెక్షన్లు 8(సి), 20 (బి), 2(బి)(2)(ఏ), 27, 29 ఎన్‌డీపీఎస్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేశారు. డ్రగ్స్ రవాణా, వినియోగం కేసులో ప్రధాన నిర్వాహకుడు మణిపూర్‌కు చెందిన నెవెల్ టోంగ్‌బ్రామ్ (21), జీడీమెట్లలో నివసించే అంబటి గణేష్ (24) హైదరాబాదులో పంపిణీ కార్యక్రమం చూసే వాడు, ఇక్కడే నివసించే బూసా శివకుమార్ (26) బీదర్, కర్ణాటక నుండి గంజాయి తెచ్చి గణేష్‌కు సరఫరా చేసేవాడు, ఇక ఢిల్లీకు చెందిన మొహమ్మద్ అషర్ జావెద్ (21) క్యాంపస్ డిస్ట్రిబ్యూటర్ పాత్ర పోషించాడు. 1.15 కిలోల గంజాయి, 47 గ్రాముల ఓజి వీడ్, డ్రగ్ ప్యాకింగ్ పౌచ్‌లు, డిజిటల్ తూకం యంత్రం, పలు మొబైల్ ఫోన్లు స్వాధీనం. 50 మంది విద్యార్థులు డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు ఈగిల్ గుర్తించిందనీ మత్తు పదార్థాలను సామాగ్రిని ఈగల్ టీం సీజ్ చేసింది. గంజాయి అనేది మత్తు వ్యసనానికి ద్వారం అదే విద్యార్థులను నరక కూపంలోకి నెడుతోందనీ. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, యూనివర్సిటీ అధికారులు, సమాజం కలిసి మాత్రమే యువతను రక్షించగలరు" అని ఈగిల్ అధికారులు విద్యార్థుల తల్లిదండ్రులకు సూచిస్తున్నారు. డ్రగ్ సమాచారాన్ని ఈగల్‌కు (1908, 8712671111) తెలియజేయాలని నార్కోటిక్ బృందం పిలుపునిచ్చింది.





## ఫారం - 6
(ప్రాథమిక ప్రకటన)

(తెలంగాణ సవరణ చట్టం 2016 లోని చాప్టర్ III ఎ లోని 10ఎ అనుసరించి)
(చట్టంలోని సెక్షన్-11 క్రింద దీనిలో 10ఎ మినహాయింపు కలదు)
(నిబంధన 6/12 చూడుము)

**తెలంగాణ ప్రభుత్వం**
**రెవిన్యూ (భూసేకరణ) శాఖ**

**గెజిట్ నెం. 61/2025** **తేదీ: 23.08.2025**
**జిల్లా కలెక్టరు యాదాద్రి భువనగిరి**
**ఫైలు: G4/3919/2025** **తేదీ: 19.08.2025**
**ప్రత్యేక ఉప కలెక్టరు (భూ.సే), యాదాద్రిభువనగిరి**
**ఫైల్ నెం.సి/1189/4/2017** **తేదీ: 12.08.2025**

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారి ఆదేశానుసారం యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం బండకొత్తపల్లి గ్రామములో **విస్తీర్ణం ఎ.1.00 గుంటల** భూమి ప్రజా ప్రయోజనార్థం JCRGLIP-Phase-III 24 R of L2 of Main Canal Package-7 Nawabpeta Reservoir నిర్మాణములో దిగువ చూపిన భూమి అవసరమైయున్నదని భావించినందున సదరు భూసేకరణ ప్రకటన జారీచేయనైనది.

ప్రభుత్వము ఉత్తర్వుల నెం. 63 1 & CAD (LA.R&R/A2) శాఖ తేదీ: 29-07-2017 ద్వారా JCRGLIP-Phase-III 24 R of L2 of Main Canal Package-7 Nawabpeta Reservoir కొరకు భూసేకరణ నష్టపరిహారం మరియు పునరుపాది కల్పన (పారదర్శకత మరియు న్యాయబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు) చట్టం- 2013 లోని చాప్టర్-11 (సామాజిక ప్రభావ లెక్కింపు అధ్యయనం) మరియు పరిరక్షణ) వర్తింపు నుండి మినహాయింపు ఇవ్వనైనది.

చాప్టర్- 111 (ఆహార భద్రత కావున, పైన తెలిపిన భాగముగా JCRGLIP-Phase-III 24 R of L2 of Main Canal Package - 7 Nawabpeta Reservoir నిర్మాణ నిమిత్తం యాదాద్రి భువనగిరి జిల్లా, గుండాల మండలం, బండకొత్తపల్లి గ్రామములో **విస్తీర్ణం ఎ.1.00 గుంటల** భూమి యొక్క వివరములు ఈ దిగువ చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీచేయమైనది.

షెడ్యూల్

గ్రామం: బండకొత్తపల్లి మండలం: గుండాల జిల్లా: యాదాద్రి భువనగిరి

| సర్వే నెం. విస్తీర్ణం | భూమి రకం (ఖుష్కి/తరి) | పట్టాదారుని పేరు తండ్రి/ భర్త పేరు | అనుభవదారుని పేరు తండ్రి/ భర్త పేరు | భూసేకరణ చేయు విస్తీర్ణం | [illegible] | రిమార్కు |
|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
| 268/ 0.29 | ఖుష్కి/ పట్టా | మెండే శంకర్ | మెండే శంకర్ | 0.29 | | Court Case |
| 269/ 0.11 | ఖుష్కి/ పట్టా | యస్. సుందీప్‌రెడ్డి | మెండే సుందీప్‌రెడ్డి | 0.11 | | Court Case |
| | | | మొత్తం | 1.00 | | |

భూసేకరణ పునరావాసం మరియు పునస్థాపనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన నష్ట పరిహారాన్నిపొందే హక్కు (తెలంగాణ సవరణ) చట్టం, 2016 (చట్టం 21/2017) ద్వారా సవరించబడిన భూసేకరణ పునరావాసం మరియు పునస్థాపనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన నష్ట పరిహారాన్ని పొందే హక్కు 2013 (కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 11(1) యొక్క నిభందనలను అనుసరించి సంబధిత వ్యక్తులు అందరికీ తెలియజేయుటకుగాను ఈ ప్రకటన జారీ చేయడమైనది.

భూమి యొక్క ప్లాన్, ఏదైనా పని దినము మరియు పని వేళలలో **జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే), ఆర్ అండ్ ఆర్, విభాగము-2, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యాదాద్రి భువనగిరి జిల్లా** వారి కార్యాలయములో తనిఖీ చేసుకొనవచ్చును. **తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారు, ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సి), విభాగము-2, యాదాద్రి భువనగిరి జిల్లా** గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించిన సెక్షన్ 12 ప్రకారం పై తెలిపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇతర పనులు చేపట్టడానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం **జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి** గారి అనుమతి లేకుండా ఇట్టి ప్రకటన జారీచేసిన తేదీ నుండి నోటిఫికేషనులో ప్రకటించిన భూములకు సంబంధించి ఎవరూ ఎటువంటి లావాదేవీలు / తాకట్లు మొదలగు చర్యలు చేపట్టరాదు.

సదరు చట్టంలోని సెక్షన్ (15) అనుసరించి ప్రతిపాదిత భూసేకరణపై ఏవైనా అభ్యంతరాలుగానీ, ఆక్షేపణలుగానీ ఉన్నట్లయితే సేకరణలో ఉన్న భూమితో ఎలాంటి సంబంధం ఉన్న వ్యక్తులైనా, పరిహారం నిర్ణయం కొరకు జరిపే సంప్రదింపుల వల్ల ప్రభావితులయ్యే వారెవరైనా ఇట్టి ప్రకటన జారీచేసిన తేదీ నుండి 60 (అరవై) దినములలోపు **జిల్లా కలెక్టరు / అధీకృత అధికారి** గారికి వారి అభ్యంతరములు వ్రాత పూర్వకంగా తెలియజేయవచ్చును.

**సం/-** ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే), ఆర్ అండ్ ఆర్, విభాగము-2, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యాదాద్రి భువనగిరి జిల్లా.
**సం/-** అదనపు కలెక్టర్, యాదాద్రి భువనగిరి
**సం/-** జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి

DIPR RO NO. 531/LA/PP/Advt/Pub/2025-26

# తెలంగాణ విద్యుత్ విధానాలు భేష్



డాక్టర్ జి.చిన్నారెడ్డితో అమెరికా ప్రముఖ విద్యుత్ రంగ నిపుణులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ విధానాలు చాలా బాగున్నాయని తెలంగాణ రాష్ట్రానికి వచ్చిన అమెరికా ప్రతినిధి బృందం కొనియాడింది. తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, సిబ్బంది నైపుణ్యాన్ని ప్రశంసించింది. ఇక్కడి విద్యుత్ పద్ధతులను అమెరికాలో అమలు చేసేందుకు తమ దేశ ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని అమెరికా దేశ ప్రముఖ విద్యుత్ రంగ నిపుణులు ఎడ్ స్కాట్, మైక్ హెండార్సన్, కాన్ స్టసిరెన్, బడ్ ఏరూక, వంగూర్ అమర్‌నాథ్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ విధానాలు, టెక్నాలజీ, విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, నిపుణులైన విద్యుత్ ఇంజనీర్లు, సిబ్బంది పని తీరు అమెరికా దేశానికి స్ఫూర్తిదాయకమని వారు తెలిపారు. హైదరాబాద్‌లోని జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డితో అమెరికా విద్యుత్ నిపుణుల బృందం మంగళవారం సమావేశమైంది. తెలంగాణ రాష్ట్రానికి అమెరికా నూతన టెక్నాలజీని అందజేస్తామని వారు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న విద్యుత్ విధానాలపై చిన్నారెడ్డితో అమెరికా బృందం సభ్యులు చర్చించారు. అనంతరం చిన్నారెడ్డి నేతృత్వంలోని అమెరికా బృందం సభ్యులు ఎస్‌పి, డిసిఎల్ సిఎండి ముసారఫ్ అలీతో సమావేశమయ్యారు.

# రూ.వెయ్యి కోట్లు దాటిన 'ఇందిరమ్మ ఇండ్ల' చెల్లింపులు

అక్రమాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తాం
కేసును ఎసిబికి అప్పగిస్తాం....
గృహ నిర్మాణ సంస్థ ఎండి వి.పి.గౌతం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'ఇందిరమ్మ ఇండ్ల' పథకంలో భాగంగా లబ్ధిదారులకు ఇప్పటివరకు వెయ్యి కోట్ల రూపాయలను అందచేశామని, 2.04 లక్షల ఇళ్ల పనులను ప్రారంభించగా, వాటిలో ఒక లక్ష ఇళ్లు బేస్‌మెంట్ స్థాయిలో ఉన్నాయని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి గౌతం తెలిపారు. 'ఇందిరమ్మ ఇండ్ల'కు సంబంధించి ఎటువంటి అవినీతి అక్రమాలకు పాల్పడినా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఇటీవలి కాలంలో బిల్లుల విడుదలకు కొంత మంది డబ్బులు డిమాండ్ చేసిన ఉదంతాలను ప్రస్తావిస్తూ, ఇలాంటి అక్రమాలకు పాల్పడిన వారిపై, శాఖపరమైన చర్యలతో పాటు ఈ కేసును అవినీతి నిరోధక శాఖకు (ఎసిబి) అప్పగిస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్లు, డిప్యూటీ ఇంజనీర్లతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా వి.పి. గౌతం మాట్లాడుతూ మూడు నెలల కాలంలోనే రెండు లక్షలకు పైగా ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభం కావడం, గృహ నిర్మాణ కార్యక్రమాలకు ప్రభుత్వం ఇస్తున్న అత్యంత ప్రాధాన్యతకు నిదర్శనమన్నారు. 'ఇందిరమ్మ పథకం' అమలుపైన రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం జోరుగా అమలు జరుగుతున్నదని పిడిలు, డిఇఇలు నిరంతరం క్షేత్ర స్థాయిలో పర్యటించాలన్నారు. క్షేత్ర స్థాయి నిరంతర పర్యవేక్షణతో పాటు పథకం అమలులోని లోటుపాట్లపైన అధికారులకు స్పష్టమైన అవగాహన వస్తుందని, సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవచ్చని, తద్వారా ఈ పథకం మరింత విజయవంతమైన ఫలితాలు వస్తాయని ఆయన తెలిపారు. ముఖ్యంగా డిఇఇలు తమకు నిర్దేశించిన విధులను సక్రమంగా, సమర్థంగా నిర్వహించాలన్నారు.




**బిల్లుల కోసం లంచాలు ఇవ్వొద్దు :**

బిల్లుల కోసం ప్రభుత్వ సిబ్బంది ఎవరికీ లంచాలు ఇవ్వవద్దని, ఈ విషయమై విస్తృతంగా ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తూ లబ్ధిదారులను చైతన్యవంతులను చేయాలని వి.పి గౌతం పిడిలకు, డిఇఇలను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల పనులకు సంబంధించిన పురోగతి బిల్లుల విడుదలకు అవసరమైన ఫోటోలను ఆయా గ్రామ కార్యదర్శులే కాకుండా, నేరుగా లబ్ధిదారులే రికార్డు చేసి/అప్‌లోడ్ చేసే సౌలభ్యం 'ఇందిరమ్మ ఇండ్ల యాప్'లో ఉన్నదని వివరించారు. ఈ యాప్‌ను విస్తృతంగా ప్రచారం నిర్వహించి, లబ్ధిదారులకు సమగ్రమైన అవగాహన కల్పించాలన్నారు. అనేక గ్రామాల్లో గ్రామ కార్యదర్శులు/ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి ఫోటోలు తీయడం, వాటిని యాప్‌లో అప్‌లోడ్ చేయడంలో జాప్యం జరుగుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, గ్రామ కార్యదర్శులు/ఇతర సిబ్బంది కావాలనే ఆలస్యం చేస్తున్నా, ఇతరత్రా వాటికి అడ్డుకట్ట వేయడానికి ఇది మంచి మార్గమని ఆయన తెలిపారు. జిల్లా స్థాయిలో సోమవారం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఇసుక, సిమెంట్, స్టీల్ ధరల నియంత్రణ కమిటీల సమావేశాలను నిర్వహించాలని, అలాగే రెవెన్యూ, మండల స్థాయిలో కూడా సమావేశాలు నిర్వహించాలని వి.పి.గౌతం సూచించారు. రెండు పడకల ఇళ్ల మంజూరు, కేటాయింపులతో పాటు, ఆయా కాలనీల్లో మంచినీరు, కరెంటు వంటి మౌలిక వసతుల కల్పన పనులపై సమావేశంలో సమీక్షించారు. ఈ సమీక్షా సమావేశంలో హౌసింగ్ కార్పొరేషన్ సలహాదారు ఈశ్వరయ్య, చీఫ్ ఇంజనీర్ ఎం.చైతన్య కుమార్, సూపరింటెండింగ్ ఇంజనీర్లు వెంకటదాస్ రెడ్డి, భాస్కర రెడ్డితో పాటు పలు జిల్లాల ప్రాజెక్టు డైరెక్టర్లు పాల్గొన్నారు.

# మట్టి వినాయకులనే పూజిద్దాం




ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయకులను పూజించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రజలందరూ కృషి చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఎఐవైఎఫ్) హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్ కోరారు. ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితితో పాటు ఖైరతాబాద్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో హెచ్ఎండిఎ సహకారంతో ఏర్పాటు చేసిన మట్టి గణపతులను హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణ భవన్‌తో పాటు జూబ్లీహిల్స్ డివిజన్‌లోని గురుబ్రహ్మ నగర్‌లో వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నెర్లకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ మాట్లాడుతూ రసాయనాలతో చేసిన వినాయక విగ్రహాలు అందంగా కనిపించినా పూజల అనంతరం వాటిని చెరువుల్లో నిమజ్జనం చేయడం వలన నీరంతా కలుషితమై నీటి రంగు మారడమే కాక తాగడానికి పనికి రాకుండ పోతున్నవిషయం తెలిసిందే అన్నా. పైగా ఆయా చెరువులు నాళాలలో ఉండే చిన్నజీవులు నీటి కాలుష్యంతో అవి ప్రమాదాల భారిన పడుతున్నాయని ఆయన వివరించారు. పూజలు అందుకున్న మట్టి వినాయక ప్రతిమలను ప్రతిష్టించి పూజల తర్వాత మన ఇంట్లోనే నిమజ్జనం చేసి ఆ నీటిని మొక్కలలో మొక్కల కుండీలలో పోయాలని, తద్వారా పర్యావరణాన్ని కాపాడుకున్న వారం అవుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కౌన్సిల్ సభ్యులు ఈ, సునీత, నారమున నరసింహ, ఖైరతాబాద్ నియోజకవర్గ ఎఐవైఎఫ్ అధ్యక్షులు కాంపల్లి కళ్యాణ్, కార్యదర్శి చెట్ల వెంకటస్వామి, మామిడి చెట్ల భగత్ సింగ్, యూత్ సభ్యులు చిన్న భీమేష్ భాస్కర్ నవీన్ ,నరసింహ బాల, గడి కొప్పుల బలరాజ్ పాల్గొన్నారు.

## ఉపరాష్ట్రపతి అభ్యర్థిత్వాన్ని జీర్ణించుకోలేకపోతున్న అమిత్ షా

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రతిపక్ష ఇండియా కూటమి నుండి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఉండడం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా జీర్ణించుకోలేకపోతున్నారని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. అమిత్‌షా గుజరాత్ రాష్ట్ర హోంమంత్రిగా ఉన్నప్పుడు సొరబ్ ఎన్‌కౌంటర్‌లో జస్టిస్ సుదర్శన్ రెడ్డి తీర్పుతో రెండేళ్ల పాటు గుజరాత్ రాష్ట్ర బహిష్కరణకు గురైన అమిత్ షా ఇప్పుడు అక్కసు వెళ్లగక్కుతున్నాడని ఆయన పేర్కొన్నాడు. దేశ హోంమంత్రిగా ఉన్న వ్యక్తి న్యాయ వ్యవస్థకు మచ్చ తెస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి గెలిస్తే మావోయిస్టులు 20 ఏళ్లు ముందు కెళ్తారని అమిత్ షా పేర్కొన్నడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో మోదీ, అమిత్ షా మావోయిస్టుల అవశేషాలు లేకుండా చేయాలని చూస్తున్నారని, ఇది ప్రజాస్వామ్య మూల సూత్రాలకు విఘాతమని పేర్కొన్నారు. దేశంలో ప్రశ్నించే గొంతులను నొక్కుతున్నారని, 100శాతం వికలాంగుడైన సాయి బాబాపై నిరాధార ఆరోపణలు ఆయనను అరెస్టు చేయడంతో 9 ఏళ్లు జైల్లో ఉండి చనిపోగా, చివరికి సుప్రీంకోర్టు కూడా సాయిబాబా నిర్దోషి అని తీర్పు ఇవ్వడంతో అమిత్ షాకు చెంపపెట్టు లాంటిది అన్నారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి అభ్యర్థిత్వం పట్ల దేశంలోని జడ్జీలు స్పందిస్తున్నారని, ఎన్‌డిఎ కూటమిలోని ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆలోచించి మోదీ ప్రభుత్వం వైపు కాకుండా ప్రజాస్వామ్య రక్షణ వైపు ఉండాలని చాడ వెంకటరెడ్డి కోరారు.

## యూరియా కొరతపై బిజెపి తప్పుడు ప్రచారం

రాష్ట్రానికి రావాల్సిన యూరియాను సరఫరా చేయాలి : సిపిఐ (ఎం) డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వానాకాలం సీజన్ ఆరంభమై 2 నెలలు గడుస్తున్నప్పటికీ రైతులకు కావాల్సిన యూరియాను అందించడంలో కేంద్రప్రభుత్వం నిర్లక్ష్యధోరణితో వ్యవహరించడం దుర్మార్గమని సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ పేర్కొంది. రైతులు యూరియా కోసం నెల రోజులుగా రోడ్లపైకి వస్తున్నప్పటికీ బిజెపి నాయకులు కుంటి సాకులు చెబుతూ "కృత్రిమ కొరత" సృష్టించారనే తప్పుడు ప్రచారం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఇప్పటికైనా కేంద్రం నుండి రాష్ట్రానికి కావాల్సినంత యూరియాను తెప్పించడానికి బిజెపి ఎంపిలు, కేంద్ర మంత్రులు కేంద్ర బిజెపి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రైతులకు అండగా నిలబడాలని సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. రాష్ట్రానికి 9.8 లక్షల మెట్రిక్ టన్నులు యూరియా కావాల్సి ఉంగా, 1.5 లక్షల మెట్రిక్ టన్నులు కేంద్రం తగ్గించింది. ఈ కోటాను కూడా ఇంతవరకు సకాలంలో సరఫరా చేయకపోవడంతో తీవ్ర యూరియా కొరత ఏర్పడిందని రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వాకం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, చివరికి నిరసనలు వ్యక్తం చేస్తున్నా కనీసం స్పందన లేకపోవడం దారుణమన్నారు. రాష్ట్రంలోని రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ నుండైనా రాష్ట్ర అవసరాలకు యూరియాను సరఫరా చేయాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం అనేకసార్లు కోరినా, ఉద్దేశ్యపూర్వకంగానే కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన పేర్కొన్నారు. దీంతో 45 కేజీల యూరియా బస్తా రూ.242లు కాగా, ప్రస్తుతం బ్లాక్ మార్కెట్‌లో రూ.350కి అమ్ముతున్నారన్నారు. ఇప్పటికైనా కేంద్ర బిజెపి ప్రభుత్వం యూరియా కొరతను తీర్చడానికి, బ్లాక్ మార్కెట్‌ను నిరోధించడానికి ప్రభుత్వ సంస్థలైన హాకా, సహకార సంఘాల ద్వారా సరిపడా ఎరువులను సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని సిపిఐ(ఎం) డిమాండ్ చేస్తుందని తెలిపారు. రాష్ట్రానికి అవసరమైన యూరియాను కేంద్ర ప్రభుత్వం నుండి తెప్పించడానికి అన్ని రకాల చర్యలు తీసుకొని, రైతులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి జాన్‌వెస్లీ విజ్ఞప్తి చేశారు.

## శంకర్‌పల్లి మున్సిపాలిటీ కార్యాలయం
రంగారెడ్డి :: జిల్లా

**Lr.No.E1/MCS/87/2025** ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన **తేదీ: 26.08.2025**

**శంకర్‌పల్లి మున్సిపాలిటీలో లైటింగ్, సరఫరా మరియు బంచ్ కేబుల్ మరియు మెటీరియల్స్ డెలివరీ** కోసం రిజిస్టర్డ్ కాంట్రాక్టర్ల నుండి టెండర్లను ఆహ్వానించడమైనది. శంకర్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్ ద్వారా 29-08-2025 ఉదయం 11:30 గంటలకు టెండర్లు స్వీకరించబడతాయి మరియు అదే తేదీన రాత్రి 11:45 గంటలకు టెండరుదారుల సమక్షంలో లేదా వారి ప్రతినిధుల ద్వారా కమిషనర్, శంకర్‌పల్లి మున్సిపాలిటీ ద్వారా టెండర్లు తెరవబడతాయి. పిలవబడే టెండర్ల షెడ్యూల్ క్రింద ఇవ్వబడింది: **1. టెండర్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ తేదీ:** 26-08-2025 ఉదయం 11:30 గంటలకు, **2. ఇ-ప్రొక్యూర్‌మెంట్‌లో టెండర్ల దాఖలు:** 29-08-2025 ఉదయం 11:30 గంటలకు, **3. టెండర్ల ప్రారంభం:** 29-08-2025 ఉదయం 11:45 గంటలకు. మరిన్ని వివరాల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్లాట్‌ఫారం అనగా https://tender.telangana.gov.in లేదా శంకర్‌పల్లి మున్సిపాలిటీని సంప్రదించండి. ఆఫీస్ ఫోన్ నెం.: 7337323577 / 7331127776.

సం/- కమిషనర్
శంకర్‌పల్లి మున్సిపాలిటీ

DIPR R.O. No. : 7128-PP/CL/ADVT/1/2025-26, Date: 26-08-2025



# జనరల్
STATE & REGIONAL NEWS



కామ్రేడ్ సురవరం సుధాకరరెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన సియాసత్ ఎడిటర్ అమీర్ అలీఖాన్.

## సిఎం వినాయక చవితి శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితంలోని విఘ్నాలను తొలగించి అందరికీ ఆనందం, ఐశ్వర్యం, ఆరోగ్యం ప్రసాదించాలని ముఖ్యమంత్రి విఘ్నేశ్వరుడుని ప్రార్థించారు. వాడవాడల వెలిసే గణేష్ మండపాలలో భక్తి శ్రద్దలతో పూజలు నిర్వహించుకోవాలని కోరారు. ఈ మేరకు కార్యాలయం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. గణపతి నవరాత్రుల సందర్భంగా హైదరాబాద్ సహా అన్ని జిల్లా కేంద్రాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని, భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే మండపాల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ అధికారులను సిఎం ఆదేశించారు. ఈ సంవత్సరం కూడా వినాయకుని మండపాలకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నదని సిఎం తెలిపారు.

## మట్టి విగ్రహాలనే పూజించాలి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పర్యావరణాన్ని పరిరక్షించేందుకు మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలని సమాచార పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ సిహెచ్.ప్రియాంక సూచించారు. సచివాలయం ప్రాంగణంలోని మంగళవారం మీడియా సెంటర్‌లో సుమారు 150 మట్టి వినాయక విగ్రహాలను జర్నలిస్టు సోదరులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణానికి నష్టం జరగకుండా మట్టి వినాయకులనే పూజించాలని, పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని కోరుకుంటూ ప్రజలకు వినాయక చవిత హార్ధిక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు సంచాలకులు డిఎస్ జగన్, జాయింట్ డైరెక్టర్లు కె. వెంకటరమణ, సమాచారశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## సాదాబైనామాలకు శాశ్వత హక్కులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'సాదాబైనా పెండింగ్ దరఖాస్తుల' విషయంలో హైకోర్ట్ తీర్పుతో 'సాదాబైనామ'దారులకు శాశ్వత హక్కులు లభిస్తాయని తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి, డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె. రామకృష్ణ తెలిపారు. రాష్ట్రంలో సుమారు 9లక్షలా 894 మంది రైతులకు మేలు జరగడంతో పాటు సుమారు 10 లక్షల ఎకరాల భూములకు 13బి ప్రొసీడింగ్స్ జారీ అవుతాయన్నారు. ఈ ప్రక్రియ సంపూర్ణమైతే తెలంగాణ రాష్ట్రంలో చాలా వరకు భూ వివాదాలు తగ్గుతాయని వారు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాస్తవానికి గతంలో తెలంగాణ ప్రాంతంలో నోటి మాట, తెల్ల కాగితాలు, బాండ్ పేపర్లపై ఒప్పందాల ద్వారా భూముల క్రయవిక్రయాలు చేయడం సర్వసాధారణమని గుర్తు చేశారు. సాదాబైనామ పత్రాలు ఉన్న రైతులందరికీ 13బి ప్రొసీడింగ్‌లను జారీ చేసి,వారికి పట్టాదారు పాసు పుస్తకాలను అందిస్తామని ప్రభుత్వం గతంలోనే ప్రకటించిందని పేర్కొన్నారు.

## బాలిక వైద్యానికి జగ్గారెడ్డి ఆర్థిక చేయూత

### తక్షణ సహాయం కింద తండ్రికి రూ. 3లక్షల నగదు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గత 9 ఏళ్ళుగా తీవ్ర అనారోగ్యంతో ఉన్న బాలికకు పిసిసి కార్యనిర్వాహక అధ్యక్షులు జగ్గారెడ్డి చేయూతను అందించారు. వైద్య ఖర్చుల నిమిత్తం బాలిక తండ్రికి రూ.3 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. మహబూబాబాద్ జిల్లా ,కేసముద్రం మండలం పెనుగొండ గ్రామానికి చెందిన సుష్మ దసరా పండుగ సందర్భంగా అమమ్మ ఇంట్లో చీమల మందు కలిసిన పిండితో చేసిన చపాతీలు తిని తీవ్ర అనార్యోగానికి గురై అప్పటీ నుంచి మంచానికే పరిమితమైయ్యారు. స్థోమత లేకపోవడంతో తండ్రి చెవుగాని మహేష్ కార్పోరేట్ ఆసుపత్రులలో చికిత్స అందించలేకపోతున్నారు. ఈ విషయం తెలుసుకున్న జగ్గారెడ్డి... తండ్రి మహేష్ ను పిలిపించి నేనున్నానంటూ భరోసా ఇచ్చారు.. బాలిక ఆరోగ్యంపై డాక్టర్ చంద్రశేఖర్ తో మాట్లాడిన జగ్గారెడ్డి ఆమె పూర్తిగా కొలుకునేలా వైద్యం అందించాలని ఇందుకు తను ఆర్థిక సహాయం అందంచడంతో పాటు సిఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి పూర్తి వైద్య ఖర్చులు ప్రభుత్వం భరించేలా చూస్తానని తెలిపారు. తక్షణ సహాయం కింద బాలిక తండ్రికి జగ్గారెడ్డి రూ.3లక్షలు నగదును అందజేశారు.సుష్మ ఆరోగ్యానికి అందరూ తమవంతుగా ఆర్థిక సహాయం చేయాలని కోరారు.. ఆర్థిక సహాయం చేయాలనుకునే వారు తండ్రి మహేష్ నెంబర్ ను 9553461480 కాంట్రాక్టు చేయాలని విజ్ఞప్తి చేశారు.



## తెలంగాణలోని ప్రధాన సమస్యలన్నీ కెసిఆర్ పరిష్కరించారు

### మధుసూదనాచారి

**ప్రజాపక్షం/హైదరాబాద్:**ఒయులో సిఎం రేవంత్ రెడ్డి బజారు భాష మాట్లాడారని,ఫామ్‌హౌజ్‌లో మానవ మృగాలు ఉన్నాయనడం తీవ్రమైన విషయమని, ఇందుకు కెసిఆర్‌కు సిఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని బిఆర్‌ఎస్ శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి డిమాండ్ చేశారు. మృగత్వానికి ప్రతి రూపాలే కాంగ్రెస్ పాలకులన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రధాన సమస్యలన్నీ కెసిఆర్ పరిష్కరించారన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి జోగు రామన్న ,కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు జి.దేవీ ప్రసాద్ , దూదిమెట్ల బాలరాజ్ యాదవ్ ,పల్లె రవికుమార్ ,బిసి కమిషన్ మాజీ సభ్యుడు ఉపేంద్ర చారితో కలిసి సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి మాటలకు విశ్వసనీయత లేదని, రైతులకు యూరియా కూడా ఇవ్వలేని అసమర్ధుడు రేవంత్ రెడ్డి అని అన్నారు. జోగు రామన్న మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి ప్రవర్తన బాగోలేదని, ఆయన ఎక్కడికెళ్లినా కాళేశ్వరం పాట పాడుతున్నారని, విద్యార్థుల వద్దకు వెళ్లి కెసిఆర్ గురించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. జి .దేవిప్రసాద్, దూదిమెట్ల బాలరాజు యాదవ్ మాట్లాడుతూ కెసిఆర్‌ను సిఎం రేవంత్ రెడ్డి తిడుతుంటే చప్పట్లు కొట్టే వారు ఉద్యమ కారులు కానేకారని అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ఒయులో అపరిచితుడిగా మాట్లాడారన్నారు.

### పార్టీలో తనను ఫుట్‌బాల్ ఆడుకుంటున్నారంటూ

## కొండా విశ్వేశ్వర్ రెడ్డి వినూత్న నిరసన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పార్టీలో తనను ఫుట్‌బాల్‌లా ఆడుకుంటున్నారంటూ బిజెపి నాయకుడు, చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి వినూత్నంగా నిరసన తెలిపారు. పార్టీ రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీకి కానుకగా ఫుట్‌బాల్ ఇచ్చి తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో పార్టీ వ్యవహారాలపై కొండా విశ్వేశ్వర్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రశేఖర్ తివారీని కలిస్తే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావును కలవమని చెబుతున్నారని, ఆయనను కలిస్తే అభయ్ పాటిల్‌ను కలవమంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకరిని సంప్రదిస్తే మరొకరి పేరు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా, జిల్లా అధ్యక్షుల తీరు, పార్టీ కార్యక్రమాల్లో సమన్వయ లోపంపై ఆయన తన అసంతృప్తిని వ్యక్తం చేశారు.

### దేశానికే ఆదర్శంగా

# తెలంగాణను తీర్చిదిద్దుతాం

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
### త్వరలో రూ.33 కోట్ల చేనేత రుణాల మాఫీ



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** దేశానికే ఆదర్శంగా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దు తున్నామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కే కన్వెన్షన్ హాల్ లో నిర్వహించిన నేతన్న పొదుపు, నేతన్న బీమా పథకాల పంపిణీ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, చేనేత, జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బి గితే లతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ10 సంవత్సరాల కాలంగా ఉన్న బకాయిలను ప్రజా ప్రభుత్వం విడుదల చేస్తుందని అన్నారు. నేత కార్మికుల కోరిక మేరకు లక్ష రూపాయల రుణ మాఫీ వర్తింప చేస్తున్నామని, 33 కోట్ల చేనేత రుణాలను రాబోయే క్యాబినెట్ సమావేశంలో మాఫీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. వేములవాడలో నూలు డిపో ఏర్పాటు చేసి ఇప్పటి వరకు 2500 మెట్రిక్ టన్నుల నూలు 100 సోసైటీలకు సరఫరా చేయడం జరిగిందని వెల్లడించారు. నేతన్న చేయూత, నేతన్న పొదుపు, నేతన్న బీమా వంటి అనేక పథకాల బకాయిలను జమ చేస్తున్నామని అన్నారు. సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ మాట్లాడుతూ చేనేత పవర్ రూం కార్మికులను ఆదుకోవాలని ఉద్దేశంతో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చర్యలు చేపట్టారని అన్నారు. ప్రభుత్వం ఆర్థిక స్థితిగతులను బాగు చేస్తూ దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ధార్మిక కార్మిక క్షేత్రం రాజన్న సిరిసిల్ల జిల్లాను అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం లో ప్రజా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు. నేత కార్మికుల కష్టాలు తీర్చేందుకు ప్రజా ప్రభుత్వం పలు చర్యలు చేపట్టిందని అన్నారు. కేకే మహేందర్ రెడ్డి మాట్లాడుతూ బతుకమ్మ చీరల ఉత్పత్తి బకాయిలు దాదాపు 350 కోట్ల రూపాయలను ప్రజా ప్రభుత్వం విడుదల చేసిందని అన్నారు. స్వశక్తి మహిళా సంఘాలోని మహిళలకు 2 నాణ్యమైన చీరలు అందించాలని నిర్ణయించి, ఆ చీరల ఉత్పత్తి ఆర్డర్ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ కు కేటాయించామని అన్నారు. చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్ మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ కార్మికులకు చేతినిండా పని కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ శాఖల ఆర్డర్లను ఇప్పిస్తుందని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి కింద ఉత్పత్తి చేసే ఆర్డర్లతో ఒక్కో కార్మికుడికి నెలకు 20 వేల నుంచి 25 వేల వరకు ఆదాయం వస్తుందని వివరించారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ నేతన్న పొదుపు (త్రిఫ్ట్) పథకం క్రింద జిల్లాకు చెందిన 4963 మంది వస్త్ర పరిశ్రమ కార్మికులకు 24 కోట్ల 80 లక్షల రూపాయలను, నేతన్న బీమా ఉండి మరణించిన 12 చేనేత కార్మికుల కుటుంబాలకు 5 లక్షల రూపాయల చొప్పున పరిహారం చెక్కులు పంపిణీ చేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్పీ మహేష్ బి గీతే, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, చేనేత జౌళి శాఖ జేడీ ఎన్వీ రావు, ఏడీ రాఘవరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ లు, నేత కార్మికులు, ఆసాములు ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణలో యుబిఎల్

## రూ.90 కోట్ల పెట్టుబడి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారతదేశంలోని ప్రముఖ బీర్ల తయారీ సంస్థ యునైటెడ్ బ్రూవరీస్ లిమిటెడ్ (యుబిఎల్), తెలంగాణలో తమ కార్యకలాపాలను విస్తరించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా, నిజాం బ్రూవరీలో రూ. 90 కోట్లతో అత్యాధునిక క్యానింగ్ లైన్ (డబ్బాల్లో ప్యాకింగ్ చేసే సౌకర్యం) ఏర్పాటు చేస్తున్నట్లు సంస్థ ప్రకటించింది. ఈ పెట్టుబడితో తెలంగాణలో వేగంగా అభివృద్ధి చెందుతున్న క్యాన్ బీర్ విభాగంలోకి యుబిఎల్ ప్రవేశించనుంది. ఇప్పటివరకు ఈ విభాగంలో సంస్థకు ఎలాంటి కార్యకలాపాలు లేవు. క్యానింగ్ లైన్ ఏర్పాటుతో నిజాం బ్రూవరీ సామర్థ్యం ప్రస్తుతం ఉన్న 0.5 మిలియన్ హెక్టోలీటర్ల నుంచి 0.9 మిలియన్ హెక్టోలీటర్లకు పెరగనుంది. ఈ కొత్త ప్లాంట్ మరో సంవత్సరంలో తన కార్యకలాపాలను ప్రారంభించవచ్చని సంస్థ తెలిపింది. యుబిఎల్ డైరెక్టర్ వివేక్ గుప్తా మాట్లాడుతూ 'తెలంగాణ భారతదేశంలోనే అతిపెద్ద, శక్తివంతమైన బీర్ మార్కెట్లలో ఒకటన్నారు. ఇక్కడ క్యాన్లకు డిమాండ్ పెరుగుతోంది. ఈ పెట్టుబడితో, కింగ్‌ఫిషర్, కింగ్‌ఫిషర్ అల్ట్రా, హీనెకెన్ వంటి ప్రీమియం బ్రాండ్‌లను క్యాన్‌లలో అందుబాటులోకి తెస్తాం. కొత్త తరం వినియోగదారులు వీటిని సౌలభ్యం, తాజాదనం కోసం ఎక్కువగా ఇష్టపడుతున్నారు' అని ఆయన తెలిపారు. వినియోగదారుల ప్రాధాన్యతలకు అనుగుణంగా తమ ఉత్పత్తిని విస్తరించడానికి ఈ చర్య ఎంతో దోహదపడుతుందన్నారు. దీనివల్ల తెలంగాణ మార్కెట్లో తమ నాయకత్వం మరింత బలోపేతం అవుతుందని గుప్తా అన్నారు. ఈ పెట్టుబడి హీనెకెన్ సంస్థ భారత్‌లో బీర్ పరిశ్రమ అభివృద్ధి, ఆవిష్కరణల పట్ల చూపిస్తున్న నిబద్ధతకు నిదర్శనమని ఆయన అన్నారు. ఈ విస్తరణ ద్వారా ఈ మార్కెట్లో గణనీయమైన వాటాను సాధిస్తామని యునైటెడ్ బ్రూవరీస్ ఆశాభావం వ్యక్తం చేసింది.

### వినాయక నిమజ్జనానికి పటిష్ట బందోబస్త్
### సిఐ మహేష్ గౌడ్



**ప్రజాపక్షం/హయత్ నగర్ :** మన్సూరాబాద్ పెద్ద చెరువులో కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి తో కలసి సిఐ మహేష్ గౌడ్ నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమజ్జనం పూర్తి ఆయేవరకు 24 గంటలు పోలీస్ పహారా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమం లో ఎస్ ఐ గిరీష్ కుమార్ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

### 'ఓటు చోరీ' ప్రచారం
### ఒక తప్పుడు నినాదం : మర్రి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రస్తుతం దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ చేస్తున్న 'ఓటు చోరీ' ప్రచారం ఒక తప్పుడు నినాదం అని, ఇది కేవలం ప్రజలను మోసగించడానికి మాత్రమే వాడుకుంటున్నారని బిజెపి నేత మర్రి శశిధర్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ నాంపల్లి బిజెపి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల సమయంలో ప్రధాని నరేంద్ర మోదీ 'చార్ సౌ పార్' నినాదం ఇచ్చినప్పుడు, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ 'రాజ్యాంగాన్ని రక్షించండి, రిజర్వేషన్లు తీసేస్తారు' అంటూ మరో నెరేటివ్‌ను ప్రారంభించారని అన్నారు. ఇప్పుడు బీహార్ ఎన్నికల్లో కూడా అదే తరహాలో ఓటు చోరీ అంటూ కొత్త ప్రచారాన్ని మొదలుపెట్టారని ఆయన విమర్శించారు. గత 35 సంవత్సరాల ఎన్నికల చరిత్రను పరిశీలిస్తే, 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, ఇండియా కూటమి అత్యధిక సంఖ్యలో ఓట్లు సాధించాయని, అలాంటప్పుడు ఓటు చోరీ ఆరోపణలు చేయడం సరికాదని ఆయన అన్నారు.

## సిఎం ఒయు పర్యటన రాజకీయ డ్రామా

### ఎస్‌టి మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కళ్యాణ్ నాయక్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీ పర్యటనను ఒక రాజకీయ డ్రామాగా ఎస్‌టి మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కళ్యాణ్ నాయక్ అన్నారు. హైదరాబాద్ నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో కళ్యాణ్ నాయక్ మీడియా సమావేశంలో మాట్లాడారు. సిఎం రేవంత్ రెడ్డి నిధుల కేటాయింపుపై ఎలాంటి ప్రకటన చేయకుండా, గతంలో హామీ ఇచ్చిన రూ. 1000 కోట్లకు సంబంధించిన వివరాలు ఇవ్వలేదన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన హక్కుపై మాట్లాడిన సిఎం, పర్యటన రోజున విద్యార్థులను హాస్టల్‌లలో నిర్బంధించి, వేలాది మంది పోలీసులను మోహరించారని కళ్యాణ్ నాయక్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగ నియామకాలపై, నిరుద్యోగ భృతిపై ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. విద్యార్థులపై ఉన్న కేసులను ఎత్తివేయలేదని, ఉద్యమకారులకు ఇళ్లు కూడా ఇవ్వలేదన్నారు.

# నిర్వాహకులు సహకరించాలి

### గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి : డిసిపి శిల్పవల్లి






**ప్రజాపక్షం/హైదరాబాద్:** గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా, సురక్షితంగా, నియమ నిబంధనలు పాటిస్తూ జరుపుకోవాలని సెంట్రల్ జోన్ డిసిపి కె.శిల్పవల్లి అన్నారు. గణేశ్ ఉత్సవాల దృష్ట్యా మండప నిర్వాహకులతో సమన్వయ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన శిల్పవల్లి మాట్లాడుతూ..ఉత్సవాలను విజయవంతం చేసేందుకు పోలీసుల నుండి అవసరమైన సహాయం అందుతుంది కానీ నిర్వాహకులు కూడా సహకరించాలి అని తెలిపారు. నిమజ్జనానికి ముందుగానే వాహనాలు సిద్ధం చేసుకోవాలని డిసిపి సూచించారు. ఒక విగ్రహానికి ఒక వాహనం మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. వాహనం విగ్రహ పరిమాణానికి సరిపడేలా ఉండాలన్నారు. డిజెలు, అధిక శబ్ద పరికరాలు, ఫైర్ క్రాకర్స్ పూర్తిగా నిషేధం. మద్యం, మత్తు పదార్థాల ప్రభావంలో ఊరేగింపులో పాల్గొనరాదన్నారు. కర్రలు, కత్తులు, అగ్నికారక వస్తువులు నిషేధం. ఇతరులపై రంగులు చల్లడం, మతపరమైన రెచ్చగొట్టే నినాదాలు నిషేధం, అని చెప్పారు. విగ్రహ ప్రతిష్ఠ నుండి నిమజ్జనం వరకు మండపాల్లో వాలంటీర్లు 24 గంటలు ఉండాలని ఆమె సూచించారు. మండపాలలో ఫైర్ ఎక్స్టింగ్విషర్లు, ఇసుక బిందెలు తప్పనిసరిగా ఉండాలి. విద్యుత్ కనెక్షన్లు సురక్షితంగా ఉండాలి, ఎంసీబీలు వాడాలి. మండపం పటిష్టమైన ప్రదేశంలో మాత్రమే నిర్మించాలి. మండపాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండాలని ఆమె సూచించారు. ముఖ్యంగా రాత్రివేళల్లో మండపం ఖాళీగా ఉండకూడదు. నగదు, ఆభరణాలు మరియు ఇతర విలువైన వస్తువులు భద్రంగా ఉంచాలని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో చేరే అవకాశమున్నందున బ్యారికేడ్లు, క్యూ లైన్లు తప్పనిసరి. మహిళలకు ప్రత్యేక క్యూ ఉండాలి. ప్రవేశం – నిష్క్రమణ మార్గాలు వేర్వేరుగా ఉండాలి. పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టమ్, సైన్‌బోర్డులు తప్పనిసరి అని సూచించారు. మండపాల్లో కేవలం ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలకే అనుమతి ఉంటుంది.. శబ్ద కాలుష్య నియమాలు పాటించాలి. అసభ్యకర కార్యక్రమాలు, రెచ్చగొట్టే ప్రసంగాలు పూర్తిగా నిషేధం. కార్యక్రమాలు భక్తి, సంస్కృతి ప్రతిబింబించేలా ఉండాలి, అని హెచ్చరించారు. ఈ సందర్భంగా పండప నిర్వాహకులు పాటించాల్సిన కొన్ని సూచనలను డిసిపి వివరించారు.



## యూరియా అందుబాటులో ఉంచాలని ధర్నా

**ప్రజాపక్షం/యాచారం :** రైతాంగానికి అవసరమైన యూరియాను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సిపిఐయం పార్టీ అధ్వర్యంలో మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు.ప్రభుత్వానికి వ్యతిరేఖంగా పెద్దెతున అందోళన చేశారు, నినాదాలు నిరసన ధ్వనులతో కార్యాలయం మారుమ్రోగింది.ఈ సందర్భంగా సిపిఐయం పార్టీ యాచారం మండల నర్సింహ్మా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెలంగాణాకు సరిపడ యూరియాను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.నాట్లు వేసి నెల రోజులైనా యూరియా దోరుకకక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.యాచారం మండలానికి సోసైటిలు, ప్రైవేటు షాపులు కలిసి 900 మేట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా కేవలం 20 లారీల యూరియా మాత్రమే వచ్చిందన్నారు. ఇంకా 25 లారీలు రావాల్సి ఉందని అన్నారు.బ్లాక్ మార్కెటులో యూరియా అధిక ధరలకు విక్రయిస్తు వ్యాపారులు సోమ్ము చేసుకుంటున్నారని అరోపించారు.కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రాల పట్ల వివక్ష చూపుతుందని విమర్శించారు.అక్రమ నిల్వలపై తనిఖి చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐయం పార్టీ రంగారెడ్డి జిల్లా కమిటి సభ్యులు పి. అంజయ్య,మండల కార్యదర్శి వర్గ సభ్యులు పెంద్యాల బ్రహ్మయ్య,రైతులు రాములు, బోడ కృష్ణ,సత్యానారాయణ,వెంకన్న, ఎల్లయ్య, జంగయ్య, నర్సింహ్మా, రాములు జంగయ్య, సత్తయ్య, రాంరెడ్డి, రామచంద్రి తదితరులు పాల్గొన్నారు.

## నేక్నాపూర్ చెరువు పరిశీలన

**ప్రజాపక్షం/గండిపేట:** మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాపూర్ చెరువును స్థానిక వైస్ చైర్మన్ నరేందర్ రెడ్డి బృందం మంగళవారం పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా గణనాథులని నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలని ఆయన అన్నారు. మున్సిపాలిటీ లోని గణేష్ మండపాల నుండి వచ్చే గణనాధుల భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిమర్జనం సంపూర్ణంగా జరిగేటట్టు కావలసినన్ని ఏర్పాట్లు పనులు లైటింగ్ సిస్టం గానీ క్రేన్ ఎమర్జెన్సీ సిబ్బంది భక్తులకి త్రాగే నీరు అందుబాటులో ఉండే విధంగా చూడాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ శ్రీకాంత్, స్వామి,సి బీరప్ప,వేణు,వేనన్న,శంకర్ సింగ్,శ్రీనివాస్ రెడ్డి,శివరాం రెడ్డి ,శివ బిజెపి మున్సిపాలిటీ అధ్యక్షులుబి రవి కాంత్ రెడ్డి,జనరల్ సెక్రెటరీ కే శివరాం రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ ప్రమాదాలు
## నియంత్రించేందుకు చర్యలు

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** విద్యుత్ ప్రమాదాలను నియంత్రించేందుకు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్ ఏడి సత్యనారాయణ వివరించారు. మంగళవారం పట్టణంలోని పాత జాతీయ రహదారి పక్కన ప్రమాద కరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెను ఎఇ వినోద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడి సత్యనా రాయణ మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాలను పూర్తి స్థాయిలో నియంత్రించేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శిథిలావస్థకు చేరుకున్న దిమ్మెల స్థానంలో కొత్తవాటిని నిర్మించడమే కాకుండా కంటె సైతం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. ఇప్పటికే షాద్‌నగర్ మున్సిపాలిటి పరిధిలోని అన్ని వార్డుల్లో ఇప్పటికే పర్యటిస్తున్నామని, ఎక్కడ సమస్యలు లేకుండా కృషి చేస్తున్నామని తెలిపారు. నూతన విద్యుత్ స్థంబాలతోపాటు కొత్త వైర్లు వేస్తున్నామని, లోవోల్టేజీ సమస్యను సైతం పరిష్కరించడం జరుగుతుం దని వివరించారు. వర్షాకాలం, వినాయక చవితి పర్వదినం పురస్కరించుకొని విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకోకుండి తమ సిబ్బందిని పూర్తి స్థాయిలో అప్రమత్తం చేస్తున్నామని పేర్కొన్నారు. విద్యుత్ శాఖ అధికారులకు ప్రజలు సహాకరించేందుకు కృషి చేయాలని, అప్పుడే సమస్యలుపరిష్కరించేందుకు విలవుతుందన్నారు.

## విద్యార్థులకు మట్టి వినాయకుల పంపిణీ



**ప్రజాపక్షం/శంకర్ పల్లి:** వినాయక చవితి పండుగకు భక్తులు మట్టి వినాయకులనే పూజించాలని నిఖిల కన్స్ట్రక్షన్స్ అండ్ డెవలపర్స్ శ్రీనివాస్ చౌదరి, మహేష్ రెడ్డి అన్నారు. మంగళవారం శంకర్ పల్లి మండలం కొండకల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మట్టి వినాయకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మట్టి వినాయకులను వాడితే పర్యావరణాన్ని రక్షించుకోగలమని చెప్పారు. వాతావరణాన్ని కాపాడడానికి మట్టి వినాయకులను పూజించడం ఎంతో అవసరమని అన్నారు. ప్లాస్టర్ ప్యారిస్ తో చేసిన వినాయకుల వల్ల పర్యావరణం పాడవుతుందని, విగ్రహాలు నీటిలో కూడా త్వరగా కరగవని చెప్పారు. మట్టి వినాయకులు అయితే నీటిలో నిమజ్జనం చేసిన వెంటనే కరిగిపోతాయని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జీవనజ్యోతి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం నిఖిల కన్స్ట్రక్షన్స్ అండ్ డెవలపర్స్ వారు చేస్తున్న ఈ కార్యక్రమం వెలకట్టలేనిదని తెలిపారు. ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణయ్య, రఘునందన్ రెడ్డి, అంజి రెడ్డి, శ్రీనివాస్, మల్లేశం, యాదయ్య, జగదాంబ, కవ్వగూడం శ్రీను, జంగయ్య, రాధా, ఇందిరా బాయి, స్వప్న పాల్గొన్నారు.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, శేరిలింగంపల్లి సర్కిల్-20, ఎస్ఎల్‌పి జోన్ : జిహెచ్ఎంసి

No. 23/EE/CIR-20/SLPZ/GHMC/2025-26 (కొటేషన్ నోటీసు) తేది: 26.08.2025


కొటేషన్ నెం. 23/EE/CIR-20/SLPZ/GHMC/2025-26, తేది: 26.08.2025 కొరకు జిహెచ్ఎంసి, ఎస్ఎల్‌పిజెడ్, శేరిలింగంపల్లి సర్కిల్-20లోని జోనల్ ఆఫీస్ బిల్డింగ్ గోడలకు మరియు పైకప్పుకు వాటర్ ప్రూఫ్ కోటింగ్ పనులు. వివరాలను శేరిలింగంపల్లి సర్కిల్-20 కార్యాలయంలోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం నుండి పొందవచ్చు. ఈవెంట్ల తేదీ క్రింద వివరించబడింది:

| ఈవెంట్స్ | తేదీలు |
|---|---|
| కొటేషన్ల సమర్పణ ప్రారంభ తేదీ | 28.08.2025న ఉ.10.30గం.లకు |
| కొటేషన్లు సమర్పించడానికి చివరి తేదీ | 06.09.2025న సా.04.00గం.ల వరకు |
| ధర బిడ్ ప్రారంభ తేదీ | 06.09.2025న సా.04.30గం.లకు |

సంబంధిత కార్యాలయ చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, శేరిలింగంపల్లి సర్కిల్-20, శేరిలింగంపల్లి జోన్, జిహెచ్ఎంసి, శేరిలింగంపల్లి మండల రెవెన్యూ కార్యాలయం దగ్గర. మరిన్ని వివరాలను వెబ్‌సైట్ www.ghmc.gov.inలో చూడవచ్చు:

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-20, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 7159-PP/CL/ADVT/1/2025-26, Date: 26-08-2025



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## శ్రీదేవి ఆస్తి కబ్జా... కోర్టుకెక్కిన బోనీకపూర్

**చెన్నై:** తన భార్య, దివంగత నటి శ్రీదేవి ఆస్తిని ముగ్గురు వ్యక్తులు కబ్జా చేశారంటూ బోనీ కపూర్ కోర్టును ఆశ్రయించారు. వారు చట్టవిరుద్ధంగా హక్కులను సొంతం చేసుకున్నారని ఆరోపించారు. ఆమె ఎంతో కష్టపడి ఆ స్థిరాస్తిని కొనుగోలు చేసిందని ఈ విషయంలో తమకు న్యాయం చేయాలంటూ మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. దాని వివరాలను కోర్టుకు వివరించారు. 1988 ఏప్రిల్‌లో శ్రీదేవి మద్రాసులో ఎంసీ సంబంధ మొదలియార్ అనే వ్యక్తి వద్ద స్థిరాస్తిని కొనుగోలు చేశారు. దానికి సంబంధించిన పత్రాలన్నీ పరిశీలించిన తర్వాతే ఆమె దాన్ని కొనుగోలు చేసినట్లు బోనీ కపూర్ తెలిపారు. అతడికి ముగ్గురు కుమారులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారని, వారందరి దగ్గర వారసత్వ ధ్రువీకరణ పత్రాన్ని పరిశీలించిన తర్వాతనే శ్రీదేవి ఈ ఆస్తిని సొంతం చేసుకున్నట్లు బోనీ కపూర్ వెల్లడించారు. అయితే, ఎంసీ సంబంధ మొదలియార్ రెండో భార్య కుమారులు ఈ ఆస్తిలో వారికి వాటా ఉందంటూ తహశీల్దార్ కార్యాలయంలో అప్పీల్ చేశారన్నారు. ప్రభుత్వ అధికారుల నిర్ణయంతో తాజాగా చట్టవిరుద్ధంగా దీని హక్కులను సొంతం చేసుకున్నారని బోనీ కపూర్ హైకోర్టులో కేసు వేశారు. మోసపూరితమైన పత్రాలను రద్దు చేసి తమకు న్యాయం చేయాలని పిటిషన్‌లో పేర్కొన్నారు.

# క్లీన్ ఎనర్జీ, క్లీన్ మొబిలిటీలో ప్రపంచ హబ్‌గా భారత్

- ప్రధాని నరేంద్ర మోదీ
- పెట్టుబడుల కోసం రాష్ట్రాలు పోటీ పడాలని పిలుపు
- అహ్మదాబాద్‌లో హైబ్రిడ్ బ్యాటరీ ఎలక్ట్రోడ్‌ల ఉత్పత్తికి శ్రీకారం
- 100 దేశాలకు ఎలక్ట్రిక్ వాహనాల ఎగుమతులు ప్రారంభం



**అహ్మదాబాద్:** ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) తయారీ, ఎగుమతుల రంగంలో భారత్ ముందడుగు వేసింది. ఇకపై 'మేడ్ ఇన్ ఇండియా' ఈవీలు ప్రపంచవ్యాప్తంగా 100 దేశాలకు ఎగుమతి కానున్నాయి. అహ్మదాబాద్‌లోని హన్సల్‌పూర్‌లో మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ ఎగుమతులను జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఇదే వేదికపై హైబ్రిడ్ బ్యాటరీ ఎలక్ట్రోడ్‌ల స్థానిక ఉత్పత్తిని కూడా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, క్లీన్ ఎనర్జీ, క్లీన్ మొబిలిటీ రంగాల్లో భారత్ ప్రపంచ హబ్‌గా అవతరించబోతోందని ధీమా వ్యక్తం చేశారు. ''గణేశ్ ఉత్సవ్ సందర్భంగా మేక్ ఇన్ ఇండియాలో సరికొత్త అధ్యాయం మొదలైంది. ఇవాళ్టి నుంచి దేశీయంగా రూపొందించిన విద్యుత్ వాహనాలు 100 దేశాలకు ఎగుమతి అవుతాయి. విద్యుత్ వాహనాల్లో బ్యాటరీ తయారీ ముఖ్యమైన అంశమని మనందరికీ తెలుసు. కొన్నేళ్ల క్రితం వరకు బ్యాటరీలను దిగుమతి చేసుకున్నాం. విద్యుత్ వాహనాల తయారీని బలోపేతం చేయడానికి భారత్‌లోని బ్యాటరీలను ఉత్పత్తి చేయాల్సిన అవసరం ఉంది. అందులో భాగంగానే 2017లో టీడీఎస్‌జీ బ్యాటరీ యూనిట్‌కు శంకుస్థాపన చేశాం. భారత్‌కు ప్రజాస్వామ్య శక్తితో పాటు జనాభా అనుకూలత ఉంది. అధిక సంఖ్యలో నైపుణ్యంతో కూడిన మానవవనరులు అందుబాటులో ఉన్నారు. భారత్‌లో పెట్టుబడి పెడితే భాగస్వామ్యం అయిన ప్రతిఒక్కరికీ లాభదాయకమే'' అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భారత్‌జపాన్ మధ్య బంధం కేవలం వ్యాపారానికే పరిమితం కాదని, చారిత్రక, సాంస్కృతిక మూలాలున్నాయని ప్రధాని గుర్తుచేశారు. ''సుజుకి వంటి జపాన్ కంపెనీలు ఇక్కడ కార్లను తయారు చేసి, తిరిగి జపాన్‌కే ఎగుమతి చేస్తున్నాయి. ఇదే మన రెండు దేశాల సంబంధాల బలానికి నిదర్శనం. మారుతి సుజుకితో మొదలైన ఈ ప్రయాణం ఇప్పుడు బుల్లెట్ ట్రైన్ వేగంతో దూసుకెళుతోంది'' అని మోదీ వ్యాఖ్యానించారు. గత దశాబ్దంలో తమ ప్రభుత్వం చేపట్టిన ఆర్థిక సంస్కరణలు, 'మేక్ ఇన్ ఇండియా' వంటి కార్యక్రమాల ఫలాలు ఇప్పుడు కనిపిస్తున్నాయని ప్రధాని మోదీ తెలిపారు. పదేళ్లలో ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీ 500 శాతం పెరిగిందని అన్నారు. భవిష్యత్ ప్రణాళికలను వివరిస్తూ, ''మనం ఇక్కడితో ఆగిపోం. ఇకపై సెమీకండక్టర్ల తయారీపై దృష్టి పెడతాం. త్వరలో ఆరు ప్లాంట్లు సిద్ధం కాబోతున్నాయి. అదేవిధంగా కీలక ఖనిజాల కోసం 'నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్'ను ప్రారంభించాం'' అని ప్రధాని వెల్లడించారు. అభివృద్ధి అనుకూల విధానాల రూపకల్పనలో రాష్ట్రాలు ఒకదానితో ఒకటి పోటీ పడాలని, పెట్టుబడిదారుల విశ్వాసాన్ని చూరగొనాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

### మారుతి సుజుకీకి చెందిన తొలి ఎలక్ట్రిక్ వాహనం ఆవిష్కరణ

గుజరాత్‌లో రెండో రోజు పర్యటిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, అంతకుముందు మారుతి సుజుకీ సంస్థకు చెందిన తొలి ఎలక్ట్రిక్ వాహనం ఈవిటారాను ఆవిష్కరించారు. సుజుకీ, తొషిబా, డెన్సో సంస్థలు సంయుక్తంగా నిర్మించిన లిథియం అయాన్ బ్యాటరీ తయారీ యూనిట్‌ను ప్రారంభించారు. అనంతరం హన్‌సల్‌పూర్‌లో ఉన్న మారుతి సుజుకీ కార్ల తయారీ యూనిట్‌ను మోదీ పరిశీలించారు. ఈవిటారాకు సంబంధించిన విశేషాలతో పాటు ప్లాంట్‌లో ఉపయోగిస్తున్న ఆధునిక సాంకేతికతను కంపెనీ ప్రతినిధులు మోదీకి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని వెంట గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర భాయ్ పటేల్‌తో పాటు మంత్రులు పాల్గొన్నారు. దేశీయంగా రూపొందించిన ఈవిటారాను జపాన్ సహా 100కుపైగా దేశాలకు ఎగుమతి చేస్తామని మారుతి సుజుకీ కంపెనీ తెలిపింది. ఐరోపాలో జరిగిన ప్రదర్శనలో మారుతి సుజుకీ సంస్థ తొలిసారి ఈవిటారాను ప్రపంచానికి పరిచయం చేసింది. ఈవిటారా రెండు బ్యాటరీ వేరియంట్‌లతో మార్కెట్‌లోకి అందుబాటులోకి రానుంది.

# దేశీయ 'సుదర్శన చక్ర' మన గగనతలానికి కవచ – ఖడ్గం

- అమెరికా గోల్డెన్‌డోమ్,ఇజ్రాయెల్ ఐరన్‌డోమ్ లాంటిదే
- 2035 నాటికి అందుబాటులోకి వస్తుంది
- రక్షణ సదస్సులో సిడిఎస్ చౌహాన్ ప్రకటన



**మోవ్:** భారత గగనతల సంరక్షణకు ప్రతిపాదించిన 'సుదర్శన చక్ర' శత్రుదేశ ఆయుధ వ్యవస్థను వెలుపలే అడ్డుకుని, ఎదురుదాడచేసి తరిమికొట్టగల 'కవచ–ఖడ్గం' లా పనిచేస్తుందని రక్షణ సిబ్బంది ప్రధానాధిపతి జనరల్ అనిల్ చౌహాన్ ప్రకటించారు. ఒక సమీకృత వ్యవస్థగా ఇది తన బాధ్యతలు నిర్వహిస్తుందన్నారు. అమెరికా తన గగనతల వ్యవస్థ రక్షణకు ప్రతిపాదించిన 'గోల్డెన్ డోమ్', అన్ని కాలాలలోనూ పనిచేసేవిధంగా ఇజ్రాయెల్ ప్రతిపాదించిన 'ఐరన్ డోమ్' తరహాలోనే 'సుదర్శన చక్ర' కూడా అన్నిరకాల ఆయుధాలను సమన్వయంతో ప్రయోగించి శత్రువును ఊపిరి సలపకుండా చేసి తరిమికొట్టే దేశీయ సమీకృత కవచంగా భారత గగనతల రక్షణకు దోహదం చేస్తుందని చెప్పారు. 2035 నాటికి 'సుదర్శన చక్ర' రక్షణ కవచం ప్రాజెక్టు అమలులోకి వస్తుందని చెప్పారు. 'యుద్ధం–యుద్ధ రీతులు' అనే అంశంపై మధ్యప్రదేశ్ ఇండోర్ జిల్లా మోవ్‌లోని రణ్ సంవాద్ వద్ద జరిగిన రెండోరోజు సదస్సులో మంగళవారం అనిల్ చౌహాన్ ప్రసంగించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోటపై నుండి ప్రసంగించిన ప్రధానమంత్రి భారత్ గగనతల రక్షణకు సంబంధించిన పది సంవత్సరాల ప్రాజెక్టు ప్రకటనచేసిన తర్వాత జనరల్ చౌహాన్ ఈ రక్షణ రంగ సదస్సులో మొదటిసారి సుదర్శన చక్ర కవచ–ఖడ్గ రక్షణ గురించి ప్రకటించారు. ఈ గగనతల రక్షణ వ్యవస్థ ఒక కవచంగా, ఒక ఖడ్గంగా పనిచేస్తుందన్నారు. శత్రుదేశం ప్రయోగించే ఆయుధాలను పసిగట్టి అవి పనిచేయకుండా తటస్థీకరించగల సెన్సర్స్, క్షిపణులు, గస్తీ ఉపకరణాలు, కృత్రిమ మేధ సహాయంతో పనిచేసే రక్షణ వస్తువులు తదితరాలన్నింటినీ సమీకృతం చేసి శత్రువుకు భయం పుట్టించే కవచంగా 'సుదర్శన చక్ర' ఉపయోగపడుతుందన్నారు. భారతదేశం భవిష్యత్ భద్రత కోసం ఎంతో ఆతృతగా ఎదురుచూస్తూ తలపెట్టిన ఈ రక్షణ కవచ ప్రాజెక్టులో విస్తారంగా ఏడు రకాల విభాగాలు ఉంటాయని చెప్పారు. ఈ గగనతల రక్షణ వ్యవస్థ ఒక 'కవచ–ఖడ్గంగా పనిచేస్తుందన్నారు. ఎంతో సమర్థవంతమైన క్షిపణి కవచంగా ఇది ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆపరేషన్ సిందూర్ గురించి కూడా ప్రస్తావించారు. పాకిస్థాన్‌పై జరిపిన సైనిక చర్య ద్వారా ఆధునిక యుద్ధ రీతుల అమలుకు సంబంధించి మనదేశం ఎన్నో గుణపాఠాలు నేర్చుకుందన్నారు. దేశ సైనిక వ్యవస్థ నేర్చుకున్న ఈ గుణపాఠాలలో చాలా వాటిని ఇప్పటికే అమలులోకి తీసుకువచ్చామని, ఇంకా మరికొన్ని సరికొత్త ఉపాయాలు అమలులోకి తీసుకురావాల్సి ఉందని చెప్పారు. భవిష్యత్ యుద్ధాలు సరిహద్దులకే పరిమితం కాబోవని, అవిభాగాలూ సత్వర, నిర్ణయాత్మకమైన ఉమ్మడి ప్రతిస్పందన ద్వారానే యుద్ధ విజయం సాధ్యమని అన్నారు. 'సుదర్శన చక్ర' పనితీరు, దాని నిర్మాణ వ్యవస్థను వీలైనంత వివరంగా చౌహాన్ సదస్సులో పాల్గొన్న వారికి తెలియజేశారు.''భారతదేశ వ్యూహాత్మక, పౌర, జాతీయ ప్రాధాన్యతగల ప్రదేశాలను, వ్యవస్థలను, మౌలిక సదుపాయాలను శత్రుదాడుల నుండి సంరక్షించుకునేందుకు ఈ వ్యవస్థను అభివృద్ధి చేయాలని తలపోశాం, ఇక ఇప్పుడు ఈ వ్యవస్థ ఒక కవచంగా, ఒక ఖడ్గంలా ఉపయోగిస్తుంది'' అని చెప్పారు. ''అత్యంత బలమైన మౌలిక రక్షణ సదుపాయాన్ని, శత్రు ఆయుధాలను కనిపెట్టే ప్రక్రియ, వాటి తటస్థీకరణ, మానవరహిత గగన ఆయుధాలు సహా మేధో నైపుణ్యం, భుజబలాన్ని ప్రత్యక్ష ఆయుధ బలాన్ని ఉపయోగించేందుకు బహుముఖంగా ఈ సుదర్శన చక్ర ఉపయోగపడుతుంది'' అని చెప్పారు. గూఢచర్యం, గస్తీ, గూఢచర్యదృష్టితో వివిధ ఆయుధ వ్యవస్థల ద్వారా భూతలంపై వ్యవహారాన్ని క్షుణ్ణంగా పరిశీలించడం (ఐఎస్‌ఆర్) దీనివల్ల సాధ్యం అవుతుందని చెప్పారు. ''బహుముఖంగా పనిచేసే ఐఎస్‌ఆర్, భూతల యుద్ధక్షేత్రాన్ని కనిపెట్టి ఉండటం, సముద్రగర్భంలో, సముద్రతలంలో, రోదసీ నుండి పరిశీలన, సెన్సర్స్ ఉపయోగించడం వంటి కీలకమైన అనివార్యమైన వ్యవస్థలను సమీకృతం చేయడంపై దృష్టి పెట్టామన్నారు. భూతం,గగనతలం,సముద్రతలాలపై జరిగే యుద్ధాలను సమన్వయం చేసుకోవ డం, అందుకు అనుగుణంగా ఏకకాలంలో యుద్ధ రీతులు రూపొందించడం ముఖ్యమైన అంశమన్నారు. క్షిపణులను ప్రయోగించడంలో కృత్రిమ మేధను ఉపయోగిస్తామన్నారు. అడ్వాన్స్‌డ్ కంప్యూటర్ వ్యవస్థలు డేటా ఎనలటిక్స్, బిగ్ డేటా, క్వాంటమ్ టెక్నాలజీ వంటి అప్లికేషన్స్‌ను కవచ–ఖడ్గ ప్రాజెక్టుకు ఉపయోగిస్తామన్నారు. రాబోయే యుద్ధాల్లో బహుముఖ వ్యూహాలను ఒకే కేంద్రం గా ఉపయోగించడంవల్లనే విజయం సాధ్యం అవుతుందన్నారు.

# ప్రధాని మోదీ అవమానించారు : మమత



**కోల్‌కతా:** అవమానిస్తే సహించేది లేదని ప్రధాని మోదీకి బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తేల్చిచెప్పారు. తమ రాష్ట్ర ప్రజలను దొంగలంటూ మోదీ అవమానించారని, కనీసం తన పదవిని గౌరవించలేదంటూ మండిపడ్డారు. కేంద్ర నిధులు లేక రాష్ట్ర ఖజానాపై భారం పెరిగిందన్నారు. పూర్బా వర్ధమాన్ జిల్లాలోని వర్ధమాన్ పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో మమత మాట్లాడుతూ మోదీపై విరుచుకుపడ్డారు. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్ వంటి రాష్ట్రాల్లో డబుల్ ఇంజిన్ పాలనలో అవినీతి రాజ్యమేలుతోందని, మోదీకి ఇదేమీ పట్టడంలేదని విమర్శించారు. ఓ వలస పక్షిలా ఎన్నికలప్పుడు మోదీ బెంగాల్‌లో వాలుతారని ఎద్దేవా చేశారు. సంక్షేమ పథకాల కోసం కేంద్ర నిధుల వినియోగంపై సంతృప్తికర సమాధానాలు ఇచ్చినా, నిధులు ఇవ్వకపోగా, మమ్మల్ని దొంగలని అంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అవినీతి జరిగినట్లు ఆరోపిస్తూ విచారణ కోసం 186 కేంద్ర బృందాలను రాష్ట్రానికి పంపారు కానీ ఏ ఆధారాలు లభించలేదని మమత అన్నారు. 'ప్రశ్నలన్నింటికి సమాధానం ఇచ్చినా సున్నా మార్కులు వేస్తే విద్యార్థి సహిస్తాడు? మేము అంతే. ఈ అవమానాన్ని సహించబోం' అని మమత స్పష్టంచేశారు. 'ఇతర రాష్ట్రాల్లో బెంగాలీ మాట్లాడే వారు వివక్ష, వేధింపులు ఎదుర్కొంటున్నారు కానీ బెంగాల్ ఉన్న 1.5 కోట్ల మంది బయట వారికి అలాంటి పరిస్థితి లేదు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గుజరాతీలను తరిమివేశారు. హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్, కొలంబియా, శాన్ ఫ్రాన్సిస్కో బెంగాలీలు లేకుండా నడవలేవు' అని మమత అన్నారు. సామాన్యుల ప్రయోజనార్థం ఆరోగ్య బీమాపై జీఎస్టీ మినహాయించాలన్నామని చెప్పారు. జీఎస్టీ మినహాయిస్తే రాష్ట్ర ఖజానాపై రూ.900 కోట్ల అదనపు భారం పడుతుంది. అయినా ప్రజలకు తొలి ప్రాధాన్యత ఇస్తున్నాం. స్వాస్త్ సాథీ పథకాన్ని మరింతగా విస్తరించేందుకు యత్నిస్తున్నాం. దీంతో రాష్ట్ర ప్రజలకు రూ.5 లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమా లభిస్తుంది' అని మమత వెల్లడించారు.

# బిహార్ ఎన్నికల ముందే బిజెపి కొత్త అధ్యక్షుడి ఎంపిక!

**న్యూఢిల్లీ:** త్వరలోనే బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. అయితే ఈలోపే బిజెపి జాతీయ అధ్యక్షుడిని ఎంపిక చేయాలని ఆ పార్టీ భావిస్తున్నట్లు సమాచారం. బీహార్ ఎన్నికల షెడ్యూల్ రాక ముందే కొత్త అధ్యక్షుడిని నియమించాలని అధిష్ఠానం కసరత్తు ప్రారంభించినట్లు తెలిసింది.సెప్టెంబర్ 9న ఉపరాష్ట్రపతి ఎన్నికలు పూర్తికానున్నాయి. అనంతరం బిజెపి కొత్త అధ్యక్షుడి నియామకాన్ని కూడా పూర్తి చేయాలని ప్లాన్ చేస్తున్నట్లుగా సమాచారం. ప్రస్తుతం జేడీ నడ్డా జాతీయ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. అనేకమార్లు ఆయన పదవీకాలం పొడిగించారు. దీంతో కొత్త అధ్యక్షుడిని ఎంపిక చేయాలని ఆ పార్టీ ఆలోచన చేస్తోంది. అంతకంటే ముందే ఉత్తరప్రదేశ్, గుజరాత్, కర్నాటక వంటి కీలక రాష్ట్రాల్లో కొత్త రాష్ట్ర అధ్యక్షులను నియమించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇక ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉత్తరప్రదేశ్ నుంచి బీజేపీ జాతీయ మండలి సభ్యుడిగా, గుజరాత్ నుంచి కేంద్రహెంమంత్రి అమిత్ షా ఎన్నికవుతారు. అనంతరం కొత్త అధ్యక్షుడి నామినేషన్ పత్రాలకు ప్రతిపాదకులుగా వ్యవహరించడానికి వీరిద్దరూ అర్హులు అవుతారు. అయితే కొత్త జాతీయ అధ్యక్షుడి ఎంపిక కుల, ప్రాంతీయ లేదా సామాజిక సమీకరణాల ఆధారంగా జరగకూడదని పార్టీ నాయకత్వం ఆలోచిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. పార్టీని బలోపేతం చేసే వ్యక్తిని మాత్రమే ఎంపిక చేయనున్నట్లు సమాచారం. జాతీయ స్థాయిలో సంస్థాగతంగా మంచి అనుభవం ఉన్న సీనియర్ నేతకు ఆ బాధ్యతలు అప్పగించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.


దక్షిణ మధ్య రైల్వే
Follow us on X SCRailwayindia
దక్షిణమధ్య రైల్వే టెండరు నోటీసుల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inలో చూడగలరు.

టెండర్ నోటీసు నెం. C_SG_C_36_5_414 తేది: 22.08.2025

భారత రాష్ట్రపతి తరపున, డిప్యూటీ చీఫ్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్ (ప్రాజెక్ట్స్) ఎస్.సి. రైల్వే, సికింద్రాబాద్ 01.10.2025న 15:00 గంటల వరకు ఈ-టెండర్ల (ఓపెన్)ను ఆహ్వానిస్తుంది.

క్ర.సం.: 01, టెండర్ నెం.: C/SG/C/36/5/414 పని వివరణ: దక్షిణ మధ్య రైల్వేలోని సికింద్రాబాద్ డివిజన్‌లోని నెకొండ - గుండ్రాతిమడుగు విభాగాలలో ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ వ్యవస్థను అందించడానికి సమగ్ర సిగ్నలింగ్ మరియు టెలికమ్యూనికేషన్ పనులు. సుమారు విలువ (రూ.): 703688354.63 పూర్తయిన వ్యవధి: 18 నెలలు

పని యొక్క పూర్తి వివరణ, టెండర్ పరిస్థితులు, అర్హత ప్రమాణాలు మరియు వివరాలు, పైన పేర్కొన్న పనుల టెండర్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్‌తో సహా అన్ని వివరాల కోసం దయచేసి భారత ప్రభుత్వ టెండర్ పోర్టల్ వెబ్‌సైట్ www.ireps.gov.in ని సందర్శించండి.

డిప్యూటీ చీఫ్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్ (ప్రాజెక్ట్స్), సికింద్రాబాద్.

PUB/1029

ఈ-టెండర్ ఆహ్వాన ప్రకటన (http://ireps.gov.in ద్వారా)

సికింద్రాబాద్ దక్షిణమధ్య రైల్వే చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (కన్‌స్ట్రక్షన్) భారత రాష్ట్రపతి తరపున సింగిల్ ప్యాకెట్ టెండరింగ్ సిస్టమ్‌లో ఈ కింది పనుల కోసం ఈ-టెండర్‌ను ఆహ్వానిస్తున్నారు.

క్ర.సం: 01, NIT No.: టెండర్ నెంబర్: 02-2025-2026-E-GS-CN-GTL, పని పేరు: టెండర్ నెం: 02-2025-2026-E-GS-CN-GTL ఎలక్ట్రికల్ కన్‌స్ట్రక్షన్/GTL: గుంతకల్ డివిజన్: స్టేషన్ బిల్డింగ్ కోసం ఆర్‌బిజిఇ గదులు, గూమ్టీలు, RRI క్యాబిన్లు, FOB, ప్లాట్‌ఫారమ్ లైటింగ్, అప్రోచ్ రోడ్ లైటింగ్ మొదలైనవాటికి ఎలక్ట్రికల్ అరేంజ్‌మెంట్స్, మరియు గూటి, గుంతకల్ & లింగనేనిదొడ్డి యార్డ్ మోడిఫికేషన్ పనులకు సంబంధించి ఎల్‌టీ/హెచ్‌టి ఓవర్ హెడ్‌లైన్ల షిఫ్టింగ్ / మార్పు. అంచనా వ్యయం (రూ.): 4,71,32,220.18/- EMD (రూ.): 3,85,700.00/- టెండర్ డాక్యుమెంట్ కాస్ట్ (రూ): నిల్. పూర్తి కాలం : 12 నెలలు. ముగింపు తేదీ: 11.09.2025న 15:00గం.ల వరకు.

(1) బిడ్ డాక్యుమెంట్, ఇతర వివరాల కోసం దయచేసి http://ireps.gov.in వెబ్‌సైట్‌కి లాగిన్ అవ్వండి.
(2) ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ చెల్లింపు IREPSలో ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న నెట్ బ్యాంకింగ్ / చెల్లింపు గేట్‌వే సౌకర్యాల ద్వారా మాత్రమే చేయాలి.
(3) టెండర్‌దారులు తమ ఆఫర్లను టెండర్ సమర్పణ వ్యవధిలో అంటే టెండర్ ముగింపుకు 15 రోజుల వ్యవధిలో ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చు.
(4)టెండర్ సమర్పణ వ్యవధి ప్రారంభమయ్యే తేదీ వరకూ టెండర్‌దారుడు ఏదైనా కొరిజెండా (ఆన్‌లైన్‌లో మాత్రమే జారీచేయబడినది) కోసం గమనించాలి.

చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (Const.), సికింద్రాబాద్

A1271

PUB/1030

మరిన్ని టెండర్ షరతులు / వివరాల కోసం మరియు టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి, దయచేసి http://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి.


# వ్యక్తిగత దాడులు చేయడమే ఆర్‌ఎస్‌ఎస్ పద్ధతి

ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ



**అరారియా :** వ్యక్తిగత దాడులు చేయడాన్ని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) ఎవరినైనా లక్ష్యంగా చేసుకునే పద్ధతిగా మార్చుకుందని, మహాత్మా గాంధీ విషయంలో కూడా అదే జరిగిందని ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. బిహార్‌లోని మహాఘట్‌బంధన్ మిత్రులతో జరిగిన సంభాషణలో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. దీనికి సంబంధించిన వీడియోను ఆయన తన ఎక్స్ హ్యాండిల్‌లో పోస్ట్ చేశారు. వీడియోలో రాహుల్‌గాంధీ ఆదివారం బిహార్ అరారియాలోని ఒక ధాబాలో ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్, సిపిఐ(ఎంఎల్) చెందిన దీపాంకర్ భట్టాచార్య, వికాస్‌షీల్ ఇన్సాన్ పార్టీకి చెందిన ముఖేష్ సహాని, మహాత్మా గాంధీ మునిమనవడు తుషార్ గాంధీ, బిహార్ కాంగ్రెస్ చీఫ్ రాజేష్ కుమార్, కాంగ్రెస్ నాయకుడు షకీల్ అహ్మద్ ఖాన్‌లతో కలిసి టీ తాగుతున్నట్లు కనిపిస్తోంది. 'ఆర్‌ఎస్‌ఎస్‌ది వ్యక్తిగతంగా దాడులు చేసే పద్ధతి. వారు గాంధీజీతో ఎప్పుడూ అలా చేసేవారు. ఆయనపై ఆర్‌ఎస్‌ఎస్ ఎంత దుర్భాషలాడిందో ప్రజలకు తెలియదు. ఎంత పరువు నష్టం కలిగించిందో గుర్తుండదు. వారు గాంధీ గురించి చెప్పినవన్నీ అబద్ధాలే. ఇదే ఆర్‌ఎస్‌ఎస్ శైలి' అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు అన్నారు. గతంలో చర్చలు చాలా బలంగా, వేడిగా ఉండేవని, కానీ ఎప్పుడూ వ్యక్తిగత దూషణలు ఉండేవి కాదని తుషార్ గాంధీ అన్నారు. కర్పూరి ఠాకూర్ జీని కూడా నిదించారని, ఆ అతనికి భారత రత్న ఇచ్చారని తేజస్వీ యాదవ్ అన్నారు. ఓటు చోరీపై మాట్లాడుతూ ప్రజలు తమ ఓటు వేసినట్లు చెబుతారని, కానీ ఫలితాలు వచ్చినప్పుడు వారి ఓటు ఎక్కడికి పోయిందని వారికి తెలియదని యాదవ్ అన్నారు. ఇప్పుడు, ఆధారాలు, వాస్తవాలతో బయటకు వస్తుండడంతో దొంగతనం జరుగుతోందని ప్రజలకు ఇప్పుడు తెలుసుకున్నారన్నారు. ఎన్నికల సంఘం, బిజెపి కలిసి కుట్ర చేసినట్లు ప్రజల్లో అనుమానాలు వచ్చాయని, ప్రధాని ఏది చెబితే ఇసి అదే చేస్తోందని ఆర్‌జెడి నేత అన్నారు. ఇలాంటి అభిప్రాయాలనే వ్యక్తం చేస్తూ సహాని మాట్లాడుతూ ప్రజలు తాము ఇండియా కూటమికి ఓటు వేశామని భావించారని, కానీ ఫలితం దీనికి విరుద్ధంగా ఉందని అన్నారు. 'ఇప్పుడు రాహుల్ గాంధీ వాస్తవాలను బయటకు తెచ్చారు, ప్రజలకు ఏదో తప్పు జరిగిందని, మోదీ జీ 'హెరా ఫేరీ' చేస్తున్నారని తెలుసు. వారి (బిజెపి) ఓటర్లు కూడా అలాగే నమ్మడం ప్రారంభించారు' అని విఐపి చీఫ్ అన్నారు. సహానీ, కాంగ్రెస్‌కు చెందిన కుమార్, ఖాన్ ఓటరు అధికార్ యాత్రను, ప్రజలలో ఉన్న ఉత్సాహాన్ని ప్రశంసించారు.

# గాంధీ కుటుంబానికి విధేయుడిని

నా వ్యవహారంతో ఎవరైనా బాధపడి ఉంటే చింతిస్తున్నా...

క్షమాపణలు కూడా చెబుతా : డికె. శివకుమార్



**బెంగళూరు :** ఆర్‌ఎస్‌ఎస్ గీతాలాపన వివాదంపై సొంత పార్టీలోనే విమర్శలు రావడంతో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ ఈ ఘటనపై క్షమాపణలు చెబుతానన్నారు. అయితే అసెంబ్లీలో ప్రార్థన గీతాన్ని పాడటం ద్వారా తా ను బిజెపిని లక్ష్యంగా చేసుకోవాలనుకుందని పేర్కొన్నారు. తాను ఎలాంటి త ప్పు చేయలేదని పేర్కొంటూనే, కాంగ్రెస్ పార్టీలోని కొందరు ఈ ఘటనను దుర్వినియోగం చేసేందుకు, గందరగోళం సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని శివకుమార్ ఆరోపించారు. తాను ఎవరి మనోభావాలను దెబ్బతీయాలనుకోవడం లేద ని, ఈ వ్యవహారంలో ఎవరైనా బాధపడి ఉంటే అందుకు చింతిస్తున్నానన్నారు. కాంగ్రెస్, గాంధీ కుటుంబం పట్ల తన విధేయతను పునరుద్ఘాటించారు. ఈ సంబంధం దేవుడికి, భక్తుడికి మధ్య ఉన్న బంధంలాంటిదని అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రార్థన గీతాన్ని పాడటం వల్ల ఎవరైనా బాధపడితే క్షమించండని తెలిపారు. తాను కాంగ్రెస్‌వాదిని, కాంగ్రెస్ వాదిగానే చనిపోతానన్నారు. బహిష్కరించబడి న క్యాబినెట్ సభ్యుడు, పార్టీ సహచర ఎమ్మెల్యే కె.ఎన్. రాజన్న శివకుమార్‌పై ఎందుకు చర్య తీసుకోలేదని ప్రశ్నించారు. తాను అసెంబ్లీలో 'పాసింగ్ రిఫరెన్స్' మాత్రమే చేశానని, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్)ను తాను ప్రశంసించలేదని శివకుమార్ స్పష్టం చేయడానికి ప్రయత్నించారు. ఇటీవల సభలో శివకుమార్ ఆర్‌ఎస్‌ఎస్ ప్రార్థన గీతంలోని రెండు పంక్తులను పఠించి అందరినీ ఆశ్చర్యపరిచారు. 'గత వారం అసెంబ్లీలో (జూన్ 4న చిన్నస్వామి స్టేడియం వెలుపల 11 మంది మరణించిన) తొక్కిసలాట ఘటనపై చర్చ సందర్భంగా, ప్ర తిపక్ష నాయకుడు ఆర్ అశోక కాలు లాగడానికి, నేను ఆర్‌ఎస్‌ఎస్ ప్రార్థనలోని రెండు లేదా మూడు పంక్తులు చదివాను. నా ఉద్దేశ్యం వారిని ప్రశంసించడం కా దు. నేను వారి (బిజెపి) కాలు లాగడానికి ప్రయత్నించాను. నా స్నేహితులు (కాంగ్రెస్‌లో) కొందరు దాని నుండి రాజకీయ కోణాన్ని చూడకుండా దానిని దుర్వినియోగం చేయడానికి, గందరగోళం సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని, శివకుమార్ అన్నారు. నమ్మకమైన కాంగ్రెస్ సభ్యుడిగా తాను ఎవరి మనోభావాలను దెబ్బతీయనని అన్నారు.

# రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన బిల్లులకు... అనుమతి అధికారం కోర్టులకు లేదు

గవర్నర్లు, రాష్ట్రపతికి మాత్రమే అధికారం ఉందని మహారాష్ట్ర తరపు న్యాయవాది హరీష్‌సాల్వే స్పష్టీకరణ

**న్యూఢిల్లీ :** రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులకు కోర్టులు అనుమతి ఇవ్వలేవని, ఆ అధికారం గవర్నర్లకు లేదా రాష్ట్రపతికి మాత్రమే ఉంటుందని మహారాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో వాదించింది. మహారాష్ట్ర తరపున ప్రాతినిధ్యం వహించిన సీనియర్ అడ్వకేట్ హరీష్ సాల్వే మంగళవారం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ముందు తన వాదనలు వినిపించారు. రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు, రాష్ట్రపతి పరిష్కరించేందుకు కోర్టు కాలపరిమితి విధించవచ్చా అన్నదానిపై రాష్ట్రపతి విధించిన రిఫరీపై విచారణకు హరీష్ సాల్వే హాజరయ్యారు. 'గవర్నర్లు బిల్లులకు ఆమోదం తెలపాలని కోరుతూ కోర్టు మాండమస్ రిట్‌ను జారీ చేయదు. ఒక చట్టానికి ఆమోదం కోర్టు ఇవ్వదు. చట్టానికి గవర్నర్లు లేదా రాష్ట్రపతి ఆమోదం తెలపాల్సి ఉంటుంది' అని రాష్ట్రపతి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పిఎస్.నర్సింహ్మా, జస్టిస్ ఎఎస్. చందుర్కర్‌లు కూడా ప్రాతినిధ్యం వహించిన రాజ్యాంగ ధర్మాసనం ముందు తన వాదనలు వినిపించారు. తమిళనాడు బిల్లులకు ఆమోదం తెలిపేందుకు సుప్రీంకోర్టుకు ఉన్నటువంటి ఆర్టికల్ 142 అధికారాన్ని జస్టిస్ జెబి.పార్థివాలా నేతృత్వంలోని ధర్మాసనం ఉపయోగించుకుంది. హరీష్‌సాల్వే మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 361ను ప్రస్తావించారు. 'రాష్ట్రపతి లేదా గవర్నర్ తన పదవికి సంబంధించిన అధికారాలు, విధులను వినియోగించడం,నిర్వహించడం ఆ అధికారాలు, విధులను నిర్వర్తించడం, అతడు చేసిన లేదా చేయాలని అనుకుంటున్న చర్యకు సంబంధించి రాష్ట్రపతి లేదా గవర్నర్ ఏకోర్టుకూ జవాబుదారీగా ఉండరు. గవర్నర్లు లేదా రాష్ట్రపతి తీసుకునే నిర్ణయాలతో సహా ప్రతిపాదిత నిర్ణయాలను మాత్రమే కోర్టు విచారించగలదు' అని సాల్వే అన్నారు. కోర్టు మీ నిర్ణయం ఏమిటని మాత్రమే అడుగగలదు. కానీ మీరు ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నారని అడగకూడదు' అని హరీష్‌సాల్వే వాదించారు.రాష్ట్రపతి, గవర్నర్ల అధికారాలను వేరుచేస్తూ మొదటిది కేంద్ర ప్రభుత్వ సహాయం, సలహాపై మాత్రమే పనిచేస్తుందని, రెండవది విస్తృత అధికారాలను కలిగి ఉంటుందని, అందులో ఆమోదాన్ని నిలుపుదల చేసే అధికారం కూడా ఉందని మహారాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాది సాల్వే స్పష్టం తెలిపారు. బిల్లులకు సంబంధించి గవర్నర్ల అధికారాలను వివరించే ఆర్టికల్ 200ను ప్రస్తావిస్తూ ఈ నిబంధన గవర్నర్ చర్య తీసుకోవాల్సిన కాలపరిమితి చర్యను సూచించదని ఆయన స్పష్టంచేశారు. బిల్లుల ఆమోదం కూడా చర్చలపై ఆధారపడి ఉంటుందని, కొన్నిసార్లు అలాంటి ప్రక్రియకు 15రోజులు, కొన్ని సమయాలలో ఆరు నెలలు పట్టవచ్చని అన్నారు. ఆర్టికల్ 361 గవర్నర్ల భాష, అధికారాలను వినియోగంచడంలో వారు ఏ కోర్టుకూ జవాబుదారీగా ఉండరని, 'ఇది చాలా స్పష్టంగా ఉంది' అని హరీష్ సాల్వే వివరించారు. మధ్యప్రదేశ్ తరపున హాజరైన సీనియర్ అడ్వకేట్ ఎన్‌కె.కౌల్ వాదనలు వినిపిస్తూ గవర్నర్ మూడు స్పష్టమైన ఎంపికలను కలిగిఉన్నారని, అవి ఆమోదం, ఆమోదం నిలుపుదల చేయడం, బిల్లును రాష్ట్రపతికి రిజర్వ్ చేయడం అని చెప్పారు. సీనియర్ అడ్వకేట్ మనీందర్ సింగ్ రాజస్థాన్ తరపున వాదించారు.గవర్నర్ చర్య తీసుకోవడాన్ని నిరా కరిస్తే న్యాయవ్యవస్థ శక్తిహీనం అవుతుందా అని అంతకుముందు ధర్మాసనం ప్రశ్నించింది.

# సౌరభ్ భరద్వాజ్ నివాసంలో ఇడి సోదాలు



**న్యూఢిల్లీ:** ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నేత, ఢిల్లీ మాజీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ నివాసంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు సోదాలు చేపట్టారు. ఆయన ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్న సమయంలో చేపట్టిన ఆసుపత్రుల నిర్మాణంలో పలు అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కుంభకోణానికి సంబంధించి ఇడి మంగళవారం తనిఖీలు చేపట్టింది. ఢిల్లీలోని సౌరభ్ భరద్వాజ్ నివాసంతో పాటు మరో 12 ప్రాంతాల్లో ఏకకాలంలో దర్యాప్తు సంస్థ అధికారులు ఈ సోదాలు చేపట్టారు. 2018–19లో ఆమ్ ఆద్మీ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో 24 ఆసుపత్రుల నిర్మాణం కోసం అప్పటి ప్రభుత్వం రూ.5,590 కోట్లతో ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది. ఓ ఐసియు ఆసుపత్రిని ఆరు నెలల్లో పూర్తి చేయాల్సి ఉండగా.. మూడేళ్లు దాటినా అది పూర్తికాలేదు. ఇందుకోసం రూ.800 కోట్లు ఖర్చు చేసినా.. కేవలం సగం పనులు మాత్రమే పూర్తయ్యాయి. దీంతో ఆ ప్రాజెక్టులో అవకతవకలు ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. వీటి ఆధారంగా ఇడి మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. ఈ కేసులోనే తాజాగా సౌరభ్ భరద్వాజ్ నివాసంలో తనిఖీలు చేపట్టింది. ఈ దాడులను ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్రంగా ఖండించింది. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు సౌరభ్‌పై తప్పుడు కేసు నమోదు చేశారని ఆప్ ఆరోపించింది. ఇడి చెబుతున్న సమయంలో ఆయన మంత్రిగా లేరని తెలిపింది.


SHRIRAM Finance వాహనముల బహిరంగ వేలం ప్రకటన

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS11UB 2288 | Putta Swapna | TATA ACE | 2017 |
| 2 | TS25E 2481 | Ram Reddy Baddam | KUBOTA MU5501 COMBINE HARVESTER | 2020 |
| 3 | TS02EH 4614 | Gandham Ramanakar | CAT 424 B | 2014 |
| 4 | AP29TB 0189 | Rushi Kumar Nannamshetti | TATA LPT 3118 CUMMINS FBT | 2010 |
| 5 | TS25T 1932 | Sammaiah Nambula | TATA ACE | 2016 |
| 6 | TX03FD 7893 | Kumar Nallela | MAHINDRA YUVO 575DI | 2021 |

AUCTION DATE : 30-08-2025

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయ్యే వరకు వర్తించును

SHRIRAM FINANCE LIMITED
H.No :4-316,4-317,4-318, Ground Floor, Opp : Fire Station, Parkal, Warangal Rural
Cell :96667 26222, 9989766426

ప్రజాపక్షం
బుధవారం, 27 ఆగస్టు

# తమిళ రాజకీయాల్లో మూడోశక్తి

తమిళనాడు రాజకీయ క్షేత్రంలో మూడవశక్తికి అవకాశముందా? దీర్ఘకాలంగా ద్విముఖ విభజనతో సాగుతున్న రాజకీయంలోకి ఈ తరం పాపులర్ సినిమా హీరో జోసఫ్ విజయ్ గత సంవత్సరం మెరుపులా ప్రవేశించి తమిళగ వెట్రి కళగం (టివికె) అనే పేరుతో కొత్త పార్టీ స్థాపించారు. మదురైలో గతవారం నిర్వహించిన జనసందోహ సభలో, 2026 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర రాజకీయ చరిత్రలో కొత్త అధ్యాయం లిఖిస్తామని ప్రకటించారు. విజయ్‌ను రాజకీయాల్లోకి ప్రోత్సహించింది ఆయన తండ్రి, డైరెక్టర్ ఎస్.ఎ.చంద్రశేఖర్. తొలుత ఆసక్తి చూపని విజయ్‌కు, సూపర్ స్టార్ రజనీకాంత్ నిర్ణయం ప్రేరణ అయింది. రాజకీయ పార్టీ ప్రకటించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్న రజనీకాంత్, ఆఖరు నిముషంలో అనారోగ్య కారణాలతో ఆ ప్రయత్నం విరమించుకున్నట్లు ప్రకటించారు. ప్రజాకర్షక నాయకులు కరుణానిధి, జయలలిత మరణానంతరం ఏర్పడిన రాజకీయ జాగాను ఆక్రమించుకునేందుకై విజయ్ నడుంకట్టాడు. ఆయన ఇప్పుడు చేతిలో ఉన్న సినిమా పూర్తిచేసే పనిలో ఉన్నాడు. అయితే సినీగ్లామర్ మాత్రమే అధికార అందలం అధిరోహించటానికి సరిపోతుందా?

సినిమా రంగానికి తమిళ రాజకీయాలకు అవినాభావ సంబంధం ఉంది. డిఎంకె వ్యవస్థాపకుడు సి.ఎన్.అన్నాదురై మొదలు ఆయన శిష్యుడు కరుణానిధి, ఎం.జి.రామచంద్రన్, జయలలిత – అందరూ సినీప్రముఖులే. వారు ముఖ్యమంత్రులుగా చెరగని ముద్ర వేశారు. డిఎండికె పార్టీ స్థాపించిన మరో సినీ హీరో విజయకాంత్, కాంగ్రెస్‌వాదిగా ఉండిన శివాజీ గణేశన్ రాజకీయంగా వృద్ధిలోకి రాలేదు. మక్కల్ నీధి మైయం పార్టీ ఏర్పాటు చేసుకున్న మరో పాపులర్ హీరో కమల్ హాసన్ ఒంటరిపోరాటంలో ఓడిపోయి డిఎంకెతో స్నేహంతో రాజ్యసభ సభ్యుడైనారు. ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ ఒక సీరియల్‌లో నటించగా, ఆయన కుమారుడు ఉదయనిధి స్టాలిన్ పలు సినిమాల్లో నటించారు, నిర్మించారు. తండ్రి రాజకీయ వారసత్వం అందిపుచ్చుకునేందుకై గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసి, గెలిచి, ప్రస్తుతం మంత్రిగా పనిచేస్తున్నారు.

సినిమా గ్లామర్, అభిమానుల కేరింతలు, కులాభిమానం వంటివి మాత్రమే రాజకీయ ఎదుగుదలకు సరిపోవని విజయ్ గుర్తించాలి. కాంగ్రెస్‌ను ఓడించి డిఎంకె తొలిసారి అధికారంలోకి వచ్చిన 1967 ఎన్నికల్లో ఎం.జి.రామచంద్రన్ విరివిగా ప్రచారం చేశారు. 1952 నుంచి 1972 వరకు డిఎంకెలో తనకొక రాజకీయ ప్రఖ్యాతి ఆర్జించారు. తన సినీమాలను రాజకీయంగా కూడా తన వ్యక్తి ఆరాధనకు ఉపయోగించుకున్నారు. జయలలిత కూడా ఎఐడిఎంకె ప్రధాన కార్యదర్శిగా పార్టీ నిర్మాణానికి ఎంతో శ్రమించారు. అందువల్ల రాజకీయాల్లో నిలదొక్కుకోవటానికి బలమైన సంస్థాగత నిర్మాణం అవసరం.

మద్రాసు రాష్ట్రం తమిళనాడుగా నామాంతరం పొందిన 1969 జనవరి 14నుంచీ రాజకీయ వ్యవస్థ ద్విముఖంగా సాగుతున్నది. తొలుత కాంగ్రెస్–డిఎంకె ప్రధాన ప్రత్యర్థులు. కమ్యూనిస్టు పార్టీ మరో బలమైన రాజకీయశక్తి. ద్రవిడ మున్నేట్ర కళగం నుంచి బయటకు వచ్చిన ప్రముఖ నాయకుడు, ప్రజాదరణ పొందిన సినిమా హీరో ఎం.జి.రామచంద్రన్ 1972 అక్టోబర్‌లో అఖిల భారత అన్నా డిఎంకె (ఎఐఎడిఎంకె) ఏర్పాటు చేసి తృతీయశక్తిగా ఆవిర్భవించారు. అయితే 1969లో కాంగ్రెస్ పార్టీలో చీలిక దరిమిలా దాని ప్రభావం తగ్గుదల, మూపనార్ అనే ముఖ్య నాయకుడు తమిళమానిల కాంగ్రెస్ ఏర్పాటు చేయట వంటి పరిణామాలతో కాంగ్రెస్ ప్రభావం తగ్గింది. తమిళ రాజకీయ క్షేత్రంలో డిఎంకె, అన్నా డిఎంకె ప్రధాన ప్రత్యర్థులుగా ఆవిర్భవించాయి. ఎం.జి.రామచంద్రన్ మరణానంతరం ఆయన అనుయాయి, ప్రముఖ సినీనటి కుమారి జె.జయలలిత పార్టీ బాధ్యతలు చేబట్టిన తదుపరి కూడా ఆ రెండు పార్టీల మధ్యనే అధికార మార్పిడి జరుగుతూ వచ్చింది. కాంగ్రెస్ సహా మిగతా పార్టీలు ఆయా సందర్భాలనుబట్టి ఆ పార్టీలతో పొత్తులో భాగస్వాములు కావటంతో ద్విముఖ రాజకీయ విభజన కొనసాగుతూ ఉంది.

ద్రవిడ పార్టీల భుజాలపై ఎక్కి వృద్ధిలోకి రావాలని కోరుకుంటున్న బిజెపి పాచికలు పారటం లేదు. దాని హిందూత్వ రాజకీయాలే దానికి శత్రువు. ఛిన్నాభిన్నమైన ఎఐఎడిఎంకెలో పళనిస్వామి గ్రూపుతో పొత్తు కుదుర్చుకుంది. విజయ్‌పార్టీని కూడా ఆకర్షించాలని చూస్తోంది. అయితే హిందూత్వ రాజకీయాలకు వ్యతిరేకతను ప్రకటించారు విజయ్. తాను ప్రధాన శక్తిగా తనతో కలిసివచ్చే చిన్నాచితక పార్టీలతో పొత్తుకు అతడు సిద్ధం. అయితే పార్టీ పెట్టి సంవత్సరం గడిచినా విజయ్ తన పార్టీ భావజాలమేమిటో, ఎన్నికల వ్యూహమేమిటో ప్రకటించలేదు. డిఎంకె కూటమి చెక్కుచెదరకుండా బలంగా కొనసాగుతున్నది. కాబట్టి విజయ్ రాజకీయ ఆకాంక్షలను జనక్షేత్రంలో పరీక్షించుకోవటానికి సమయం ఎంతో దూరంలో లేదు.

# నన్ను బంగ్లాదేశ్ పంపుతారా? అమర్త్యసేన్

**అరుణ్ శ్రీవాస్తవ**

పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో 'భారత యువత : వారు పొందాల్సిన సామాజిక అవకాశాలు' అనే అంశంపై జరిగిన బహిరంగ చర్చలో 91 ఏళ్ల నోబెల్ పురస్కార గ్రహీత అమర్త్యసేన్ శుక్రవారం వ్యక్తం చేసిన ఆందోళన తీవ్ర చర్చనీయాంశమైంది. అదే రోజున సమీపంలోని డమ్‌డమ్‌లో చొరబాటుదారులను తరిమివేయాలని నరేంద్ర మోదీ చేసిన ప్రసంగం నేపథ్యంలో, 'నా పూర్వీకుల ఇల్లు ఢాకాలో ఉంది కాబట్టి, నన్ను బంగ్లాదేశ్‌కు తిరిగి పంపించే అవకాశం ఉంది' అని అమర్త్యాసేన్ చేసిన వ్యాఖ్యలు విద్యావేత్తలు సహా పౌరులందరిలోనూ తీవ్ర చర్చకు దారితీశాయి.

సేన్ తన భయాన్ని వ్యక్తం చేయడానికి ప్రధాన కారణం ఓటర్ల జాబితా ముమ్మర రివిజన్ (ఎస్ఐఆర్) ప్రవేశపెట్టడం. (భారత ఎన్నికల కమిషన్) ఇసిఐ ఎస్ఐఆర్ ను ప్రవేశపెట్టిన తర్వాత, భారతదేశంలో దాక్కున్న బంగ్లాదేశీ, నేపాల్, మయన్మార్ వలసదారులను గుర్తించడానికి వేట మొదలైంది. భారతదేశం అంతటా ఉన్న బెంగాలీ మాట్లాడే ప్రజలు కాషాయ శక్తుల, కార్యకర్తల లక్ష్యంగా మారారు. ఢిల్లీ, గురుగ్రామ్, ముంబైలలో ముఖ్యంగా కాషాయ ప్రభావం, అనుయాయులు ఉన్న ప్రాంతాలలో జీవనోపాధి కోసం కష్టపడుతున్న కొంతమంది బెంగాలీ మాట్లాడే వలసదారులను బంగ్లాదేశ్‌కు పంపించారు. అయితే, వారు భారతీయ బెంగాలీలు కావడంతో చివరికి తిరిగి బెంగాల్‌కే పంపబడ్డారు.

మోదీ ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యను, ముఖ్యంగా వివిధ రాష్ట్రాలలో బెంగాలీ మాట్లాడే ప్రజలకు వ్యతిరేకంగా పెరుగుతున్న భాషా అసహనానికి సంకేతంగా సేన్ అభివర్ణించినప్పటికీ, ఇది ప్రధానంగా బెంగాలీలు పాలకపక్షానికి వ్యతిరేకంగా, ప్రజానుకూలురుగా ఉంటారనే అసూయ కలిగించే వారి విశ్వసనీయతకు శిక్షగా భావించబడింది. బ్యూరోక్రాట్లు లేదా రాజకీయ నాయకులలో మితవాద శక్తులకు బెంగాలీ భాష, సంస్కృతి, నాగరికత చరిత్ర గురించి అవగాహన లేకపోవడం ఊహించలేము.

నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయినప్పటి నుంచి బిజెపి ఎన్నికల ద్వారా బెంగాల్‌ను దక్కించుకునేందుకు ప్రయత్నిస్తోంది. కానీ దాని ప్రయత్నాలన్నీ విఫల యత్నాలుగా మారాయి. బెంగాలీలు ప్రధానమంత్రి అభ్యర్థనకు స్పందించలేదు. ఇది వాస్తవానికి బెంగాలీలను అవమానించడానికి, వారిపట్ల తీవ్రమైన ధిక్కారాన్ని చూపించడానికి మోదీకి ప్రధాన కారణం అయింది. పశ్చిమ బెంగాల్ బిజెపి నాయకులలో ఒకరైన ప్రతిపక్ష నాయకుడు సువేందు అధికారి మాట్లాడుతూ 'మనకు బెంగాల్‌లో ఎస్ఐఆర్ అవసరం. మేము రోహింగ్యా, బంగ్లాదేశీ ముస్లింలను ఓటర్ల జాబితాలోకి అనుమతించము' అని అనడం ద్వారా కాషాయ వ్యూహం బయటపడింది.

ఎస్ఐఆర్ దళితులు, శ్రామికులు, మైనారిటీలతో పాటు బెంగాలీలను కూడా లక్ష్యంగా చేసుకున్నందనేందుకు ఎలాంటి సందేహం లేదు. సుప్రీంకోర్టు ఆధార్‌ను గుర్తింపు రుజువుగా అంగీకరించాలని సూచించినప్పటికీ, దానిని అంగీకరించడానికి మొదట్లో ప్రధాన ఎన్నికల కమిషనర్ అయిష్టత చూపడం ద్వారా మోదీ, షా మొండితనం అర్థం చేసుకోవచ్చు. బంగ్లాదేశ్ నుండి బెంగాల్‌కు వలస వచ్చిన ముస్లింలలో చాలామంది ఆధార్, ఎపిక్(ఓటర్ ఫోటో గుర్తింపు) కార్డులను పొందారని ఆర్ఎస్ఎస్, బిజెపి నాయకులు భావిస్తున్నారు. ఆర్ఎస్ఎస్, బిజెపి నాయకుల అభిప్రాయం ప్రకారం, ముస్లింలు ఆధార్, ఎపిక్ కార్డులను పొందగలిగిన మరో ప్రాంతం బిహార్‌లోని పూర్వాంచల్. ఇందులో కిషన్‌గంజ్, పూర్ణియా, కతీహార్, భాగల్‌పూర్ ఉన్నాయి. అయితే, కిషన్‌గంజ్ మాదిరిగా ఇవి నేరుగా బెంగాల్ సరిహద్దును ఆనుకుని లేవు.

ఇండియా కూటమి మొదట్లో ఎస్ఐఆర్ ను పూర్తిగా రద్దు చేయాలని కోరుకుంది. అయితే, ఈ ఒక్క కారణంతో ఇసిఐ అంగీకరించలేదు. తన చర్యను సమర్థించుకోవడానికి అత్యుత్తమ న్యాయ నిపుణులను ఉపయోగిస్తోంది. దురదృష్టవశాత్తు, సిఇసి, ఇసిఐ తమ లక్ష్యంలో చాలా వరకు విజయం సాధించాయి. శుక్రవారం బిహార్‌లోని ముసాయిదా ఓటర్ల జాబితా నుండి 65 లక్షల పేర్ల తొలగింపును పరిశీలించే బాధ్యతను సుప్రీంకోర్టు రాజకీయ పార్టీలపై పెట్టింది. ఆన్‌లైన్‌లో అభ్యంతరాలు,



తాజా దరఖాస్తులను దాఖలు చేయవచ్చని కూడా కోర్టు పేర్కొంది. ఆధార్‌ను రుజువుగా అంగీకరించాలని మూడవసారి సర్వోన్నత న్యాయస్థానం సిఇసిని కోరినప్పటికీ, ఆ ఆదేశం అమలు అవుతుందా లేదా అనేది ఇంకా స్పష్టంగా లేదు.

తుది ఓటర్ల జాబితాను ప్రకటించడానికి చివరి తేదీ అయిన సెప్టెంబర్ 1లోగా బిఎల్‌ఏలు లేదా బిఎల్‌ఓలు ఈ పనిని పూర్తి చేస్తారా అనేది నిజంగా ఆసక్తికరంగా ఉంది. బిహార్‌లోని 12 ప్రధాన రాజకీయ పార్టీల బూత్‌స్థాయి ఏజెంట్లకు (బిఎల్‌ఏలకు) 65 లక్షల తొలగింపుల కచ్చితత్వాన్ని తనిఖీ చేయడంలో ఇసిఐకి సహాయపడాలని కూడా కోర్టు ఆదేశించింది. ఈ ఆదేశం నిరుపయోగంగా ఉంటుంది. గత రెండు నెలల్లో చనిపోయిన వారి పేర్లను కూడా గుర్తించలేని ఇసిఐ, 8 రోజుల్లో ఈ పనిని ఎలా సాధించగలదు? స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను ప్రచురించాలనే డిమాండ్‌ను అడ్డుకోవడానికి ఇసిఐ నుండి వచ్చిన ఈ సూచన కేవలం ఒక పన్నాగం మాత్రమే.

సిఇసి జ్ఞానేశ్ కుమార్ సుప్రీంకోర్టు దృష్టిని మరల్చడంలో విజయం సాధించారని చెప్పడం అతిశయోక్తి కాదు. ఒకవేళ సిఇసి, ఇసిఐ నిజంగా ఆ తప్పును సరిదిద్దడానికి నిబద్ధతతో ఉండి ఉంటే, ప్రారంభ విచారణ సందర్భంగా రెండు నెలల క్రితమే ఈ సూచనతో ముందుకు వచ్చి ఉండాల్సింది. ప్రతిపక్ష పార్టీలు ఫిర్యాదు చేసినప్పటికీ, బిఎల్‌ఏలు జోక్యం చేసుకోవడానికి అనుమతించకూడదనే సిఇసి మొండితనం ఆ తప్పును సరిదిద్దడానికి దాని అయిష్టతను స్పష్టం చేసింది. మరణం, పలు చోట్ల నమోదు, వలస,ఆచూకీ తెలియని కారణంగా తొలగించబడిన 65 లక్షల ఓటర్ల పరిశీలనను బిఎల్‌ఏలు ఎనిమిది రోజుల్లో పూర్తి చేస్తారనేది ఒక భ్రమ.

ఓటర్లు తమ అభ్యంతరాలను ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చని కూడా సర్వోన్నత న్యాయస్థానం సూచించింది. ఇటీవల వచ్చిన వరదల వల్ల నిరాశ్రయులైన వలస కూలీలు లేదా పేదలు తమ ఫారాలను ఆన్‌లైన్‌లో సమర్పించగలరని ధైర్యంగా ఆ బెంచ్లోని న్యాయమూర్తులు చెప్పగలరా? అభాగ్యులకు ఆన్‌లైన్ సదుపాయాలను సిఇసి, ఇసిఐ అందుబాటులోకి తీసుకురాగలవా? భోజ్‌పూర్‌లోని జమానియాతో సహా వేలాది జనాభా ఉన్న రెండు గ్రామాలు పూర్తిగా నాశనమయ్యాయి అనే వాస్తవం న్యాయమూర్తులకు తెలిసి ఉండాలి. నితీశ్ ప్రభుత్వం వారిని ప్రత్యామ్నాయ ప్రదేశానికి తరలించడానికి కూడా చర్యలు తీసుకోలేదు. ఎవరు ఎక్కడకు తరలించబడ్డారో తెలియదు. ఈ గ్రామాల ప్రజలకు నివాస గుర్తింపుగా ఆధార్‌ను కూడా అందించడం సాధ్యమేనా?

సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ నుండి రెండు ఫిర్యాదులు అంగీకరించబడ్డాయని శుక్రవారం ఇసిఐ ప్రకటించింది. ఆ రోజు విచారణ ముగింపులో కోర్టు తన ఉత్తర్వులో ఈ విషయాన్ని గుర్తించింది. అయితే, రాజకీయ పార్టీలు పత్రాలను సమర్పించడానికి ఆసక్తి చూపడం లేదనే అభిప్రాయం ఏర్పడటం బాధాకరం. కోర్టు మాట్లాడుతూ '1.68 లక్షల బిఎల్‌ఏలు ఇప్పటివరకు కేవలం రెండు అభ్యంతరాలను మాత్రమే దాఖలు చేయడం చూసి మేము ఆశ్చర్యపోయాము' అని పేర్కొంది. కానీ వాస్తవం ఏమిటంటే, బిఎల్‌ఏలు అభ్యంతరాలను సమర్పించడానికి అనుమతించబడటం లేదు. ఈ మేరకు సిపిఐ(ఎంఎల్) ఒక అధికారిక ఫిర్యాదు కూడా సమర్పించింది.

బిఎల్‌ఓలు అలాంటి (ఆన్ లైన్) ఫారాలను స్వీకరించకుండా ఎందుకు నిరోధించబడ్డారని సిఇసి నుండి ఒక సాధారణ, స్పష్టమైన సమాధానాన్ని కోర్టు కోరి ఉండాల్సింది. ఇండియా కూటమి, ముఖ్యం గా రాహుల్ గాంధీ ఈ కుంభకోణాన్ని బయటపెట్టడమే లక్ష్యంగా పెట్టుకున్నప్పుడు,ఇసిఐ వాదనను ఎవరైనా ఎలా నమ్మగలరు? సీనియర్ న్యాయవాదులైన కపిల్ సిబల్, బృందా గ్రోవర్, అభిషేక్ మను సింఘ్వీ, ప్రశాంత్ భూషణ్ , ఇతరులకు ఈ విషయం తెలియదని ఈసీఐ ప్రజలు నమ్మాలని కోరుకుంటుందా?

సిపిఐ(ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య మాట్లాడుతూ 'మా బూత్‌స్థాయి ఏజెంట్లు (బిఎల్‌ఏలు) మొదటి రోజు నుంచే ఫిర్యాదులు సమర్పిస్తున్నారు. అన్యాయమైన తొలగింపులకు వ్యతిరేకంగా ఫిర్యాదుల కోసం ఫారం 6ను కూడా ఉపయోగించవచ్చని ప్రధాన ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. మా బిఎల్‌ఏలు అదే చేస్తున్నారు. అయినప్పటికీ ఇసి'0' ఫిర్యాదులు చూపిస్తోంది!' అని ఆయన అన్నారు. 'మేము మళ్లీ విచారించినప్పుడు, బిఎల్‌ఏలు సంతకం చేయాల్సిన అఫిడవిట్ గురించి మాకు చెప్పారు. చివరికి, నేటి విచారణకు ముందు, వారు మా రెండు ఫిర్యాదులను మాత్రమే అంగీకరించారు' అని దీపాంకర్ తెలిపారు. 'మాకు దాదాపు 3,000 మంది బిఎల్‌ఏలు ఉన్నారు, కానీ వారిలో సగం మంది పేర్లు ఇంకా అధికారికంగా ప్రభుత్వం ద్వారా గుర్తించబడలేదు, ఇది కూడా మా ఫిర్యాదులను దాఖలు చేయగల సామర్థ్యాన్ని పరిమితం చేస్తోంది' అని ఆయన అన్నారు. బిహార్‌లోని సిపిఐఎంఎల్ లిబరేషన్‌కు చెందిన 1,496 బిఎల్‌ఏలను ఎన్నికల అధికారులు అధికారికంగా గుర్తించారు.

అయినప్పటికీ రాహుల్ శుక్రవారం ఓటర్ల జాబితాలోని తప్పులను సరిదిద్దడానికి సిఇసి అయిష్టతకు అసలు కారణాన్ని బయటపెట్టారు. 'ఎస్ఐఆర్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బిజెపి, ఇసి మీ ఓట్లను దొంగిలించడానికి చేసే ప్రయత్నం. మోదీ ప్రభుత్వం 'దొంగిలించిన ఓట్ల'పై ఏర్పడింది, అందుకే అది ప్రజల సమస్యలను పట్టించుకోదు. నేను మిమ్మల్ని ఒక సూటి ప్రశ్న అడగాలనుకుంటున్నాను. దొంగిలించిన ఓట్ల ద్వారా ఏర్పడిన ప్రభుత్వం ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశ్యం ఎప్పుడైనా కలిగి ఉంటుందా?' అని ఆయన అన్నారు. 'రికార్డు స్థాయి నిరుద్యోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తోంది. కానీ ప్రభుత్వం పెట్టుబడిదారుల ఖజానాలను నింపుతూనే ఉంది'అని ఆయన అన్నారు.

'మీరు జీవించినా, చనిపోయినా, బాధపడినా అది వారికి తేడా చేయదు. ప్రజలు ఓటు వేసినా వేయకపోయినా, దొంగతనం ద్వారా తిరిగి అధికారంలోకి వస్తామని వారికి నమ్మకం ఉంది. ఎస్ఐఆర్ అనేది మీ ఓట్లను దొంగిలించడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బిజెపి, ఇసి చేసే ప్రయత్నం. మీ ఓటు హక్కులను లాక్కోవడానికి వారు తమ వంతు కృషి చేస్తున్నారు. ఓట్ చోరీ అనేది భారతదేశ రాజ్యాంగంపై దాడి' అని ఆయన అన్నారు.

# ప్రతిభులను ఆకర్షిస్తున్న చైనా, బెంబేలెత్తుతున్న అమెరికా!



ఎం.కోటేశ్వరరావు

అవును ఎవరు అవునన్నా కాదన్నా, మరొకటన్నా ఇది నిజం. సూర్యుడు తూర్పున ఉదయించి పశ్చిమాన అస్తమిస్తున్నట్లుగా మేధావులందరూ పశ్చిమ దేశాలలోనే పుట్టారు, మిగతా దేశాల వారు అక్కడికే వెళతారు అన్నట్లుగా కొందరు చాలా కాలంగా జనాల మెదళ్లకు ఎక్కించారు. ఇప్పుడు చైనా కమ్యూనిస్టులు దాన్ని తలకిందులు చేస్తున్నారు. గత శతాబ్దిలో ప్రపంచాన్ని ఏలిన చమురుకు ప్రాధాన్యత కొనసాగుతూనే ఉంది. అయితే అదే సర్వస్వం కాదని తేలిపోయింది. దాన్ని పక్కన పెట్టే '' ప్రతిభ '' ప్రత్యామ్నాయ హరిత ఇంధనం, క్వాంటమ్, కృత్రిమ మేధ వంటి రూపాల్లో ముందుకు వస్తున్నది. చమురుతో పని లేకుండా నడిచే విద్యుత్ వాహనాలు రోడ్లను ముంచెత్తటం తెలిసిందే. ఈ పూర్వరంగంలో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో 2035 నాటికి అమెరికాను అధిగమించేందుకు చైనా నడుంకట్టటం గురించి కొద్ది నెలలుగా మీడియాలో విశ్లేషణలు వెలువడుతున్నాయి, అవేవీ కమ్యూనిస్టులు నడిపేవి కాదు, చివరికి కరడుగట్టిన ఆర్ఎస్ఎస్ వాదుల పచ్చి కమ్యూనిస్టు వ్యతిరేక పత్రిక ''స్వరాజ్య ''లో 2025 జూన్ 27న అమిత్ మిశ్రా అనే విశ్లేషకుడు కూడా రాశారు.దాన్ని నవీకరించి ఆగస్టు మూడున తిరిగి ప్రచురించారు. '' మేథోవంతుల ఆకర్షణ : వేయి ప్రతిభల చైనా వ్యూహం దాని ఔన్నత్యాన్ని ఎలా ముందుకు నెడుతున్నది '' అనే శీర్షిక( కోర్టింగ్ జీనియసెస్ : హౌ చైనాస్ థౌసండ్ టాలంట్స్ స్ట్రాటజీ ఈస్ ఫ్యూయలింగ్ ఇట్స్ ఎసెంట్)తో ఒక విశ్లేషణ వెలువడింది. ఇక్కడ దీన్ని ప్రస్తావించటం అంటే చైనాకు మిత,మతవాదుల సర్టిఫికెట్ లేదా ప్రశంసల గురించి కాదు. చైనా ఎలా దూసుకుపోతున్నదో చూడండి అనే ఉక్రోషం, అసూయ ప్రదర్శన దాని వెనుక ఉందని చెప్పేందుకే.

ఇక సందర్భానికి వస్తే ఈ ఏడాది అక్టోబరు ఒకటి నుంచి అంటే విప్లవదినోత్సం రోజు నుంచి చైనా ప్రభుత్వం ప్రపంచంలోని యువ ప్రతిభావంతులను ఆకర్షించేందుకు కె రకం వీసాలను జారీ చేయాలని నిర్ణయించింది. ఎందుకు అంటే 2035నాటికి శాస్త్ర, సాంకేతిక రంగాలలో అగ్రగామి దేశంగా మారేందుకు అక్కడి కమ్యూనిస్టు పార్టీ నిర్ణయించింది. కొత్తగా పట్టా పుచ్చుకున్న స్వదేశీయులు లేదా విదేశీ విశ్వవిద్యాలయాల నుంచి వచ్చిన వారు, ఇతర దేశాల్లో ఇప్పటికే ఆయా రంగాలలో పనిచేస్తున్న వారిని ఆకర్షించేందుకు పూనుకుంది. ఇటీవలి కాలంలో చైనా విధాన నిర్ణయాలలో ఇది పెద్దదని భావిస్తున్నారు. తనకు ఎదురులేనంతవరకు చైనాను ఎదగనిచ్చిన అమెరికా ఎప్పుడైతే తన ఆధిపత్యానికి అన్ని రంగాలలో ప్రతిఘటన ఎదురవుతున్నదని గ్రహించిందో అప్పటి నుంచి అడ్డుకోవటం ప్రారంభించింది. వైట్‌హౌస్‌లో ఏ పార్టీ వారున్నా అదే చేస్తున్న పూర్వరంగంలో దానికి ధీటుగా చైనా కమ్యూనిస్టు పార్టీ చేసిన కసరత్తు నుంచి వెలువడిందే తాజా నిర్ణయం. ప్రధాని లీ క్వియాంగ్ సంతకంతో అది చట్టంగా మారింది. స్టెమ్(సైన్సు, టెక్నాలజీ, ఇంజనీరింగ్, గణితం) రంగాలలో ప్రతిభావంతులైన విదేశీ యువతను ఆకర్షించేందుకు సరికొత్త '' యువ ప్రతిభ '' కె వీసా ప్రత్యేకత ఏమంటే చైనాలో ఉన్న కంపెనీల యజమానులు లేదా సంస్థల నుంచి సిఫార్సులు అవసరం లేదు.నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇప్పటికే అమల్లో ఉన్న ప్రతిభావంతులైన యువశాస్త్రవేత్తల కార్యక్రమంలో వయస్సు గరిష్ట పరిమితి 45 సంవత్సరాలు, మరో పథకానికి 40 ఏండ్లు. దీనికి ఎలాంటి వయో పరిమితి నిబంధన లేదు. ఇతర దేశాలతో పోటీ పడుతూ వేతనాలు, వసతి, బోనస్, పిల్లలకు విద్య వంటి ఇతర సౌకర్యాలను కల్పిస్తారు. దేశ విధానానికి లోబడి పరిశోధనలో స్వేచ్ఛ ఉంటుంది. ఇప్పటి వరకు విదేశీ పెట్టుబడులకు ఎలాంటి రాయితీలు ఇచ్చి ప్రోత్సహించారో ఇప్పుడు ప్రతిభావంతులైన వారిని ఆకర్షించేందుకు అలాంటి విధానాన్నే ముందుకు తెచ్చారని చెప్పవచ్చు. ఇలాంటి ప్రత్యేక వీసాలు అమెరికా, కెనడా, బ్రిటన్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో ఎప్పటి నుంచో ఉన్నాయి.

అమెరికాలో చైనా సంతతికి చెందిన వారి మీద పెరుగుతున్న జాత్యహంకార వివక్ష, ఆంక్షలు, పరిశోధనలకు కేటాయింపుల కోత, గూఢచర్య ఆరోపణలతో వేధింపులు, రెండు దేశాల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల పూర్వరంగంలో అనేక మంది అక్కడి నుంచి బయటపడేందుకు చూస్తున్నారు. మంచి పండ్లను ఏరి దిగుమతి చేసుకున్నట్లుగా దశాబ్దాల తరబడి, అమెరికా, ఇతర పశ్చిమ దేశాలు మేథోవలసతో ఎంతగానో లబ్దిపొందాయి. ఇప్పుడు అటునుంచి వలసలకు చైనాతో నాంది పడిందంటే అతిశయోక్తి కాదు. అయితే ఇది ఒక్క రోజులో జరిగింది కాదు.చైనా కమ్యూనిస్టు పార్టీ నేత లి యువాన్ చావో 2008లో ''వేయి ప్రతిభావంతుల పథకాని(టిటిపి)కి రూపకల్పన చేశారు .విదేశాల్లో ఉన్న చైనా సంతతికి చెందిన వారిలో కనీసం రెండువేల మందిని స్వదేశానికి ఆహ్వానించి ఒక నవకల్పన సమాజంగా దేశాన్ని మార్చాలని తలపెట్టారు. 2011లో ఈ పథకాన్ని అమల్లోకి తెచ్చినపుడు ఏటా 50 నుంచి వందమందిని పదేండ్ల పాటు ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే దానికి మించి ఇప్పటి వరకు ఏడువేల మంది శాస్త్రవేత్తలు, ఆర్థికవేత్తలు, వాణిజ్య,పారిశ్రామికవేత్తలు వచ్చారని అంచనా, వారిలో ఇతర దేశాలకు చెందినవారు కూడా ఉన్నారు. మరొక సమాచారం ప్రకారం 2010 నుంచి 2021 మధ్య కాలంలో కనీసం 20వేల మంది చైనా జాతీయులు అమెరికా నుంచి స్వదేశానికి వెళ్లారు. ఇలాంటి వారు చూపుతున్న ప్రతిభను బట్టి మిలియన్ల యువాన్లను బోనస్, ఇతర రాయితీలను ప్రతిఫలంగా చెల్లించుతున్నారు. అమెరికా నుంచి వచ్చే వారు విద్రోహచర్యల నిమిత్తం వస్తున్నారా, నిజంగానే పనిచేసేందుకా అని నిర్ధారించుకొనేందుకు సునిశిత పరిశీలనలు కూడా చేశారని వార్తలు. ఈ పథకానికి చైనా పెద్ద ప్రచారం ఇవ్వలేదు గాని దాని తీరుతెన్నులు గమనించిన అమెరికా జాతీయ గూఢచార సంస్థ, ఎఫ్‌బిఐ గుండెలు బాదుకుంటూ నివేదికలు రూపొందించాయి. చైనా ఆర్థిక, మిలిటరీ రంగాలలో పురోగమించటానికి చట్టబద్ధంగా, అక్రమ పద్ధతుల్లో అమెరికా మేథో సంపదను చైనా కొల్లగొడుతున్నదని ఆరోపించారు. ఈ ప్రచారం పెరగటంతో చైనా కొత్త పద్ధతుల్లో క్విమింగ్ పేరుతో ప్రతిభావంతులను ఆకర్షించేందుకు పూనుకుంది. 2019 నుంచి 2023వరకు ఐదు వందలకు పైగా ప్రభుత్వ పత్రాలను పరిశీలించిన రాయిటర్స్ వార్తా సంస్థ చైనా ఇస్తున్న నగదు, ఇతర మొత్తాల గురించి పేర్కొన్నది.

దశాబ్దాలుగా భారత్, చైనా వంటి దేశాల నుంచి ఎందరో ప్రతిభావంతులు ఎక్కువగా అమెరికా, ఇతర పశ్చిమదేశాలకు వలస వెళ్లారు. వ్యక్తిగతంగా ఆయా దేశాల పురోభివృద్ధికి ఎంతగానో తోడ్పడ్డారు. ఆర్థికంగా నిలదొక్కుకొని ఎదగటం ప్రారంభమైన తరువాత మరింత ముందుకు పోవాలంటే అలాంటి వలసల అవసరం ఎంతో ఉందని చైనా కమ్యూనిస్టు పార్టీ గుర్తించింది. కమ్యూనిస్టులు ప్రతిభావంతుల మీద కూడా తమ సిద్ధాంతాలను రుద్దుతారని, వారికి స్వేచ్ఛ ఇవ్వరని పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నారు.చైనా కమ్యూనిస్టులు దాన్ని కూడా గమనంలో ఉంచుకున్నారు. నూటనలభై కోట్ల జనాభా జీవితాలను ఉన్నత స్థితికి తీసుకువెళ్లాలంటే ఇంకా చేయాల్సింది చాలా ఉంది. దాన్లో భాగంగానే తమ దగ్గరలేని పెట్టుబడులను, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆహ్వానించారు. అవి తమ నుంచి లబ్దిపొందుతాయని తెలిసినప్పటికీ దాని కంటే తాము ఎక్కువ ప్రయోజనం పొందుతామనే ముందు చూపు, ధైర్యంతో ఎన్ని విమర్శలు వచ్చినా సంస్కరణలకు తెరతీశారు, విజయం సాధించారు. సెమికండక్టర్లు, వైమానిక రంగం, 5జి, క్వాంటమ్ వంటి అనేక రంగాల్లో చైనా మరొకదాని వెనుక వెళ్లే పరిస్థితి నుంచి పోటీదారుగా మారింది.

గత నాలుగున్నర దశాబ్దాల సంస్కరణల ఫలితాలు, విధానాల గురించి కొంతమంది విమర్శలు చేయవచ్చు. ఇప్పుడు చైనా మరొకదశలో ప్రవేశించింది. అధికారాన్ని కార్మికవర్గం చేతిలో పెట్టటం ద్వారా విప్లవం చేయాల్సినపని చేసింది. సాధించిన అధికారం ఒక్కటే జన జీవితాలను మెరుగుపరచదని గుర్తించిన తరువాత తీసుకున్న చర్యలకు తగిన ఫలితాలు వచ్చాయి. వాటికి ఉన్న పరిమితులను గమనించి మరొక అడుగు ముందుకు వేస్తున్నది. విదేశీ పెట్టుబడులకు కొంత ప్రతిఫలాన్ని చెల్లించినట్లుగా, స్వదేశంలోనే సంస్థల పెరుగుదలకు వ్యక్తులను ప్రోత్సహించిన తీరు చూశాము. అలాగే ప్రతిభావంతులకు మిగతావారితో పోలిస్తే అధికమొత్తాలను ఇవ్వాల్సి ఉంటుందని గ్రహించింది. మరిన్ని పరిశోధనల ఫలితాలను జనకల్యాణానికి వినియోగించేందుకు పూనుకున్నది. ప్రపంచంలో ఉన్న ప్రతిభావంతులను చైనా ఆకర్షించటం అమెరికా మాదిరి కార్పొరేట్ల లాభాలకు కాదు, జనాల కోసం. ఈ ప్రయత్నం వెనుక వ్యూహాత్మక, రాజకీయ ప్రయోజనాలు కూడా ఉంటాయి. నిజానికి ఇది చైనా కమ్యూనిస్టు పార్టీకి కత్తిమీద సామువంటిదే. వచ్చేవారు ఆకాంక్షలకు అనుగుణంగా పని చేయాలి, శాస్త్ర రంగ నాయకత్వంతో పాటు రాజకీయ నాయకత్వంలో ఇమిడి పోయే విధంగా ఉండాలి. కమ్యూనిస్టుల గురించి అనేక తప్పుడు ప్రచారాలు జరిగిన నేపథ్యం,అన్యవర్గ ప్రభావంతో అలాంటి వారు ప్రతి చర్యనూ అనుమానంతో చూసే అవకాశం ఉంటుంది, సహజం. వీటన్నింటినీ గమనంలో ఉంచుకొనే చైనా కమ్యూనిస్టులు ఒక ప్రయోగం చేస్తున్నారని చెప్పవచ్చు. ఇప్పటి వరకు అది చేసిన వన్నీ మొత్తం మీద ఫలించాయి.

చైనాలో ప్రస్తుతం ప్రయోగశాలలు, పరిశోధనా కేంద్రాలు, విశ్వవిద్యాలయాల పర్యావరణం నానాటికీ పెరుగుతున్నది. ప్రపంచ స్థాయి సంస్థలలో చైనా వాటికి చోటుదక్కుతున్నది. క్వాంటమ్ కంప్యూటింగ్, బయోమెడిసిన్, కృత్రిమ మేధ, ప్రత్యామ్నాయ ఇంధన రంగాలలో సాధించే పురోగతిలో అగ్రగామిగా ఉన్న అమెరికాను అధిగమించాలన్నది కమ్యూనిస్టు పార్టీ నిర్దేశించిన లక్ష్యం. ఇది ప్రారంభం మాత్రమే. మరోవైపున చూస్తే అమెరికా, ఇతర పెట్టుబడిదారీ ధనిక దేశాలు పరిశోధకులను, వారితో కలిగే లాభాలను కోల్పోతే చూస్తూ ఊరుకోవు. ప్రమాణాలకు గీటురాళ్లుగా ఇప్పటి వరకు కొనసాగిన అమెరికా విశ్వవిద్యాలయాలు ఆ స్థానాన్ని నిలబెట్టుకుంటాయా? ప్రతిభావంతులను ఆకర్షించేందుకు పోటీ పడటంలో కెనడా, ఆస్ట్రేలియా, సింగపూర్, జర్మనీ, అరబ్ ఎమిరేట్స్ వంటివి కూడా ఉన్నాయన్నది మరచిపోరాదు. గుత్తాధిపత్యాన్ని దెబ్బకొట్టే విధంగా రానున్నరోజుల్లో పోటీ మరింత పెరగటం మంచిదే. వ్యక్తుల ప్రతిభకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుంది, అయితే అది పూర్తిగా వారి స్వంతం కాదు, సమాజం నేర్పినదానికి తమ సృజనాత్మకత జోడింపు మాత్రమే.

ఉదాహరణకు విద్యుత్ బల్బ్‌ను చూస్తే, 1,799 సంవత్సరం నుంచి బల్బులు, బ్యాటరీల తయారీకి పరిశోధనలు ప్రారంభమయ్యాయి. అనేకమంది చేసిన కృషితో 1870, 80 దశకాల్లో పోటీ మరింత పెరిగింది.బ్రిటన్‌లో జోసెఫ్ స్వాన్, అమెరికాలో థామస్ ఎడిసన్ ఒకేసారి బల్బులను కనుగొన్నారు. స్వాన్ బల్బులు విలియమ్ స్టెయిట్ రూపొందించిన నమూనాల ప్రకారం ఉన్నాయి. వాటి ఫిలమెంటు చాలామందంగా ఉంది. ఎడిసన్ బల్బులో పలుచగా ఉండటంతో వాణిజ్య పరంగా అది విజయవంతమైంది. స్వాన్, ఎడిసన్ మధ్య పోటీ చివరకు వారిద్దరినీ ఒక దగ్గరకు చేర్చి ఎడిసన్ మరియు స్వాన్ ఎలక్ట్రిక్ లైట్ కంపెనీగా ఏర్పడి స్వాన్ రూపొందించిన ఫిలమెంట్‌తో మార్కెట్ చేశారు. కానీ పేరు ఎడిసన్‌కు వచ్చింది, దాని వెనుక ఎందరో ఉన్నారు. ఆ తరువాత బల్బుల్లో ఎన్ని మార్పులు, చేర్పులు జరిగాయో మనకు తెలిసిందే.

అందువలన ప్రతి నవకల్పన సమాజానికి ఉపయోగపడుతుందా, కార్పొరేట్ల లాభాలకా అన్నదాన్ని బట్టి శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాల వర్గదృక్పధం గురించి చెప్పుకోవాల్సి ఉంటుంది. చైనా కార్మికవర్గ వైఖరితో ప్రతిభకు పట్టం కడుతున్నదని చెప్పవచ్చు.

## కట్...కట్...కట్...

# ఉద్యోగ, పెన్షనర్ల పై వేలాడుతున్న కత్తి!?

దేశవ్యాప్తంగా ఉన్న ఉద్యోగులు,పెన్షనర్ల భవితవ్యం ప్రమాదపు టంచులపై ఉంది. కేంద్రప్రభుత్వం తెస్తున్న చట్టాలు ఉద్యోగులు,పెన్షనర్ల భద్రతపై కత్తిలా వ్రేలాడుతున్నాయి. ఇప్పటికిప్పుడు ప్రమాదం లేకపోయినా ప్రమాదపు అంచులపై కాలం నడక తప్పదంలేదు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ఆమోదం పొందిన 'ఫైనాన్షియల్ బిల్లు – 2025' పెన్షనర్ల పాలిట శాపంగా మారింది. ఆ బిల్లులో స్పష్టంగా లోక్‌మత్ కమీషన్ చేసిన పెన్షనర్ల రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఉపసంహరించుకోవాలన్న సూచనలు పొందుపరిచారు. కనుక 2026లో బిల్లు ఆచరణలోకి వచ్చేనాటినుండి పెన్షనర్ల పదవీ విరమణ బెనిఫిట్స్‌కు సర్వమంగళం పాడి నట్లే? ఇదిలా ఉండగా ఆబిల్లులోనే పెన్షనర్ల భద్రతకు సంబంధించిన అంశాలకు సంబంధించి పెన్షన్ పెంపుదలపై 'ప్రభుత్వం అనుమతుల మేరకు' అనే వాక్యం చేర్చడం వలన పెరిగే కరువు భత్యం, వేతన సవరణలు వర్తింపజేయడం ఆయా ప్రభుత్వాల దయాదాక్షిణ్యతలకు వదిలివేయడం జరిగింది. అటూ, ఇటూ కాని స్పష్టత లేని వాక్యాలు చట్టంలో మర్మ గర్భితంగా చేర్చడం వలన ఆయా ప్రభుత్వాలు పెన్షనర్ల కున్న హక్కును లాగేసుకునే ప్రమాదం సైతం పొంచివుంది. ఇదిలా ఉండగా ఇప్పటికే మన తెలంగాణా రాష్ట్రం లో2014,ఏప్రియల్ నుండి రిటైర్ అయిన 8వేల మంది ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ 16లక్షల గ్రాడ్యుయటీతోపాటు,పెన్షన్ కమ్యుటేషన్, దాచుకున్న జనరల్ ప్రావిడెంట్ ఫండ్, ఎర్న్‌డ్ లీవు ఎన్‌క్యాష్‌మెంట్ సొమ్ములు రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ లో పెట్టింది. రిటైర్ ఉద్యోగులఈబకాయిలమొత్తం 9వేల కోట్లు పైమాటే నని ఒక అంచనా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ బకాయిలు ఎప్పుడు మంజూరు చేస్తుందోనని రిటైర్ ఉద్యోగులు ఏడాదిన్నర కాలంగా ఎదురు చూస్తున్నారు. 1982లో సుప్రీంకోర్టు రిటైర్ ఉద్యోగి డి.యస్.నకాలి కేసులో పెన్షన్ అనేది ప్రభుత్వం ఇచ్చే దయాదాక్షిణ్యం కానేకాదు. ఉద్యోగుల గత సేవలను దృష్టిలో ఉంచుకొని పెన్షన్ పొందే హక్కు వారికి సంక్రమిస్తుందని సుప్రీంకోర్టు స్పష్టం చేయడంతోపాటు, ఉద్యోగులతో సమానంగా కరువు భత్యం, పే కమీషన్ పెన్షనర్లకు వర్తిస్తుందని స్పష్టం చేసింది. ఆ తీర్పు ఇచ్చిన డిసెంబర్ 17నే దేశవ్యాప్తంగా రిటైర్ ఉద్యోగులు పెన్షన్ దేగాజరుపుకుంటున్నారు. ఇప్పుడు కేంద్రం తెచ్చిన నూతన ఫైనాన్స్ చట్టం ప్రభుత్వ దయాదాక్షిణ్యాలకు రిటైర్డ్ ఉద్యోగుల హక్కులు వదిలివేయడంతోపాటు, రిటైర్ ఉద్యోగుల పెన్షన్ భద్రతపై కత్తి వేలాడుతూనే ఉంటుంది.

అమెరికా అధ్యక్షుడుగా ట్రంప్ అధికారంలోకి రాగానే ఆర్థిక స్థిరత్వం పేరుతో లక్షలాది మంది ఉద్యోగులను తొలగించారు. ప్రపంచ దేశాలపై ఇబ్బడి ముబ్బడిగా పన్నులు వేసి పడేశారు. ఇదే బాటలో మన నరేంద్ర మోడీ కొందరు పనిచేయని ఉద్యోగులను, మరికొందరు అవినీతి పరులైన ఉద్యోగులను, రెడ్ టేపిజమ్ ప్రదర్శించి ప్రజలను చులకనగా చూసే ఉద్యోగులపై వేటువేసే పేరుతో రాజ్యాంగ చట్టంలోని ఆర్టికల్ 311ను సవరించనున్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 311(1) అనేది ఉద్యోగిని అర్థాంతరంగా డిస్మిస్ చేయడాన్ని, లేదా తొలగించడాన్ని, ర్యాంకు తగ్గించడంవంటి ప్రభుత్వ చర్యలనుండి భద్రత కలిపిస్తుంది. ఇక ఆర్టికల్ 311(2) నిబంధనలు కేవలం క్రిమినల్ కేసులో శిక్ష పడ్డప్పుడు, మరి కొన్ని తీవ్రమైన సందర్భాల్లో చర్యలు తీసుకోవడం, అది ఉద్యోగికి సమాచారం ఇచ్చి, సంజాయిషీ చెప్పుకునే అవకాశం ఇచ్చి మాత్రమే సంబంధిత ఉద్యోగిని తొలగించే అవకాశం ఉంటుంది. రాజ్యాంగంలో ఉద్యోగులకు భద్రత కల్పిస్తున్న 311 ఆర్టికల్ నందు సవరణ చేయాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం ఉంది.

అంబేద్కర్ ఉద్యోగ భద్రత, ప్రభుత్వాల నుండి రక్షణ కల్పించారు. ప్రపంచీకరణ, సరళీకరణ, గ్లోబలీకరణ విధానాలు రావడంతో కాగితాలు బదులు కంప్యూటర్ పరిజ్ఞానం అందుబాటులోకి రావడం, ఐటి లాంటి సెక్టారులో ప్రైవేటు ఉద్యోగాలు అవకాశంగా రావడం, అటు తర్వాత రెగ్యులర్ నియామకాలకు బదులు ఔట్ సోర్సింగ్ సేవలు అందుబాటులోకి రావడంతో ప్రభుత్వ ఉద్యోగుల ప్రాధాన్యత తగ్గింది. ఉద్యోగులు కూడా చాలా సందర్భాల్లో చాలామంది ఉద్యోగులు తమ చేతిలో ఉన్న అదికారం దుర్వినియోగం చేయడం, కొందరు అదేపనిగా అవినీతి రూపాలుగా తమసేవలను మార్చడం, ప్రజాసేవకులుగా కాకుండా తామేదో ప్రత్యేక వర్గం అన్న భావనలు కొందరు ఉద్యోగుల్లో ఏర్పడి ప్రజలతో సత్సంబంధాలు కోల్పోయిన స్థితి ఉంది. ఇప్పుడు ప్రభుత్వాలు రాజ్యాంగ బద్ధంగా ఆర్టికల్ 311ప్రకారం సంక్రమించిన హక్కులను తొలగిస్తున్నా,సవరిస్తున్నా కనీసం స్పందన లేని స్థితి నెలకొంది. ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న చట్టం మార్పుల్లో , లేదా సవరణల్లో ఆర్టికల్ 311కూడా ఒకటి కావడం పెద్ద విశేషం ఏమీకాదు? ఇదే జరిగితే ప్రైవేటు ఉద్యోగాల మాదిరిగా ప్రభుత్వ ఉద్యోగులకు భద్రత లేనట్లే!, అంతేకాదు నిరంకుశ ప్రభుత్వాలు ఏర్పడినప్పుడు ఉద్యోగులను వారి చేతిలో పావులుగా మార్చుకోవడానికి సైతం ఈ చట్టసవరణ తోడ్పడే ప్రమాదం కూడా ఉంది. కనుక ప్రభుత్వ ఉద్యోగులలో మార్పు రావడంతో పాటు, ఇట్లాంటి చట్టాలను సమైక్యంగా ఉద్యోగులు ఎదుర్కొనడం ద్వారా భవిష్యత్తు తరాలకు ఉద్యోగవ్యవస్థకు మేలుచేసిన వారవుతారు. ప్రభుత్వాలు కూడా ఉద్యోగులు హక్కులను, రాజ్యాంగ స్ఫూర్తితో ఆలోచించి మాత్రమే చట్ట సవరణలకు పోవాల్సి ఉం టుంది..

ఎన్.తిర్మల్, 9441864514,
thirmal.1960@gmail.com

## డ్రంకన్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** మద్యం సేవించి వాహనాలు నడిపిన 8 మందిలో ఇద్దరికి ఒక రోజు జైలు శిక్ష, జరిమానా విధించినట్లు, మరో ఆరుగురికి జరిమానాసూర్యాపేటకోర్టు విధించినట్లు సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం మంగళవారం తెలిపారు. సోమవారం సూర్యాపేట పోలీసు స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో 8 మంది పట్టుబడినట్లు తెలిపారు. మంగళవారం కోర్టులో హాజరుపర్చగా ఇద్దరికి ఒక రోజు జైలు శిక్ష, జరిమానా, మరో ఆరుగురికి కలిపి రూ.11వేలు జరిమానా విధిస్తూ సూర్యాపేట ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి పివి రమణ తీర్పు వెల్లడించినట్లు ఎస్ఐ వివరించారు.



### సాగర్ ప్రాజెక్ట్‌కు తగ్గిన ఇన్ ఫ్లో

## 14 గేట్ల ద్వారా నీటివిడుదల

**ప్రజాపక్షం/నందికొండ:** ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు వరద ప్రవాహం బాగా తగ్గుముఖం పట్టడంతో ఐదు గేట్ల ద్వారా నీటి విడుదలను కొనసాగిస్తున్నారు.నాగార్జునసాగర్ రిజర్వాయర్ వరద తగ్గుముఖం పట్టింది. ఆదివారం సాయంత్రం వరకు నాలుగు లక్షల క్యూసెక్కులుగా ఉన్న వరద ప్రవాహం రోజుకు లక్ష క్యూసెక్కులు చొప్పున తగ్గుముఖం పట్టడంతో అధికారులు ప్రాజెక్ట్ క్రస్టు గేట్ల ఎత్తును బాగా తగ్గించి సోమవారం సాయంత్రం వరకు 26 గేట్ల ద్వారా నీటి విడుదలను కొనసాగించారు.ఆ తర్వాత ఇంకా వరద ప్రవాహం బాగా తగ్గుముఖం పట్టడంతో గేట్ల సంఖ్యతో పాటు ఎత్తును కూడా తగ్గించి మంగళవారం సాయంత్రానికి 14 గేట్లను 5 అడుగుల మేర పైకి లేపి 107338 క్యూసెక్కుల నీటిని స్పిల్వే ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. అయితే శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్ కు మంగళవారం సాయంత్రానికి ఇన్ ఫ్లో గా 161971 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతూ ఉంటే అంతే మొత్తం నీరు అవుట్ ఫ్లో గా వచ్చి చేరుతూ ఉంటే అంతే మొత్తాన్ని అవుట్ ఫ్లో గా దిగువకు విడుదలవుతుంది.

## ప్రజా ఉద్యమ నాయకుడికి నివాళి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** ప్రజా ఉద్యమ నాయకుడు,సిపిఐ జాతీయ మాజీ కార్యదర్శి కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డికి జాతీయ మహిళా సమాఖ్య సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరం మల్లీశ్వరీ ఆధ్వర్యంలో ఘననివాళులు అర్పించారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని జంగిడి సెంటర్లో సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామ్రేడ్ సుధాకర్ రెడ్డి జీవితం,ప్రజా సంక్షేమం కోసం చేసిన పోరాటం నేటి తరానికి ఆదర్శప్రాయంగా నిలుస్తుందన్నారు. వామపక్ష ఉద్యమాలకు బలమైన పునాది వేసిన గొప్ప నాయకుడు సుధాకర్ రెడ్డి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దేవరం సుజాత,సోమగాని లక్ష్మ మ్మ,సింగం పుల్లమ్మ,సోమగాని వెంకటమ్మ,సీతమ్మ,వడ్లానపు పుల్లమ్మ,అరుణ,మంగమ్మ,లక్ష్మ మ్మ,ఎస్కె ఆశ,నాగమణి,ఫాతిమా,రేణుక,లక్ష్మీ ,మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## రామన్నపేటలో రైళ్ల హాల్ట్‌కు వినతి



**ప్రజాపక్షం/రామన్నపేట:** సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవని ఎంపీ చామల కిరణ్‌కుమారరెడ్డి మంగళవారం కలిశారు. ఘట్కేసర్ నుంచి యాదాద్రి భువనగిరి ఎంఎంటీఎస్ రైలు భూసేకరణ కోసం యాదాద్రి, మేడ్చల్ కలెక్టర్లతో ఫోన్‌లో మాట్లాడారు. భువనగిరి నుంచి యాదాద్రి(రాయిగిరి) పనులు మొదలయ్యాయి. వీటిని త్వరితగతిన పనులు పూర్తి చేసి యాదాద్రికి వచ్చే భక్తులకు, అప్ అండ్ డౌన్ కార్మికులకు కష్టాలు తీరుతాయన్నారు. రామన్నపేటలో ఫలక్‌నామా, శబరి, నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌లో హాల్డింగ్ గురించి చర్చించారు. దీనికి రైల్వే మేనేజర్ సానుకూలంగా స్పందించారు. వీరితో పాటు సౌత్ సెంట్రల్ రైల్వే అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఉదయనాధ్ కోట్ల, ఎంఎంటీఎస్ చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ సాయిప్రసాద్‌లు ఉన్నారు.

## వాహనం ఢీ.. బాలిక మృతి

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి:** బొలేరో వాహనం ఢీకొడంతో బాలిక (4) మృతి చెందిన సంఘటన మంగళవారం మండల పరిధిలోని కొల్‌ముంతల్‌పహాడ్ గ్రామ పంచాయతీ బాపూజీనగర్ స్టేజీ వద్ద జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పిట్ల అక్షర రోజు మాదిరిగానే బడికి వెళ్ళడానికి తన నానమ్మతో కలిసి బాపూజీనగర్ బస్టాప్‌వద్ద నిలబడి బస్ కోసం వేచిచూస్తుండగా దేవరకొండ నుండి కొండమల్లేపల్లి వైపు వెళుతున్న ఒక బొలేరో వాహనం 4578 ను నడుపుతున్న పిఏపల్లి మండల కేంద్రానికి చెందిన డ్రైవర్ నిరంజన్ అతివేగంతో రోడ్డు పక్కన నిలబడి ఉన్న అక్షరను బలంగా ఢీకొట్టడంతో తలకు బలమైన గాయం అయ్యి, తీవ్ర రక్త స్రావం జరిగింది. చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో అక్షర చనిపోయింది. మృతురాలి తాత చిన వెంకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అజ్మీరా రమేష్ తెలిపారు.

## క్రీడలకు కృష్ణవేణి విద్యార్థులు




**ప్రజాపక్షం/ రామన్నపేట:** జిల్లా స్థాయి క్రీడా పోటీలకు మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ గంగుల నరేందర్‌రెడ్డి తెలిపారు. తమ విద్యార్థులు మండల స్థాయిలో నిర్వహించిన క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు తెలిపారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను, అందుకు ప్రోత్సహించిన పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.ప్రవీణ్‌కుమార్‌ను, ప్రిన్సిపల్ బి.యాదగిరి, డైరెక్టర్ జె.మణితోపాటు ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

## రూరల్ పోలీస్‌స్టేషన్‌లో తనిఖీ



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ రూరల్ పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ రాజశేఖర్‌రాజు మంగళవారం సందర్శించి వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బంది పరేడ్, కిట్ బాక్స్, సిబ్బంది స్మాల్ సర్వీస్ బుక్, పోలీస్‌స్టేషన్ భవనం, స్టేషన్ రికార్డులు, కేస్ రికార్డులు తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు చేసి మాట్లాడారు. గణేష్ నవరాత్రుల్లో, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా పోలీస్ సిబ్బంది అప్రమత్తగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## ప్రజా సంక్షేమానికి కృషి



**ప్రజాపక్షం/అడ్డగూడూరు:** మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వాటర్ ఫిల్టర్ ప్రారంభోత్సవానికి భువనగిరి పార్లమెంట్ సభ్యులు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డితో కలసి ప్రారంభోత్సవం చేసిన ఎమ్మెల్యే మందుల సామేలు ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉంటుంది సంక్షేమంలో దూసుకుపోతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డిసెంబర్‌లోగా తాగునీటి పనులు పూర్తి

### ఎస్‌డిఎఫ్ ద్వారా రూ.109 కోట్లతో సిసి రోడ్లు, మురికి కాలువల పనులు పూర్తి చేయాలి

### మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ :** పట్టణంలో అమృత్ పథకం కింద సుమారు 56 కోట్ల 75 లక్షల రూపాయలతో చేపట్టిన తాగునీటి ట్యాంకుల నిర్మాణ పనులు డిసెంబర్ లోగా పూర్తిచేసి ప్రజలకు తాగునీరు అందించాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశించారు.మంగళవారం ఆయన మున్సిపల్ సమావేశ మందిరంలో మున్సిపల్ పరిధిలో చేపట్టిన తాగునీరు, రోడ్లు, మురికి కాలువలు, పారిశుధ్యం తదితర అంశాలపై మున్సిపల్, ప్రజారోగ్య ఇంజనీరింగ్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. తాగునీటి ట్యాంకులకు సోర్స్ నుండి నీరు అందించేందుకుగాను అవసరమయ్యే అదనపు నిధులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.మున్సిపాలిటీలో 109 కోట్ల రూపాయల ఎస్‌డిఎఫ్ నిధులతో చేపట్టిన సిసి రోడ్లు, మురికి కాలువల పనులను 3 నెలల్లో పూర్తి చేయాలని ఆయన ఇంజనీరింగ్ అధికారులతో చెప్పారు. ఒకవేళ నిధులు సరిపోనట్లయితే తన దృష్టికి తీసుకురావాలని, అవసరమైతే రాత్రి ,పగలు పనులు నిర్వహించి రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నారు. ఇకపై ఈ పనులపై ప్రతి మంగళవారం తాను సమీక్షిస్తానని మంత్రి తెలిపారు.చందనపల్లి బయోమైనింగ్ డంపింగ్ యార్డ్ ను త్వరితగతిన శుభ్రం చేయించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, పబ్లిక్ హెల్త్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాములు, డిఇ లు కార్తీక్, అశోక్ ,శ్రీధర్ రెడ్డి, ఏఈలు దిలీప్, ప్రవీణ్, అసిం బాబా, ఏసీపీ కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

### మట్టి వినాయకులను పూజించి.. పర్యావరణాన్ని కాపాడాలి

వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరు మట్టి వినాయకులను ప్రతిష్ఠించి పూజించాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోరారు.మంగళవారం ఆయన జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మట్టి వినాయకులను ఉచితంగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సుమారు 4100 మట్టి వినాయకులను ప్రజలకుఉచితంగా అందించడం అభినందనీయమన్నారు. వినాయక చవితిని పురస్కరించుకొని ప్రజలందరూ వాతావరణ కాలుష్యం కాకుండా మట్టి వినాయకులను పూజించాలని తెలిపారు. దీనివల్ల వాతావరణ సమతుల్యంతో పాటు,వినాయకులను నిమజ్జనం చేసే చెరువులు కలుషితం కాకుండా ఉంటాయని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో తయారుచేసిన వినాయక విగ్రహాలను వాడడం వల్ల అన్ని రకాలుగాహానికరమన్నారు.మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, మాజీ ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

## ఆరోగ్య భవన పనులు వేగవంతం

### నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/చండూరు /గట్టుప్పల :** గట్టుప్పల మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె గట్టుప్పల మండల మండలంలో పర్యటించి పలు ప్రభుత్వ సంస్థలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గట్టుప్పల లోని గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల వసతి గృహాన్నితనిఖీ చేసి వసతి గృహంలో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు.పాఠశాలఆవరణలో పరిశుభ్రత, చదువు, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాల విద్యార్థులకు చాకెట్లనుపంపిణీచేశారు. అనంతరం మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న పాథమిక వైద్య ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిహెచ్‌సి ఆసుపత్రి భవన నిర్మాణ పనులనువేగవంతంచేయాలని,సాధ్యమైనంత త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చండూరు ఆర్డీఓ శ్రీదేవి, గట్టుప్పల తహసీల్దార్ రాములు, ఎంపిడిఓ మాధవరెడ్డి, పంచాయితీ కార్యదర్శి షఫీ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల పనుల్లో నాణ్యత తప్పనిసరి

### కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్



**ప్రజాపక్షం/చివ్వెంల:** ఇందిరమ్మఇండ్లను నాణ్య త ప్రమాణాలతో నిర్మించుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ చెప్పారు. మంగళవారం మండల పరిధిలోని గుంపుల తిరుమలగిరిలో పందిరి నవ్య నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇల్లును పరిశీలించారు. లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్లను ఖచ్చితమైన కొలతలతో, ప్రభుత్వం నిర్ధేశించిన స్థలములోనే నిర్మించుకోవాలని, స్థానిక మేస్త్రీలతో ఇంటి నిర్మాణాలు చేపట్టాలని, ము ందుగా అగ్రిమెంట్ చేసుకోవాలని, ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. దానిని సద్వినియోగం చేసుకొని త్వరగాఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలని సూచి ంచారు. అనంతరం ఉన్నత పాఠశాలలను, ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. 9వ తరగతికి వెళ్లి విద్యార్థులతో తెలుగు చదివించారు. కష్టపడి చదివితేనే భవిష్యత్తు ఉంటుందని, ఎంత కష్టపడి చదివితే, మనకు అంత ప్రతిఫలం వస్తుందని, కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించి, తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తేవాలన్నారు. ప్రైమరీ స్కూల్‌లో 4, 5 తరగతులకు వెళ్లి విద్యార్థులతో ఎక్కాలు చదివించారు. ఇంగ్లీషు, లెక్కలు చేయించారు. పిల్లలు బాగా చదివడంపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశా రు. వంటగదిని పరిశీలించారు. తహశీల్దార్ సంతోష్, ఎంపిడిఓ ప్రకాష్ రావు, ఎంఈఓ కళారాణి, ప్రధానోపాధ్యాయులు బి శైలజ, హౌసింగ్ ఏఈ ప్రేమలత పాల్గొన్నారు.

### మేళాతో బోధన సులభతరం

బోధనాభ్యసన మేళా ద్వారా ప్రాథమిక స్థాయిలో బోధించడం సులభతరం అవుతుందని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. మంగళవారం చివ్వెంల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మండలస్థాయి బోధనాభ్యసన ప్రదర్శనను కలెక్టర్ సందర్శించి మాట్లాడారు. మండల స్థాయిలో ఇలాంటి ప్రదర్శన ఏర్పాట్లు చేయడం చాలా సంతోషమన్నా రు. 37 పాఠశాలల ఉపాధ్యాయులు ఏర్పా టు చేసిన స్టాల్స్‌ను సందర్శించి ప్రతిస్టాల్‌లో ప్రదర్శించిన బోధన పరికరాలను గురించి కలెక్టర్ ఆసక్తిగా అడిగి తెలుసుకొని సంబంధించిన ఉపాధ్యాయులను ప్రశంసించా రు. అనంతరం మండల విద్యాధికారి కళారాణి మాట్లాడుతూ చివ్వెంల మండల స్థాయి నందు 1 నుండి 5వ తరగతి వరకు ప్రాథమికస్థాయి బోధన అభ్యసన ప్రదర్శన నందు 37 ప్రాథమిక, ప్రాథమిక ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారని, వీరిలో 4 సబ్జెక్టుల నుండి 10ఉపకరణాలను ఎంపికచేసి, జిల్లాస్థాయి ప్రదర్శనకు పంపడంజరుగుతుందని అన్నారు. తహశీల్దార్ సంతోష్, ఎంపిడిఓ ప్రకాష్‌రావు, ఎంఈఓకళారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పోరాటాల యోధుడు ‘సురవరం’



**ప్రజాపక్షం/(తిరుమలగిరి) తుంగతుర్తి :** కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి ఎర్ర జెండా ముద్దుబిడ్డ, ఎర్ర సూర్యుడు పోరాటాల యోధుడని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, తుంగతుర్తి నియోజక వర్గ ఇంచార్జి ఎల్లముల యాదగిరి అన్నారు. మంగళవారం సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో తిరుమలగిరి మండల కేంద్రంలోని పూలే అంబేద్కర్ చౌరస్తాలో సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి సంతాపసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో ఏఐఎస్ఎఫ్ నుండి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల మీద పోరాటాలు చేసి విద్యార్థుల హక్కులను సాధించారన్నారు. ఏఐఎస్ఎఫ్ నుండి మొదలైన వారి ప్రస్థానం సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, నల్లగొండ నుండి రెండు సార్లు పార్లమెంట్ సభ్యునిగా గెలిచి ప్రజా సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించి వారి హక్కులను సాధించారని గుర్తు చేశారు. మాజీ ఎంపిపి కొత్తగట్టు మల్లయ్య, సిపిఐ మండల కార్యదర్శి ఎస్‌డి ఫయాజ్, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు రాంప్రభువు, వ్యకాసం జిల్లా ఉపాధ్యక్షులు ఎండి ఏక్బాల్, బిఆర్ఎస్ జిల్లా నాయకులు కందుకూరి ప్రవీణ్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తిపిరాల శ్రీకాంత్, బండారు కిరణ్, జంపాల మల్లయ్య, సట్టు నరసయ్య, బొండ్ల వెంకన్న, కందుకూరి రవి, పురుషోత్తం, శ్రీను, మల్లయ్య పాల్గొన్నారు.

## కోర్టు విధుల బహిష్కరణ



**ప్రజాపక్షం/కోదాడ :** హైదరబాద్ కూకట్‌పల్లి కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్న తన్నీరు శ్రీకాంత్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ, న్యాయవాదుల రక్షణ చట్టం తేవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కోదాడ కోర్టులో న్యాయవాదులు తమ విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఉయ్యాల నర్సయ్య అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామిశెట్టి రామకృష్ణ మాట్లాడుతూ కూకట్‌పల్లి కోర్టులో పనిచేస్తున్న న్యాయవాది ఒక సివిల్ దావాలో గెలిచి ఇపి వేసి వారిని ఇల్లు ఖాళీ చేయించడానికి కోర్టు ఆర్డర్‌ను అమలు చేయడానికి వెళ్తే అక్కడ ఉన్న వారి మనుషులు, రౌడీలను వేసుకొని కోర్టు బెలిఫ్, డిహెచ్ఆర్, న్యాయవాది తన్నీరు శ్రీకాంత్‌లపై దాడికి పాల్పడ్డారని తెలిపారు. ఈ చర్య న్యాయవాదులకు, న్యాయవ్యవస్థకు మచ్చ అన్నారు. శ్రీకాంత్‌పా దాడికి పాల్పడిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులను అరికట్టేందుకు ప్రభుత్వాలు కఠినమైన చట్టాలు తీసుకుని రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కమిటి సభ్యులు యడ్లపల్లి వెంకటేశ్వరరావు, కోదూరు వెంకటేశ్వరరావు, బండారు రమేష్ బాబు, కరీం, హుస్సేన్, చలం, నవీన్, కానుగు మురళీ, సీనియర్ న్యాయవాదులు వై సుధాకర్ రెడ్డి, పాలేటి నాగేశ్వర రావు, రంజాన్ పాషా, రంగారావు, శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# పెన్షన్ల పంపిణీకి నూతన పరికరాలు : కలెక్టర్



**ప్రజాపక్షం/యాదాద్రి :** అర్హులైన వారికి పింఛన్ల పంపిణీ మరింత మెరుగ్గా జరిగేందుకు జిల్లాలోని బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లకు కొత్త మొబైల్ ఫోన్లు, ఫింగర్ ప్రింట్ డివైస్లు ఇతర సాంకేతిక పరికరాలు కిట్లను మంగళవారం కలెక్టరేట్‌లో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు పంపిణీ చేశారు.కలెక్టర్‌మాట్లాడుతూజిల్లాలో మొత్తం 229 సెట్లు మంజూరయ్యాయని, ఆధునిక పరికరాల ద్వారా ఫేస్ రికగ్నిజేషన్ సులువుగా జరుగుతుందన్నా రు. లేదంటే మంత్ర డివైస్ ద్వారా గాని ఫింగర్ ప్రింట్ డివైస్ ద్వారా గాని ఫించను పంపిణీ చేయవచ్చన్నారు. అతి తక్కువ సమయంలో ఈ పరికరాలతో ఎక్కువ మందికిపింఛన్లుఇచ్చేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. స్థానిక సంస్థల అదనపుకలెక్టర్‌భాస్కర్‌రావు,జిల్లా గ్రామీ ణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, పెన్షన్ ఏపిఓ శ్రీనివాస్,బ్రాంచ్‌పోస్ట్‌మాస్టర్స్ ఉన్నారు.

## అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/బీబీనగర్ :** బిబినగర్ మండలంలోని గ్రామాలలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి శంకుస్థాపన చేశారు. మక్త అనంతారం గ్రామంలో హెచ్ఎండీఏ నిధుల ద్వారా మంజూరైన రూ.50 లక్షలతో మరియు ఎస్సీ సబ్ ప్లాన్ రూ.5 లక్షలతో, మీది తండ గ్రామంలో రూ.20 లక్షలతో హెచ్ఎండీఏ నిధులతో, జమీలా పేట గ్రామంలో రూ.40 లక్షల హెచ్ఎండీఏ నిధులతో, ఎస్సీ సబ్ ప్లాన్ రూ.10 లక్షలతో, పిహెచ్‌సి బ్యాలెన్స్ వర్క్ రూ.8 లక్షలతో, జియాపల్లి గ్రామంలో రూ.40 లక్షల హెచ్ఎండీఏ నిధులతో, జియాపల్లి తండలో రూ.20 లక్షల హెచ్ఎండీఏ నిధులతో, లక్ష్మీ దేవి గూడెం గ్రామంలో రూ.36 లక్షల హెచ్ఎండీఏ నిధులతో, అంగన్వాడి బిల్డింగ్ నిర్మాణానికి రూ. 12లక్షలతో, పెద్దపలుగుతండ గ్రామంలో రూ.20 లక్షల హెచ్ఎండీఏ నిధులతో, రాముని గుండ్ల తండ గ్రా మంలో రూ.25 లక్షల హెచ్ఎండీఏ నిధులతో, ఎర్రబెల్లి తండ గ్రామంలో రూ.20 లక్షల హెచ్ఎండీఏ నిధులతో, అన్నంపట్ల గ్రామంలో రూ.20 లక్షల హెచ్ఎండీఏ నిధులతో, రహీంఖాన్ గూడ గ్రామంలో రూ.46 లక్షల హెచ్ఎండీఏ నిధులతో, ఎస్సీ సబ్ ప్లాన్ రూ.3 లక్షల పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసారు.

# 10మంది గంజాయి రవాణా నిందితులు అరెస్టు

### డిఎస్‌పి రాజశేఖర్‌రాజు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** అక్రమంగా గంజాయిని రవాణా చేస్తున్న పదిమంది అంతరాష్ట్ర గంజాయి ముఠాను పట్టుకోని రిమాండ్ చేసినట్లు డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపారు. మంగళవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన గంజాయి నిందితుల వివరాలను వెల్లడించారు. బీహార్ రాష్ట్రానికి చెందిన సికిందర్‌తోపాటు రాజ్‌కుమార్ పటేల్ మిర్యాలగూడకు చెందిన షేక్ సమీర్, కొండేటి యశ్వంత్, కోడల శివ, బొల్లంపల్లి విష్ణు, బుర్రి లోకేష్, దైద సందీప్, గుండెబోయిన వంశీ, పందిరి చరణ్, మిరియాల వివేకానందరెడ్డి, బుర్రి నవీన్, శివం ఫార్మా డైరెక్టర్ ఉన్నావ్‌లు ఒక ముఠాగా ఏర్పడి గంజాయి, మాదక ద్రవ్యాలను కొనుగోలు చేసి మాడుగులపల్లి మండల పరిధిలోని పలు గ్రామాల్లో వీటికి బానిసలైన యువకులకు అమ్ముతున్నారు. ఈ క్రమంలో గంజాయి అలవాటు ఉన్న కొంతమంది వ్యక్తుల ద్వారా బీహార్ రాష్ట్రం నుంచి మాదక ద్రవ్యాలను తీసుకొచ్చి మిర్యాలగూడ నియోజక వర్గ పరిధిలో ఎక్కువగా అమ్ముతూ యువతను నాశనం చేస్తున్నారు. వీరు చేస్తున్న అక్రమ గంజాయి వ్యాపారంపై తమకు అందిన సమాచారం మేరకు నిఘాను పెట్టమన్నారు. ఈ నెల 25న ఈ ముఠా సభ్యులు మాడుగులపల్లి పాత రైల్వే కార్టర్స్ వద్ద గంజాయి, గంజాయి చాక్లెట్లు పరస్పరం మార్చుతున్న సమయంలో తమ పోలీస్ సిబ్బంది చాకయచక్యంగా పట్టుకోని అరెస్ట్ చేశారన్నారు. అనంతరం జరిపిన విచారణలో పూర్తి వివరాలు తెలిసాయన్నారు. వారి వద్ద నుంచి 1350 గ్రాముల గంజాయి, 22 గంజాయి చాక్లెట్లు, మూడు మోటార్ సైకిల్‌తో పాటు 8 మొబైల్స్‌ను స్వాదీనం చేసుకోని రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా జల్సాలకు అలవాటు పడినవారు ఉంటే తమకు సమాచారం అందించాలన్నారు. వారి ప్రవర్తనను నిరంతరం గమనిస్తూ ఉండాలని అన్నారు. జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాల మేరకు మిషన్ పరివర్తనలో భాగంగా తమ సబ్ డివిజన్ పరిధిలో స్పెషల్ డ్రైవ్ చేస్తూ గంజాయి మాదకద్రవ్యాల మహమ్మారి వంటి వాటిని అరికట్టేందుకు కృషి చేయడంతోపాటు ప్రతిరోజు తనిఖీలు చేపడుతున్నామని అన్నారు. ఈ గంజాయి కేసును అత్యంత చాకచక్యంగా ఛేదించిన మిర్యాలగూడ రూరల్ సీఐ పీఎన్‌డీ.ప్రసాద్, మాడుగులపల్లి ఎస్ఐ కృష్ణయయతోపాటు సిబ్బంది నరసింహారావు, జాఫర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సైదులు, సైదిరెడ్డి, అనిల్, ఆంజనేయులు, యాదయ్య, నరేష్, శ్రీనునాయక్, డ్రైవర్ సురేష్‌లను ఆయన అభినందించారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



ప్రజాపక్షం/వీపనగండ్ల : అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో మెరుగైన చికిత్స పొందిన వారికి సీఎంఆర్ఎఫ్ పథకం ఒక వరం లాంటిదని నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నర్సింహ అన్నారు. మండల పరిధిలోని కల్వరాల గ్రామానికి చెందిన పాటిమోని గోవింద్ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో మెరుగైన చికిత్స పొందారు. మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో సీఎం ఆర్ పథకం ద్వారా రూ. 51వేల 500లు మంజూరు కాగా చెక్కును నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నర్సింహ బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు చింత దయాకర్, కొల్లాపూర్ తాలూకా సోషల్ మీడియా కో ఆర్డినేటర్ భరత్ చారి పాల్గొన్నారు.

## విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలి



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ : విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. పెద్దాపూర్ గ్రామంలో తూడుకుర్తి రోడ్డులోగల బత్తుల శివశంకర్ పొలంలో కరెంటు తీగలు కిందికివేలాడుతున్నాయని, ఇది చాలా ప్రమాదకరంగా ఉందని, విద్యుత్ అధికారులకు మనవి చేసుకున్నా పట్టించుకోలేదన్నారు. కరెంటు తీగలవలన ఈ సంవత్సరం పొలంలో విత్తనాలు కూడా వేయలేదన్నారు. ఇప్పటికైనా ఆ విద్యుత్ తీగలను సరి చేయాలన్నారు. ఈ సమస్యను సిపిఐ కార్యకర్తల దృష్టికి తీసుకెళ్లడంతో వారు పరిశీలించారు. కార్యక్రమంలో సిపిఐ సెక్రటరీ సిద్ధి శివజయ, జనరల్ సెక్రటరీ బత్తుల శివశంకర్, భూపతి, పంబ బాలయ్య పాల్గొన్నారు.

## హత్యాయత్నం కేసులో ప్రభుత్వ ఉపాధ్యాయుడు సస్పెన్షన్

గోప్యంగా ఉంచిన జిహెచ్ఎం, ఎంఇఓ

ప్రజాపక్షం/పెబ్బేరు : హత్యాయత్నం కేసులో ప్రభుత్వ ఉపాధ్యాయుడు సస్పెండ్ అయిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 2024 ఏప్రిల్ 21వ తేదీన నమోదు అయిన క్రైమ్ నంబర్ 101/2024కు సంబంధించి ప్రభుత్వ ఉపాధ్యాయుడు అక్యూజ్డ్ 1గా ఉన్నాడు. ఈ కేసులో మొత్తం 8 మంది ముద్దాయిలపై 307, 506, 120బి, రెడ్ విత్ 34 పలు సెక్షన్లపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో ప్రథమ ముద్దాయిగా ఉన్న గుండ్రాతి నర్సింహ గౌడ్ అనే ప్రభుత్వ ఉపాధ్యాయుని 2024 మే 8వ తేదీన అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏ ఉద్యోగి అయినా 48 గంటలు రిమాండ్ లో ఉంటే ఆ ఉద్యోగిని విధుల నుండి తొలగించాలి నిబంధన ఉంది.

**సమాచారం ఇవ్వని మండల అధికారులు ....**

ప్రభుత్వ ఉపాధ్యాయుడు సస్పెండ్ అయిన విషయాన్ని ఆయన పని చేసే పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, మండల విద్యాధికారులు, చరవాణి ద్వారా వివరణ అడగగా సమాచారం ఇవ్వకుండా జిహెచ్ఎం విష్ణువర్ధన్ రావు, మండల విద్యాధికారి జయరాములు, డీఈఓ ఉత్తర్వులు దాచిపెడుతున్నారు. సమాధానం దాటవేస్తున్నారు. విషయంలో జిహెచ్ఎం, ఎంఈఓ బాధ్యతా రాహిత్యంగా సమాచారం ఇవ్వకుండా దాటవేశారు. దీంతో విద్యా శాఖ అధికారులపై మండల ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ కేసులో ఏ వన్ ముద్దాయిగా ఉన్న గుండ్రాతి నర్సింహగౌడ్ అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడిని ఈనెల 1వ తేదీనే లేఖ సంఖ్య 1602/ఏ1/2025 ద్వారా సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు వనపర్తి జిల్లా విద్యాధికారి అబ్దుల్ గని తెలిపారు.

## రసవత్తరంగా జడ్చర్ల ప్రెస్‌క్లబ్ ఎన్నికలు



ప్రజాపక్షం/జడ్చర్ల: గత పది సంవత్సరాలుగా పెండింగులో ఉన్న జడ్చర్ల ప్రెస్ క్లబ్ ఎన్నికలు రసవత్తరంగా ముగిసాయి. మంగళవారం ఉదయం పట్టణంలోని అంబేద్కర్ భవనంలో నిర్వహించిన ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో అందరూ ఊపిరి పిల్చుకున్నారు. అధ్యక్షుడిగా సీనియర్ జర్నలిస్టు వడ్ల కృష్ణయ్య పోటీ పడగా ఆయనకు పోటీగా ఉన్న రమేష్, శ్రీధర్, నరేందర్ లపై పైచేయి సాధించిన వడ్ల కృష్ణ విజయతీరాలను అందుకున్నారు. ప్రధాన కార్యదర్శికి ఇద్దరు అభ్యర్థులు పోటీ పడగా సుల్తాన్‌కు 23 ఓట్లు, ఎడ్ల బాబాయ్‌కు 23 ఓట్లు రాగా టాస్‌లో సుల్తాన్‌కు విజయం వరించింది. ప్రెస్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్‌గా శేఖర్ తెలుగు, జాయింట్ సెక్రటరీగా మల్లేష్ ట్రెజరర్‌గా సాకలి ప్రభాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జడ్చర్ల ప్రెస్ క్లబ్ ఎన్నికలు వివిధ కోణాలలో పరిశీలించిన ఆయా పార్టీల నేతలు కుల సంఘాల నేతలు తదితరులు ఈ విజయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఏది ఏమైనా సీనియారిటీకి మంచితనానికి 51 మంది జర్నలిస్టులు తమ యొక్క ఓటు హక్కును వినియోగించుకొని వడ్ల కృష్ణయ్యను మెజారిటీతో గెలిపించడం పట్ల పట్టణ ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. సందర్భంగా విజయం సాధించిన అధ్యక్ష ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య, సుల్తాన్ తదితరులు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి ఓటు వేసి గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమ కోసం నిరంతరం పాటు పడుతామని ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా అందరికీ అందుబాటులో ఉంటూ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా ఎన్నికలు నిర్వహించిన ఫోర్‌మెన్ కమిటీ అధికారులకు, ఎన్నికల నిర్వహణ అధికారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

## మాజీ ఎమ్మెల్యేకు నివాళి



ప్రజాపక్షం/ధన్వాడ/కృష్ణ: ధన్వాడ మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డి జయంతి సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్.చిట్టెం పర్ణికరెడ్డి, పీసీసీ సభ్యుడు చిట్టెం అభిజయ్ రెడ్డి ఆయన విగ్రహానికి, ఘాటు దగ్గర పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ సదాశివారెడ్డి, వ్యవసాయం మార్కెట్ డైరెక్టర్ రామచంద్రయ్య, జట్రం లక్ష్మయ్య, జిల్లా నాయకులు సూర్య మోహన్ రెడ్డి, చిట్టెం మాధవ రెడ్డి, చిట్టెం రాఘువేందర్, నీరటి భాస్కర్, నీరటి అశోక్, కార్యకర్తలు అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

మక్తల్ మాజీ శాసన సభ్యులు దివంగత నేత చిట్టెం నర్సిరెడ్డి జయంతి వేడుకలను కృష్ణ మండల పరిధిలోని టైరోడ్ ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన జ్ఞాపకార్థం హిందూపూర్ ఉర్దూ పాఠశాలలో విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శివప్ప, తిప్పాయ, రాజప్ప గౌడ్, సంతోష్, భీమ్, శంకరప్ప, సురేష్, తిమ్మ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలను వేధిస్తే కఠిన చర్యలు

'షీటీమ్' పోలీసులు




ప్రజాపక్షం/మక్తల్ : నారాయణపేట జిల్లా పరిధిలో మహిళల, అమ్మాయిలను ఎవరైనా వేధిస్తే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని షీ టీం పోలీసులు హెచ్చరించారు. మంగళవారం మక్తల్ మండలంలోని మంతన్ గోడు గ్రామం జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గుడ్ టచ్ బాడ్ టచ్, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, డ్రగ్స్, గంజాయి, ట్రాఫిక్ చట్టాలు, సెల్ ఫోన్ వినియోగం వల్ల ఏర్పడే అనర్థాలు, పోటీ పరీక్షల గురించి, లీడర్షిప్ లక్షణాలు, డయల్ 100 తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీటీమ్ పోలీసులు, బాలరాజు, చెన్నప్ప, కవితలు మాట్లాడుతూ. విద్యార్థులు పాఠశాలకు వచ్చి పోయే సమయంలో ఎవరైనా అమ్మాయిలను, మహిళలను వేధిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో షిటీమ్ పోలీసులు ప్రధానోపాధ్యాయులు కాజా అనిరుద్దీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వేగవంతంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తి

కలెక్టర్ బదావత్ సంతోష్



ప్రజాపక్షం/బిజినేపల్లి : ఇందిరమ్మ ఇండ్లనిర్మాణాన్ని వేగవంతంగా పూర్తిచేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్‌బదావత్‌సంతోష్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని గాంధీనగర్‌కాలనీలో నిర్మిస్తున్న ఇందిరమ్మ లబ్ధిదారుడు బీసం కృష్ణవేణి ఇందిరమ్మ ఇల్లును పరిశీలించారు. గ్రామంలో మొత్తం ఎన్ని ఇండ్లు నిర్మాణంలో ఉన్నాయని, అవి ఏయేదశలో ఉన్నాయో ఇప్పటివరకు ఎన్ని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం జరిగాయని, జరిగినంతవరకు లబ్ధిదారుల అకౌంట్లలో డబ్బులు జమ అయ్యాయా అని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి కావాల్సిన సిమెంటు, ఇటుక, స్టీల్‌కూడా తక్కువ ధరలకు ఇచ్చేలా చూడాలన్నారు. ఇంటి నిర్మాణానికి కావాల్సిన ఇసుక కూడా ప్రభుత్వమే ఇస్తుందన్నారు. మేస్త్రీలు కూడా నిర్ణయించిన ధర ప్రకారం ఇల్లు కట్టాలని, ఇల్లు కట్టుకునే లబ్ధిదారులు మేస్త్రీలకు ఎక్కువ ధర డబ్బులు ఇవ్వకూడదని అన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. ఏమైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆయనవెంట తహసీల్దార్ మునిరుద్దిన్, ఎంపిడిఓ కథలప్ప, ఆర్ఐ బాలరాజు, బిజినేపల్లి గ్రామపంచాయతీ సెక్రటరీ మహేష్‌నాయక్, సిబ్బంది శ్రీశైలం, యశ్వంత్ పాల్గొన్నారు.

# జర్నలిస్టులు ప్రజలను జాగృతం చేయాలి



ప్రజాపక్షం/నారాయణపేట్ : సమాజంలో జరుగుతున్న అవినీతిని, అక్రమాలను ఎండగడుతూ ప్రజలను చైతన్యం చేసేందుకు జర్నలిస్టులు ముందుకు రావాలని టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు నారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కోస్గి మండల కేంద్రంలోని అంబేద్కర్ పారా మెడికల్ కళాశాలలో జరిగి టీయూడబ్ల్యూజే మండల కార్యవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. జర్నలిజంలో నూతన మార్పులు తేవడానికి టియుడబ్ల్యూజే నిరంతరం కృషి చేస్తూనే ఉందని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి సంఘం అహర్నిశలు కృషి చేస్తుందని అన్నారు. జర్నలిస్టు సైతం తమ బాధ్యతలను విస్మరించకుండా నియమ నిబంధనలతో పనిచేయాల్సిందని సూచించారు. ఈనెల 30న నారాయణపేట జిల్లా కేంద్రంలో జర్నలిస్టుల కుటుంబాలకు ఉచిత వైద్య శిబిరాన్ని టియూడబ్ల్యూజే సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. అనంతరం వైద్య శిబిరం గోడ పత్రికను విడుదల చేసారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా ఎడ్యుకేషన్ ఇంచార్జి రాజేష్, హెల్త్ కమిటీ ఇంచార్జి సంజీవ్, రఘు ఘణప, సురేష్, మండల అధ్యక్షుడు శంకర్, టీయూడబ్ల్యూజే నాయకులు అజిజ్, మసుల వెంకట్, చంద్రశేఖర్, శ్రీనివాస్, మోహన్, సల్మాన్ రాజ్, అతిక్, మల్లేష్, ప్రవీణ్, దత్తు, చైతన్య, రమేష్ గౌడ్, తహసీన్, రషీద్, రాజు, తదితరులు ఉన్నారు.

# పింఛన్లు పెంచడం చేతకాకపోతే దిగిపో!

పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ




ప్రజాపక్షం/జడ్చర్ల: దివ్యాంగుల పెన్షన్ రూ.6 వేలకు వృద్ధులు, వితంతువులు ఒంటరి మహిళలు, అన్ని రకాల చేయూత పెన్షన్లు రూ.4 వేలకు పెంచాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని మందకృష్ణ మాదిగ డిమాండు చేశారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి చేయూత పెన్షన్‌దారుల ఆధ్వర్యంలో సలేహా ఫంక్షన్ హాల్లో జడ్చర్ల నియోజకవర్గ సన్నాహక సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వికలాంగుల హక్కుల పోరాట సమితి విహెచ్‌పిఎస్, ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ హాజరై మాట్లాడుతూ వృద్ధులకు, వితంతువులకు, ఒంటరి మహిళలు 4000, వికలాంగులకు 6 వేలు పెన్షన్ ఇస్తానని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇవ్వకుండా మోసం చేశాడని అన్నారు. 2023 ఎన్నికల సమయంలో వికలాంగుల పెన్షన్ 6 వేలు, మిగతా చేయూత పెన్షన్ దారుల పెన్షన్ రూ.4 వేలకు పెంచుతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగంగా హామీ ఇచ్చారు. ఈ నెల ఓటు వేయండి వచ్చే నెల నుండే పెన్షన్ తీసుకోండని మాట్లాడిన రేవంత్‌రెడ్డి ఓటు వేశాక ముఖ్యమంత్రి అయి పెన్షన్ దారులందరిని ఘోరంగా మోసం చేశాడని విమర్శించారు. రేవంత్ రెడ్డి చేసిన మోసం గురించి ప్రతిపక్షాలు కూడా మాట్లాడకుండా చేయూత పెన్షన్ దారులకు అన్యాయం చేస్తున్నాయని అన్నారు. 50 లక్షల పెన్షన్ దారుల పక్షాన వికలాంగుల హక్కుల పోరాట సమితి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి పోరాటం చేస్తుందని అన్నారు. వెంటనే 4000/6000/ పెంచి ఇవ్వాలని అదే విధంగా కొత్త పెన్షన్ దారులకు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పెన్షన్లు పెంచకపోతే ఛలో హైదరాబాద్ సెప్టెంబర్ 9న పరేడ్ గ్రౌండ్‌లో లక్షలాది మందితో మహాగర్జన నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో విహెచ్‌పిఎస్ జాతీయ ఉపాధ్యక్షులు బికె నరసింహం, ప్రధాన కార్యదర్శి నరేందర్, విహెచ్‌పిఎస్ మండల్ అధ్యక్షులు గడ్డం యాదయ్య, సావిత్రి, రంగా, విహెచ్‌పిఎస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు పెన్షన్ దారులు సుజాత, తిరుపతమ్మ, చిన్న అంజయ్య, నాగయ్య, నరసమ్మ, వెంకటయ్య, రాములు, జంగన్న, గోపాల్ రెడ్డి, నిలమ్మ, రాజు, రఫిక్, పద్మ,ర మేష్ గురువారెడ్డి, ఎల్లమ్మ, నరేష్ పాల్గొన్నారు.



## అభివృద్ధిలో తెలంగాణ ఫస్ట్

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్: దేశంలోని అన్ని రాష్ట్రాల్లోకెల్లా తెలంగాణ రాష్ట్రమే అభివృద్ధిలో మొదటి స్థానంలో ఉందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గం, హన్వాడ మండలంలోని ఎల్లంబాయి తండాలో యంజియన్‌ఆర్‌ఈజిఎస్ నిధులు 20 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయితీ భవనాన్ని మహబూబ్‌నగర్ ఎంపి డికె అరుణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ఖజానాకు పెద్ద గండి పెట్టిందని, అయినా ఎన్నికల సందర్భంగా ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీలను ఒక్కోటిగా అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. అనంతరం గ్రామ పంచాయితీ భవనం దగ్గర నూతన బోర్ మోటార్‌ను స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎన్‌పి వెంకటేశ్, మారేపల్లి సురేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి.మహేందర్, ఎ.చెన్నయ్య, నవనీత, చంద్రానాయక్, పగిల్లమ్మ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామకృష్ణ, చెన్నయ్య, యాదయ్య, జె.వెంకటయ్య, కంచి లక్ష్మ ణ్, రాజు నాయక్, గోపాల్, లిక్యా నాయక్, సింగ్యా నాయక్, సత్య, వెంకటేశ్, బొట్టు శ్రీను, నర్సింహులు గౌడ్, మానవులు, సత్యం, దాసరి రఘు, యాదిరెడ్డి, మహేందర్ జీ, బొక్కి రాములు, భీమన్న, తహసిల్దార్ కిష్ట్యానాయక్, ఎంపిడిఓ యశోద, పిఆర్‌డిఈ విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తరభారతంలో వర్షాలు, వరద బీభత్సం

కొట్టుకుపోయిన రోడ్లు- వంతెనలు

కొండచరియలు విరిగిపడి ఆరుగురు మృతి

జమ్ములో 10 మంది మృతి



న్యూఢిల్లీ: ఉత్తర భారతదేశాన్ని వర్షాలు, వరదలు ముంచెత్తాయి. భారీ వర్ష బీభత్సంతో హిమాలయ పర్వత ప్రాంతంలో కొండచరియలు విరిగిపడ్డాయి. పల్లపు ప్రాంతాలు నీటమునిగాయి. అనేక రోడ్లు, వంతెనలు కొట్టుకుపోయాయి. జమ్మూలో 10 మంది మరణించారు. త్రికూట పర్వతంపై ఉన్న మాతా వైష్ణోదేవి ఆలయానికి చేరుకునే మార్గంలో మంగళవారం మధ్యాహ్నం కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ప్రమాదంలో కనీసం ఆరుగురు మరణించారు. ఇంకా అనేకమంది మట్టిపెళ్ళల అడుగున చిక్కుకుని ఉంటారని భయపడుతున్నారు. జమ్మూ దోడా జిల్లాలో కురిసిన భారీ వర్షాలతో మరో నలుగురు మరణించారు. దేశరాజధాని ఢిల్లీలో భారీ వర్షాలవల్ల నీరు నిలిచిపోయింది. ట్రాఫిక్ రాకపోకలు స్తంభించిపోయాయి. ఈ ఏడాది ఈ వర్షాల సీజనులో సాధారణంకంటే ఎక్కువ వర్షపాతం రాజధానిలో నమోదైంది.

హిమాలయాలలో పుట్టి ప్రవహించే నదులు ఈ వర్షాలవల్ల ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. డ్యాములు, బ్యారేజీల నుండి లెక్కకుమిక్కిలిగా నీటిని దిగువ ప్రాంతాలకు విడుదల చేస్తున్నారు. దీంతో దిగువన పరీవాహక ప్రాంతంలో తీవ్ర వరద పరిస్థితులు నెలకున్నాయి. రాబోయే కొద్దిరోజులపాటు ఈ పరిస్థితి నుండి ఉపశమనం కలిగే అవకాశం లేదని వాతావరణశాఖ ప్రకటించింది. దీంతో పంజాబ్, జమ్మూ ప్రాంతాలలో విద్యాలయాలకు అనివార్యంగా సెలవులు ప్రకటించారు. పర్వతరాష్ట్రమైన హిమాచల్ ప్రదేశ్ ఇప్పటికే ఆకస్మిక వరదల కారణంగా అనేక ప్రాంతాలలో కొండచరియలు విరిగిపడుతున్నాయి. దీంతో అనేక ఇళ్ళు, దుకాణాలు కూడా కొట్టుకుపోయాయి. పలు భవంతులు కుప్పకూలాయి. జాతీయ రహదారుల్లో ఎక్కడికక్కడ అనేకచోట్ల అనుసంధానం తెగిపోయింది. హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలో ఇప్పటికే 680 రహదారులను మూసివేశారు. వీటిల్లో ప్రధానంగా మండి, కుల్లు జిల్లాలు ప్రధానంగా దెబ్బతిన్నాయి. సోమవారం సాయంత్రం నుండి గడచిన 24 గంటలలో హిమాచల్ ప్రదేశ్‌లో 12 ఆకస్మిక వరదలు సంభవించాయి. కొండచరియలు విరిగిపడిన రెండు అతిపెద్ద ఘటనలు జరిగాయి. బియాస్ నది నీటి మట్టం భారీగా పెరిగి ప్రమాదస్థాయిలో ప్రవహిస్తోంది. 20,000 కుసెక్కుల నీటిని లగ్రి డ్యామ్ నుండి దిగువకు విడుదల చేశారు. కట్టుతప్పి నది నుండి బయటకు పెల్లుబికి ప్రవహించిన నీరు వల్ల మనాలీ–లే జాతీయ రహదారిలో 200 మీటర్ల నిడివిగల రోడ్డు కొట్టుకుపోయి అనుసంధానం తెగిపోయింది. దీంతో ఈ మార్గంలో ప్రయాణిస్తున్న యాత్రికులు ఎక్కడివారు అక్కడే స్తంభించిపోయారు. దేశ రాజధానిలో అనేకచోట్ల నీరు నిలిచిపోయింది. భారీ వర్షాలవల్ల రహదార్లపై వాహనాల రాకపోకలు స్తంభించి ట్రాఫిక్ సమస్య తలెత్తింది. సాధారణ జనజీవనానికి తీవ్ర ఆటంకం కలిగింది. ఈ ఏడాది ఇప్పటివరకూ ఢిల్లీ నగరంలో ఈ వర్షాకాలం భారీగా వర్షాలు కురిశాయి. సాధారణంకంటే అధికంగా దాదాపు 60 శాతం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది.

**జమ్మూ ప్రాంతంలో ఇళ్ళు ధ్వంసం**

జమ్మూ ప్రాంతంలో రెండు డజనుకుపైగా ఇళ్ళు, వంతెనలు ధ్వంసమయ్యాయి. నీటి నిల్వ ప్రాంతాలు, నదులు, కాలువలు ప్రమాదస్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. అనేక పల్లపు ప్రాంతాలు, రోడ్లు నీట మునిగాయి. కత్రా, ఉధంపూర్, జమ్మూ రైల్వే స్టేషన్ల నుండి దాదాపు 18కి పైగా రైళ్ళు రాకపోకలు రద్దయ్యాయి. ఈ ప్రకృతి వైపరీత్యం వల్ల జమ్మూ ప్రాంతంలో ఇంటర్నెట్‌కు సంబంధించిన ఫైబర్ కేబుల్స్, సర్వీస్ ప్రొవైడర్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. జమ్మూలోని అనేక ప్రాంతాలలో పరిస్థితి ప్రమాదకరంగా ఉందని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా చెప్పారు. వాతావరణం ఎంతమాత్రం అనుకూలంగా లేకపోవడంతో మంగళవారంనాడు పోలీసు ఉద్యోగాలకు, ఇతర భద్రతాసంస్థలలో ఉద్యోగాలకు వివిధ ప్రాంతాలలో చేపట్టిన ఎంపికల ప్రక్రియ ఇంటర్వ్యూలను అనివార్యంగా రద్దుచేశారు. స్కూళ్ళను మూసివేశారు. మాతా వైష్ణోదేవి ఆలయానికి వెళ్ళే యాత్రికులకు ప్రయాణ అనుమతి ఇవ్వలేదు. కిష్ట్వార్, రియాసి, రాజౌరీ, రాంబన్ వంటి అతి ఎత్తైన ప్రాంతాలలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు మౌలిక సదుపాయాలకు తీవ్ర నష్టం కలిగిందని వార్తలు అందాయి. జమ్మూ–శ్రీనగర్, కిష్ట్వార్–దోడా జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలను రద్దు చేశారు. అదేవిధంగా ఆకస్మిక వరదలు, వర్షాలవల్ల అనేక పర్వత ప్రాంతాలలో కొండచరియలు విరిగిపడి రాకపోకలు స్తంభించాయి. ప్రమాదస్థాయిని దాటి ప్రవహిస్తున్న మధోపూర్ బ్యారేజీ నుండి నీరు పైకి ఉబికి వస్తోంది. లక్షల క్యుసెక్కుల నీటి పరిమాణం దాటి బ్యారేజీ మీదుగా నీరు ప్రవహిస్తోంది. దీంతో భారీ వరద పరిస్థితి తలెత్తింది. కథువాజిల్లాలో రావి నది వెంట ఉన్న పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. తరనాహ్ నది, ఉఝూ నది, మగ్గర్ ఖాద్, సహార్ ఖాద్ సహా కథువాలో ఉన్న వాటి ఉపనదులు కూడా పొంగిపొర్లుతున్నాయి. సాంబలోని బసెంతెర్, తవి, జమ్మూలోని చీనాబ్ ఇప్పటికే ప్రమాదస్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. కశ్మీరు ప్రాంతంలోని అనేక ప్రాంతాలను వర్షాలు ముంచెత్తాయి. పహల్గామ్‌లోని బేతాబ్ లోయలో ఉన్న శేష్‌నాగ్ నల్లా ఎన్నడూ లేని విధంగా తన రికార్డును అధిగమించి 5.68 అడుగుల ఎత్తుదాటి పొంగిబయటకు పొర్లుతున్నది. దీని ఎగువ ప్రాంతాలలో మేఘాలు బద్దలై భారీగా ఆకస్మికంగా వర్షాలు కురవడంవల్లనే ఈ దిగువ ప్రాంతంలో నీరు పోటెత్తుతోందని అధికారులు చెప్పారు.

పంజాబ్‌లో గడచిన రెండు రోజులుగా ఎడతెగని వర్షాలవల్ల కపుర్తలా జిల్లాలో వరద పరిస్థితి తలెత్తింది. ఫెరోజ్‌పూర్‌లో ప్రజలు ఇళ్ళు ఖాళీచేసి వెళుతున్నారు. పప్రత్యేకించి నదీపరీవాహక ప్రాంతం వెంట ఉన్న గ్రామాల ప్రజలు ఖాళీచేస్తున్నారు. సట్లెజ్, బియాస్, రావి నదులు, వర్షాకాలంలో పుట్టే జల ప్రాంతాలువల్ల పోంగ్, భాక్రా డ్యాముల నుండి భారీగా నీరు విడుదలవుతోంది. ఫెరోజాపూర్‌లో గడచిన రెండు రోజులుగా 45 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. తూర్పు భారతంలోని ఉత్తర ఒడిశాలో 170కిపైగా గ్రామాలు వరదనీటిలో మునిగి ఉన్నాయి. రాబోయే రోజుల్లో ఇంకా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండి హెచ్చరించింది. పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో అల్పపీడనం ఏర్పడే అవకాశాలున్నాయి.

## పేదల చికిత్సపై భారం మోపొద్దు

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ : పేదల చికిత్సపై ప్రైవేట్ ఆస్పత్రి నిర్వాహకులు అధికభారం మోపద్దని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సిపిఐజిల్లా కార్యదర్శి కోళ్ల యేసయ్య అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో గల ప్రభుత్వ ఆస్పత్రిలో కనీస వసతి లేక పేద, మధ్యతరగతి వ్యవసాయ కూలీలు ప్రయివేటు ఆస్పత్రికి పోయి చూపించుకుంటే లక్షల బిల్లులు వేసి వాళ్లపై భారం మోస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్పత్రి బిల్లులు చెల్లించడం కోసం అప్పులు చేసి అప్పులు తీర్చేందుకు వివిధప్రాంతాలకు వలసలు పోతున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ప్రతి గ్రామపంచాయతీలో ఒక సబ్‌సెంటర్ ఏర్పాటు చేసి అందులో ఒక డాక్టర్, నర్సుతో సిబ్బందిని ఏర్పాటుచేయాలన్నారు. జిల్లాకేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రిలో ఎమ్మారై సిటిస్కానింగ్ గుండె డాక్టర్, జనరల్ ఫిజిషియన్, ఆర్థో స్కిన్ స్పెషలిస్టు సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని వసతులు ప్రభుత్వాలు కల్పిస్తే ప్రైవేట్ ఆస్పత్రులకు పోకుండా అప్పులభారం నుండి బయటపడతారని అన్నారు. లేనిచో తెలంగాణ వ్యవసాయకార్మిక సంఘం ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల ముందు ధర్నాలు చేయడం జరుగుతుందన్నారు.

## బిపిఎంలకు మొబైల్‌ఫోన్లు అందజేత



ప్రజాపక్షం/నారాయణపేట జిల్లా : గ్రామీణాభివృద్ధి సంస్థ సెర్ప్ నారాయణపేట మరియు జిల్లా పోస్టు ఆఫీస్ వారి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ బిపియం బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్లకు శాంసంగ్ మొబైల్ ఫోన్లు, మంత్ర డివైజ్‌లు పంపిణీ చేయడం జరిగింది. జిల్లాకు సెర్ప్ కార్యాలయం హైదరాబాద్ నుండి 137 సాంసంగ్ మొబైల్స్, 137 మంత్రా డివైజ్‌లు రావడం జరిగింది. వాటిని 1.స్వప్న, బిపిఎం జలాల్పూర్, 2.గౌతమి బీపీఎం జాజాపూర్, 3.నరసన్న బీపీఎం తిప్రస్పల్లి 4.శ్రీనివాస్ బీపీఎం లోకుర్తి, 5.తేజ బీపీఎం కంసాన్‌పల్లి తదితరులకు జిల్లా కలెక్టర్ మొబైల్ ఫోన్లు, మంత్ర డివైజ్‌లు అందించారు. జులై మాసానికి సంబంధించిన పెన్షన్లు 68973 మంది పెన్షన్ లబ్దిదారులకు రూ.17,72,77,856 రూపాయల జులై మాసానికి సంబంధించిన వాటిని రెండు మూడు రోజుల తరువాత నుండి ముఖ గుర్తింపు యాప్ ద్వారా పంపిణీ చేయడం ప్రారంభమవుతుంది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఐఏఎస్ మొగులప్ప, డిఆర్డిఓ నారాయణపేట, జయన్న డిపిఎం జుబేర్ పోస్టల్ ఇన్స్‌పెక్టర్ సిఓ రాజేందర్, ఉమాకాంత్ మెయిల్ వెర్షన్, వివిధ గ్రామాలకు సంబంధించిన బిపియంలు పాల్గొన్నారు.

## బిసి రిజర్వేషన్ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలి




ప్రజాపక్షం/వనపర్తి టౌన్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేయాలనుకున్న 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లును రాష్ట్ర అసెంబ్లీలో ఆమోదం తెలిపి కేంద్రానికి తెలిపారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ బిల్లును అడ్డుకుంటుందని తక్షణమే బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదించి చట్ట రూపందాల్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ వనపర్తి జిల్లా అధ్యక్షులు ఎత్తం మహేష్ డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ బిల్లును కేంద్ర బీజేపీ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లు ముస్లింలకు రిజర్వేషన్లు కల్పిస్తున్నారని అడ్డుకుంటుందని మండిపడ్డారు. మరి బీజేపీ పరిపాలిస్తున్న గుజరాత్ రాష్ట్రంలో ముస్లింలను బీసీలో చేర్చి రిజర్వేషన్లు అమలు చేస్తుందని, అదేవిధంగా ఈ రాష్ట్రంలో అమలు ఏస్తే తప్పేంటి అని వారు ప్రశ్నించారు. అనగారిన వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రాధాన్యత ఇవ్వకపోతే ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎత్తం విష్ణు, నాయకులు కె.చంద్రశేఖర్, రాజేష్, అమూల్యరాము, ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ

## కొత్త స్పాన్సర్ కోసం బిసిసిఐ అన్వేషణ




డ్రీమ్ 11 వైదొలగడంతో బిసిసిఐ కొత్త స్పాన్సర్ వేటలో పడింది. అయితే వచ్చే నెల ఆసియాకప్ లోపు స్పాన్సర్ ఖరారయ్యే అవకాశం కనిపించట్లేదు. డబ్బుతో ముడిపడి ఉన్న అన్ని ఆన్‌లైన్ గేమ్‌లను నిషేధిస్తూ ప్రభుత్వం కొత్త చట్టం తేవడంతో డ్రీమ్ 11.. టీమ్ఇండియా టైటిల్ స్పాన్సర్‌గా కొనసాగరాదని నిర్ణయించుకున్న సంగతి తెలిసిందే. డ్రీమ్ 11తో ఒప్పందం ముగిసిన విషయాన్ని బిసిసిఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ధ్రువీకరించాడు. 'మేం వాళ్లతో కొనసాగలేం. కొత్త స్పాన్సర్ కోసం అన్వేషిస్తున్నాం. ఆ ప్రక్రియ కొనసాగుతోంది' అని చెప్పాడు. భారత జాతీయ జట్లకు స్పాన్సర్‌గా ఏడాదికి రూ. 358 కోట్లతో డ్రీమ్ 11.. బిసిసిఐతో ఒప్పందం చేసుకుంది. అది ముగియడానికి ఇంకా ఏడాది సమయముంది. అయితే అర్ధంతరంగా ఒప్పందం నుంచి వైదొలిగినా డ్రీమ్ 11పై బోర్డు చర్యలు తీసుకునే అవకాశం లేదు. మరో గేమింగ్ సంస్థ మై11సర్కిల్ కూడా ఐపిఎల్ స్పాన్సర్‌గా వైదొలిగే అవకాశముంది. అయిదేళ్లకు గాను ఏడాదికి రూ. 125 కోట్లతో మై11సర్కిల్ ఒప్పందం చేసుకుంది.





## వరుస సెట్లలో సింధు జోరు

గత ఏడాది నుంచి టైటిల్ కోసం నిరీక్షిస్తున్న పీవీ సింధు బిడబ్ల్యూఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో ముందంజ వేసింది. తొలి రౌండ్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచిన తెలుగు తేజం బల్గేరియాకు చెందిన కలోయనా నల్బంతోవాను చిత్తు చేసింది. తొలి సెట్ నుంచి దూకుడుగా ఆడిన సింధు రెండో సెట్‌లో మరింత రెచ్చిపోయింది. 23–21, 21–6తో అలవోకగా గెలుపొంది రెండో రౌండ్‌కు దూసుకెళ్లింది ఒలింపిక్ విజేత. ఇటీవల పలు టోర్నీ మొదటి రౌండ్‌లోనే ఇంటిదారి పడుతున్న సింధు ఈసారి సత్తా చాటింది. పారిస్ వేదికగా జరుగుతున్న బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో కలోయనా నల్బంతోవాను మట్టికరిపించింది. తొలి సెట్‌లో 69వ ర్యాంకర్ అద్భుతంగా ఆడడంతో ఇద్దరూ హోరాహోరీగా తలపడ్డారు. దాంతో, అతికష్టమ్మీద సింధు 23–21తో సెట్ గెలుచుకుంది.
రెండో సెట్‌లో మాత్రం భారత షట్లర్ ధాటికి ప్రత్యర్థి నిలువలేకపోయింది. చెక్కుచెదరని డిఫెన్స్‌తో పాటు బలమైన షాట్లతో విరుచుకుపడిన సింధు 21–6తో సెట్ కైవసం చేసుకుంది. రెండో రౌండ్‌లో ఆమె సలోని సమిర్‌భాయ్ మెహతా(హాంకాంగ్), కరుపతెవన్ లెట్‌షానా(మలేషియా) మ్యాచ్ విజేతతో తలపడనుంది.

## 23 ఏళ్ల తర్వాత భారత్‌లో చెస్ వరల్డ్ కప్







ప్రపంచ చదరంగంపై చెరగని ముద్ర వేసిన భారత్‌లో త్వరలోనే అతిపెద్ద క్రీడా సంబురం మొదల్వనుంది. ప్రతిష్ఠాత్మక చెస్ వరల్డ్ కప్ పోటీలకు మన దేశం ఆతిథ్యం ఇవ్వనుంది. ప్రకృతి రమణీయతకు కేరాఫ్ అయిన గోవా వేదికగా అక్టోబర్ 30 నుంచి ఈ మెగా ఈవెంట్ ప్రారంభం కానుంది. 23 ఏళ్ల తర్వాత భారత్‌కు చెస్ వరల్డ్ కప్ నిర్వహణ హక్కులు దక్కాయి. చివరగా 2002లో మనదేశంలో ఈ వరల్డ్ కప్ జరిగింది. ఆ ఏడాది హైదరాబాద్ వేదికగా సాగిన టోర్నీలో విశ్వనాథన్ ఆనంద్ టైటిల్ గెలుపొందాడు.
ఈ ఏడాది భారత్ వేదికగా జరుగబోయే చెస్ వరల్డ్ పోటీల్లో ప్రపంచ నలుమూలల నుంచి 206 మంది పోటీపడనున్నారు. ఎనిమిది రౌండ్లలో గెలుపొందిన వారు నాకౌట్‌కు అర్హత సాధిస్తారు. అయితే.. ఆనావాయితీ ప్రకారం టాప్ 50లో ఉన్న క్రీడాకారులు నేరుగా రెండో రౌండ్ ఆడుతారు. ప్రతి రౌండ్‌లో రెండు ఫార్మాట్లలో గేమ్ నిర్వహించనున్నారు. స్కోర్లు సమం అయినప్పుడు టై బ్రేకర్స్. విజేతకు రూ.17 కోట్ల ప్రైజ్‌మనీ దక్కనుంది. ఈ వరల్డ్ కప్‌లో అదరగొట్టిన వాళ్లు వచ్చే ఏడాది క్యాండిడేట్స్ టోర్నమెంట్‌కు అర్హత సాధించే అవకాశముంది. సో.. గ్రాండ్‌మాస్టర్లంతా తమ మాస్టర్ గేమ్‌తో చెలరేగిపోయేందుకు సిద్ధమవుతున్నారు.
'భారత్ బలమైన చెస్ దేశంగా ఎదుగుతోంది. ఎందరో ప్రతిభావంతులు.. చదరంగాన్ని అమితంగా ఇష్టపడే అభిమానులు ఇక్కడ ఉన్నారు. ఈ ఏడాది జార్జియాలో ఫిడే వరల్డ్ కప్ విజయవంతంగా పూర్తి అయినందున.. అదే ఉత్సాహంతో ఫిడే వరల్డ్ కప్‌ను గోవాలో నిర్వహించనున్నాం. ఇది నిజంగా చదరంగం ఆటకు సంబంధించిన పండుగ. సుమారు 90 దేశాలకు చెందిన గ్రాండ్‌మాస్టర్లు పోటీ పడనున్నారు. చెస్ చరిత్రలోనే ఇది గొప్ప వేడుకగా నిలిచిపోతుంది' అని ఫిడే అధ్యక్షుడు అర్కాడి వొర్కోవిచ్ తెలిపాడు.

# ఫోకస్ మహిళ

మహిళల అభ్యున్నతికి ఎన్ని చట్టాలు చేసినా, ఎన్ని పథకాలను ప్రవేశపెట్టినా పరిస్థితిలో చెప్పుకోదగిన మార్పు రావడం లేదు. ప్రత్యేకించి మహిళల స్వావలంబన అనేది అందని ద్రాక్షగానే మిగిలిపోతున్నది. మహిళల సామాజిక ఆర్థిక పరిస్థితులపై జాతీయ అంతర్జాతీయ తాజా నివేదికలు, గణాంకాల ప్రకారం, మహిళల జీవన స్థితిగతుల్లో కొద్దిపాటి పురోగతి ఉన్నప్పటికీ, అది కేవలం కొన్ని ప్రాంతాలు లేదా వర్గాలకు మాత్రమే పరిమితమైంది.




## పేదరికం యథాతథం..

స్థూలంగా చూస్తే మాత్రం పేదరికం యథాతథంగానే ఉంది. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం, ప్రస్తుత పోకడలు ఇలాగే కొనసాగితే 2030 నాటికి 342.4 మిలియన్ల మంది మహిళలు, యువతులు రోజుకు 2.15 డాలర్లు (సుమారు 188 రూపాయలు) కంటే తక్కువ ఆదాయంతో జీవిస్తూ ఉంటారు. ప్రపంచవ్యాప్తంగా, శ్రామిక శక్తి భాగస్వామ్యంలో లింగ అంతరం 1990 నుండి స్తబ్దుగా ఉంది, పురుషుల భాగస్వామ్యం దాదాపు 80 శాతం, మహిళల భాగస్వామ్యం 50 శాతం వద్ద ఉంది. ప్రపంచవ్యాప్తంగా లింగ వేతన అంతరం 20 శాతంగా అంచనా వేస్తున్నారు. కాలక్రమేణా అంతరం తగ్గినప్పటికీ, ఇటీవలి సంవత్సరాలలో పురోగతి స్థిరంగా ఉంది. మహిళలు అనధికారిక ఉపాధిలో ఎక్కువగా ఉంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 60 శాతం మహిళా ఉపాధి అనధికారిక ఆర్థిక వ్యవస్థల్లోనే కనిపిస్తుంది. తక్కువ ఆదాయ దేశాలలో, ఈ సంఖ్య 90 శాతం కంటే ఎక్కువగా ఉంది. సగటున పురుషుల కంటే స్త్రీలు, బాలికలు రోజుకు 2.5 రెట్లు ఎక్కువ గంటలు జీతం లేని ఇంటి పని లేదా పిల్లల సంరక్షణ సంరక్షణలోనే గడుపుతున్నారు. ఇది వారి శారీరక, మానసిక, ఆర్థిక పరిస్థితులపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. ప్రస్తుత వేగంతో, వేతనం లేని సంరక్షణ పనులలో లింగ అంతరం కనీసం మరో 22 నుంచి 28 సంవత్సరాలు కొనసాగుతుందని అంచనా. ఈ అంచనా మరింత పెరిగే అవకాశాలే ఎక్కువ. కాగా, వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ విడుదల చేసిన '2024 గ్లోబల్ జెండర్ గ్యాప్ ఇండెక్స్' ప్రకారం ఆరోగ్యం, మనుగడలో లింగ అంతరం 96 శాతం తగ్గింది. ఇది ఆశాజనకమైన పరిణామమే. అయితే, ఆహార అభద్రతలో లింగ అంతరాలు పెరగడం ఆందోళన కలిగించే అంశం. పురుషులలో 27.6 శాతం మందితో పోలిస్తే 31.9 శాతం మంది మహిళలు మధ్యస్త లేదా తీవ్రమైన ఆహార అభద్రతతో ఉన్నారు. ఇప్పటికీ అనేక విషయాల్లో మహిళలకు చట్టపరమైన అడ్డంకులు కొనసాగుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 16 శాతం మంది మహిళలు గృహ హింసను నేరంగా పరిగణించని దేశాలలో నివసిస్తున్నారనడం దిగ్భ్రాంతికి గురిచేసే వాస్తవం. 2024లో మహిళల పార్లమెంటరీ సీట్ల వాటా 27.2 శాతంగా ఉంది, ఇది 2015లో 22.3 శాతానికి తగ్గింది. ప్రస్తుత రేటు ప్రకారం, నిర్వాహక పాత్రలలో లింగ సమానత్వాన్ని చేరుకోవడానికి దాదాపు 100 సంవత్సరాలు పడుతుంది. 15 నుంచి 49 ఏళ్ల మధ్య వయసున్న మహిళల్లో 56.3 శాతం మందికి మాత్రమే వారి లైంగిక, పునరుత్పత్తి ఆరోగ్యంఐ అదే విధంగా హక్కులపై పూర్తి నిర్ణయం తీసుకునే అధికారం ఉంది. మన దేశం విషయానికి వస్తే పరిస్థితి కొంత మెరుగ్గా ఉంది. 15 లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న వారిలో మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్య రేటు 201718లో 23.3 శాతం ఉండగా, అది 2022–23లో 37 శాతానికి పెరిగింది. అయితే, స్త్రీ, పురుషుల మధ్య శ్రామిక శక్తి భాగస్వామ్య రేటులో గణనీయమైన అసమానత కొనసాగుతునే ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో పురుషులకు చెల్లించే మొత్తాలు మహిళల కంటే సుమారు రెట్టింపుగా ఉంది. పట్టణ ప్రాంతాల్లో కనీసం మూడింట ఒక వంతు తేడాను గమనించవచ్చు. పురుషుల కంటే ఎక్కువ మంది మహిళలు స్వయం ఉపాధి పొందుతున్నారు, కానీ గ్రామీణ మహిళల్లో 42.7 శాతం మంది గృహ సంస్థలలో సహాయకులుగా ఉన్నారు, పురుషులలో కేవలం 11 శాతం మంది మాత్రమే ఉన్నారు. ఈ పరిస్థితుల్లో మహిళల వికాసం జరుగుతున్నదని అనుకోవడం అత్యాశే.

### ఉప్పు తగ్గించుకుంటే మేలు..

ఇటీవల కాలంలో ఎక్కువ వినిపిస్తున్న పేరు 'ఓస్టియోపోరోసిస్'. దీనిని తెలుగులో బోలు ఎముకల వ్యాధి అంటారు. మహిళల్లో ఈ సమస్య ఎక్కువ. దీని నివారణ కోసం ఆహార పరిమితులు అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ప్రత్యేకించి ఉప్పును సాధ్యమైనంత వరకూ తగ్గించాలి. ఉప్పు అధికంగా ఉంటే ఆహారాన్ని భుజిస్తే, అది, ఎముకల నుండి కాల్షియంను బయటికి పంపే ప్రమాదం ఉంటుంది. అందుకే ఎక్కువ ఉప్పు లేదా ప్రాసెస్ చేసిన ఆహారాలు తినకూడదు. అదే విధంగా, చిప్స్, బ్రెడ్, ప్యాకెట్ ఫుడ్స్, ప్యాకెటెడ్ ఫుడ్స్ వంటి ప్రాసెస్డ్ ఆహార పదార్థాల్లో అధిక ఉప్పు, సాచ్యురేటెడ్ ఫ్యాట్స్, కన్సర్వేటివ్స్ ఉంటాయి. ఇవి ఎముకల ఆరోగ్యానికి హానికారకం కావచ్చు. టీ లేదా కాఫీ ఎక్కువగా తాగితే కాల్షియం శోషణ తగ్గుతుంది, అందుకే కెఫిన్ పరిమితంగా తీసుకోవడం మంచిది. ఆల్కహాల్ అధికంగా తీసుకోవడం వల్ల ఎముకలు పటిష్ఠతను కోల్పోతాయి. సాధ్యమైనంత వరకూ ఆల్కహాల్‌కు దూరంగా ఉండాలి. ప్రోటీన్స్‌ను అతిగా వాడకూడదు. మొత్తానికి, ఎముకల ఆరోగ్యానికి తగినంత కాల్షియం, విటమిన్ 'డి', ప్రోటీన్, పంచదార, ఉప్పు తక్కువగా ఉండే ఆహారం, పండ్లు, కూరగాయలు, సోయా, చేపలు, పాల ఉత్పత్తులు ఎంతో ఉపయోగకరం. వీటిని వ్యాయామంతో కలిపి జీవన విధానాన్ని మార్చుకుంటే ఓస్టియోపోరోసిస్ ప్రమాదాన్ని తగ్గించవచ్చు.



(ఇది వివిధ మాధ్యమాల నుంచి సేకరించిన సమాచారం మాత్రమే. పాఠకుల అవగాహనకు ఇది ఉపయోగపడవచ్చు. కానీ వైద్యుల సూచనలు, సలహాలు తీసుకోవడం తప్పనిసరి).

# రాజకీయ జోక్యాలతో సింగరేణి భవిష్యత్తు ప్రమాదకరం

ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి



ప్రజాపక్షం/శ్రీరాంపూర్ : మితిమీరిన రాజకీయ జోక్యాలతో సింగరేణి భవిష్యత్తు ప్రమాదంలో ఉందని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. సోమవారం శ్రీరాంపూర్‌లోని ఎస్ఆర్‌పి 3గనిలో ఏర్పాటు చేసిన ద్వార సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత రాష్ట్ర ప్రభుత్వం వల్ల సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిందని, ఇప్పుడున్న ప్రభుత్వం కూడా రాజకీయ జోక్యాన్ని కొనసాగుతుందన్నారు. దీని వల్ల సింగరేణి సంస్థ యొక్క విధులన్నీ దుర్వినియోగం అవుతున్నాయని ఆరోపించారు. గత రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ జోక్యం వల్ల సింగరేణికి రూ.27 వేల కోట్ల బకాయిలు పడిందని, ఇప్పుడున్న రాష్ట్ర ప్రభుత్వం అవి చెల్లించకపోగా అదనంగా మరో రూ. 15 వేల కోట్లు బకాయిలు చేసిందని, రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థకి దాదాపు రూ.42 వేల కోట్ల బకాయిలు ఉందన్నారు. వీరి విధానాల వలన సింగరేణి సంస్థకు తీవ్ర నష్టమన్నారు. సింగరేణిలో గుర్తింపు సంఘంగా గెలిచిన ఎఐటియూసి సమస్యల పరిష్కారంలో వైఫల్యం చెందుతుందని ఆరోపిస్తున్న ఐఎన్‌టియుసి నాయకులు మా ప్రభుత్వమే అని చెప్పుకొని తిరుగుతున్నాయని, నిజంగా వారికి కార్మికులపై, సంస్థపై చిత్తశుద్ధి ఉంటే బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించేలా ఎందుకు ప్రయత్నాలు చేయడం లేదని ప్రశ్నించారు? గత 5 సంవత్సరాలుగా సింగరేణిలో జరగని స్ట్రక్చర్ సమావేశాలను ఎఐటియూసి అవినీతికి తావు లేకుండా కార్మికులకు సర్ఫేస్ జనరల్ మజ్దూర్ పోస్టులను ఇప్పించడం జరిగిందని పేర్కొన్నారు. కార్మికు సమస్యల పరిష్కారం కోసం రెండు సార్లు స్ట్రక్చర్ సమావేశాలు జరిగాయని, అందులో కొన్ని సమస్యలను పరిష్కరించేందుకు యాజమాన్యం అంగీకరించిందని వాటికి సంబంధించిన సర్క్యులర్లు కూడా జారీ చేయడం జరిగిందన్నారు.
ఈ ఆర్థిక సంవత్సరం సింగరేణి వచ్చిన లాభాలను వెంటనే ప్రకటించి లాభాలలో 35 శాతం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి ప్రధాన కార్యదర్శి ముస్కే సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, సహాయ కార్యదర్శి మోక్కూరి కొమురయ్య, జిఎం చర్చల కమిటి ప్రతినిధులు పరసాద్ రెడ్డి, సంపత్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, ట్రేడ్స్మెంట్స్ ఇంచార్జ్ సురేష్, ఫిట్ కార్యదర్శులు మురళీ చౌదరి, లచ్చన్న, లక్ష్మణ్, సోషల్ మీడియా ఇంచార్జ్ జాడి రాజ్‌కుమార్, మల్లేష్, నగేష్, సాయిబాబా, విక్కి, సురేష్, ప్రనిల్, సారయ్య పాల్గొన్నారు.

# 'మధ్యాహ్న భోజనం' ప్రైవేట్ పరం చేసే కుట్ర విరమించుకోవాలి

వంట కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : జంపాల రవీందర్



ప్రజాపక్షం/మంగపేట : ఏటూరునాగారం, మంగపేట మండలాలు వంట కార్మికుల సంయుక్త సమావేశము పోరెడ్డి ప్రమీల, గడ్డం భారతి అధ్యక్షతన ఏటూరునాగారం బాలుర వసతి గృహం ఆవరణలో ఏర్పాటు చేశారు. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ హాజరై మాట్లాడుతూ పాఠశాలలలో గత 23 సంవత్సరాలుగా వంట బిల్లులు, కోడిగుడ్ల బిల్లులు, వేతనాలు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నా విద్యార్థులకు నాణ్యమైన భోజనాలు అందిస్తున్న వంట కార్మికులను ఈ మధ్యలో ఎవ్వరికి కోపం వచ్చినా తొలగించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కనుక వంట కార్మికుల బతుకులు తెలిసిన స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర మంత్రి సీతక్క ఎవ్వరినీ తొలగించకుండా కృషి చేయాలని కోరారు. అలాగే ఎన్నికల్లో హామీ ఇచ్చిన ప్రకారం రూ.10 వేల వేతనం వెంటనే అందించే విధంగా కృషి చేయవలసినదిగా కోరారు. ఇంకా 9 నెలల అల్పాహారం బిల్లులు, అయిదు నెలల కోడిగుడ్ల బిల్లులు, వంట బిల్లులు వెంటనే ఇప్పించాలని కోరారు. అలాగే గ్యాస్ సిలిండర్లు కోడిగుడ్లతో సహ సరుకులు మొత్తం ప్రభుత్వమే సరఫరా చేయాలని లేదా మెనూ చార్జీలు ప్రతీ విద్యార్థికి రూ.25 చెల్లించాలన్నారు. అలాగే మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైయివేట్ పరం చేసే కుట్రపూరిత ఆలోచన విధానాలను విరమించుకోవాలన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్నవారు తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు పోరెడ్డి ప్రమీల, సహాయ కార్యదర్శి గడ్డం భారతి, పుష్ప, లక్ష్మి, జానకి, భానావతి, సమ్మక్క, తదితరులు పాల్గొన్నారు.

# హాస్పిటల్ సిబ్బంది సమస్యలు వెంటనే పరిష్కరించాలి

భోగె ఉపేందర్

ప్రజాపక్షం/ కాగజ్‌నగర్ : కాగజ్‌నగర్ పట్టణంలోని హాస్పిటళ్లలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్, కాంట్రాక్టు సిబ్బంది పలు సమస్యలతో తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ సమస్యని వెంటనే పరిష్కరించాలని ఎఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగె ఉపేందర్ మంగళవారం కాగజ్‌నగర్ ఏరియా హాస్పిటల్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని టివివిపి పరిధిలో పనిచేస్తున్న కాగజ్‌నగర్, సిర్పూర్ (టి), బెజ్జూర్, తిర్యాణి, వాంకిడి హాస్పిటళ్లలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు సిబ్బందికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లింపు, ఇపిఎఫ్, ఇఎస్ఐ సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినప్పటికి స్పందన లేదని విమర్శించారు. హాస్పిటల్ జూనియర్ అసిస్టెంట్ కార్తీక్‌కు నిరవధిక సమ్మె నోటీసు అందజేసినట్లు తెలిపారు. సెప్టెంబర్ 1వ తేది లేదా ఆ తర్వాత ఎప్పటినుంచైనా సమ్మె ప్రారంభమవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు టి. దివాకర్, ఉపాధ్యాక్షులు ఆత్మకూరి చిరంజీవి, కార్మికులు తుకారాం, తిరుపతి, మారుతి, దేవిరావు, పరమేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.




# ప్రభుత్వ హాస్పిటల్‌లో టెండర్లు పిలవాలి

కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి

పిఎఫ్ డబ్బులు జమ చేయకపోతే ఆందోళన చేపడుతాం :పల్లా దేవేందర్ రెడ్డి




ప్రజా పక్షం/నల్లగొండ : ప్రభుత్వ హాస్పిటల్ లో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ గార్డ్స్, పేషంట్ కేర్ కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని ఎఐటియుసి తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళ వారం నల్లగొండ లో జరిగిన మెడికల్ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటయుసి అనుబంధం) జనరల్ బాడీ సమావేశానికి పల్లా దేవేందర్ రెడ్డి ము ఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ నల్లగొండ జిల్లా హాస్పిటల్‌లో ప్రస్తుతం ఉన్న శానిటేషన్ టెండర్ కాలపరిమితి త్వరలో ముగిస్తుండడం తో వెంటనే కొత్త టెండర్లను పిలిచి కనీస వేత నం ప్రతి కార్మికునికి రూ.26వేలు వచ్చే విధం గా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆ యన డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా కేం ద్ర హాస్పిటల్‌లో గత కొన్ని నెలలుగా కార్మికు ల ఖాతాలో పిఎఫ్ డబ్బులు జమకావటం లేదని తక్షణమే జమ చేయాలని ఆయన కోరారు. కార్మికుల ఖాతాలో పిఎఫ్ డబ్బులు జమ చేయకపోతే ఎఐటియుసి ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని పేర్కొన్నారు. సమాజంలో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెరగకపోవడంతో చాలి చాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు సంవత్సరాలకొకసారి మార్చాల్సిన కనీస వేత న చట్టాలు 10 సంవత్సరాలు పైగా తెలంగాణ రాష్ట్రంలో మార్చకపోవడం వల్ల కార్మికులు కనీస వేతనాలకు నోచుకోవడం లేదని అన్నా రు. బెడ్ల సంఖ్య పెరగడం వలన కార్మికులపై అధిక భారం పడుతుందని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న పిఎఫ్ బకాయిలను వెంట నే చెల్లించాలని, పండుగ జాతీయ సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో యూనియన్ నాయకులు ఏం యాదగిరి, టి పద్మ,పి ఎల్లమ్మ,ఏ పద్మ, ఆర్‌భాగ్యమ్మ,యాదమ్మ, డి.జయమ్మ, సీత ఇంద్ర మ్మ, పి.జీవిత,టీ.సునీత, అరుణ తదితరులు పాల్గొన్నారు.

# ఎంజెఆర్ బిఇడి కళాశాలపై చర్యలు

ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి :ముదిగొండ మురళీకృష్ణ

ప్రజాపక్షం/మర్రిగూడ : యూనివర్సిటీ నిబంధనలు తుంగలో తొక్కి బిఈడి కళాశాలలు రకరకాల ఫీజుల పేరుతో విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేసి, డిసర్టేషన్,డెవలప్మెంట్,ల్యాబ్,లైబ్రరీ అని అధిక ఫీజులను ముక్కు పిండి వసూలు చేస్తున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ ఆరోపించారు. మర్రిగూడ మండల కేంద్రంలోని ఎంజెఆర్ ప్రైవేటు బిఈడి కళాశాల యాజమాన్యం విద్యార్థుల దగ్గర్నుంచి అధిక పీసులు వసూలు చేస్తున్నారని యూనివర్సిటీ అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అధిక ఫీజులు వసూలు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, యాజమాన్యం వెంటనే విద్యార్థులకు ఫీజులు తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు.కళాశాలలో అర్హత కలిగిన లెక్చరర్స్ సరిపడ లేరని,దీనివలన విద్యార్థులకు చదువు సరిగా అందడం లేదని అన్నారు.కళాశాల యాజమాన్యం కౌన్సిలింగ్ సీటు వచ్చిన విద్యార్థుల దగ్గర కూడా అధిక పీసులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కళాశాల యాజమాన్యంపై యూనివర్సిటీ అధికారులు చర్యలు తీసుకోకపోతే తమ సంఘం ఆధ్వర్యంలో ప్రైవేటు బిఇడి కళాశాలల ఎదుట ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.





# మహానగరి

గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## వీరన్న గుట్ట డ్రైనేజీ ట్రంక్ లైన్ పూర్తిచేయండి : మధుయాష్కిగౌడ్

**ప్రజాపక్షం/హయత్ నగర్:** మన్సూరాబాద్ డివిజన్ హయత్ నగర్ సమీపంలోని వీరన్న గుట్ట వద్ద నిలిచిన డ్రైనేజీ ట్రంక్ లైన్ పనులను పూర్తి చేయించాలని జలమండలి ఎండి అశోక్ రెడ్డిని మాజీ ఎంపి,నియోజకవర్గం ఇంచార్జి మధుయాష్కి గౌడ్ కోరారు. ఖైరతాబాద్‌లోని జలమండలి కార్యాలయంలో ఎండి అశోక్‌రెడ్డితో మధుయాష్కి సమావేశమయ్యారు. ఎల్.బి నగర్ నియోజకవర్గంలోని డ్రైనేజీ సమస్యలను వివరించి పరిష్కరించాలన్నారు. ఈ ట్రంక్ లైన్ తోనే 20 కాలనీలకు డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు కానుందన్నారు. రెండేళ్లుగా పనులు కొనసాగుతుండడంతో మురుగునీరు రోడ్లపై పారుతుండడంతో కాలనీల ప్రజలు అసౌకర్యాలకు గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా చొరవ చూపి ట్రంక్ లైన్ పనులను పూర్తి చేయించాలని జలమండలి ఎండిని కోరగా స్పందించిన ఎండి వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు చేపడతామన్నారు.



## బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి పోరాడిన సురవరం చిరస్మరణీయుడు



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పోరాడిన సురవరం సుధాకర్‌రెడ్డి చిరస్మణీయుడిగా నిలిచాడని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నేలపాటి రామారావు అన్నారు. మంగళవారం వనస్థలిపురం డివిజన్‌లోని ప్రశాంత్ నగర్ కాలనీ సంక్షేమ భవనంలో సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సురవరం సుధాకర్‌రెడ్డి సంతాప సభ సందర్భంగా ఆయన చిత్రాపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీనియర్ సీటిజన్ సంఘం ప్రధాన కార్యదర్శి బిజిఎం రెడ్డి, ఉపాధ్యక్షులు కేశవరావు, తెలంగాణ అధ్యయన వేదిక సమన్వయకర్త కట్టా భగవంతరెడ్డి, వర్కింగ్ ఉమెన్ ఫోరమ్ అధ్యక్షులు కమలాదేవి, పిఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షులు జి. అనసూయ, ప్రేమలత, ప్రశాంత్ నగర్ మహిళా సంఘం అధ్యక్షులు సుకృత, కాలనీ పెద్దలు యుగంధర్‌రెడ్డి, గంగాధర్, నరసింహారెడ్డి, రంగయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు సకాలంలో యూరియా పంపిణీ

సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి డిమాండ్



**ప్రజాపక్షం/షాబాద్ :** రైతులకు సకాలంలో యూరియా పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, చేవెళ్ల నియోజకవర్గ కన్వీనర్ కె.రామస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం చేవెళ్ల ఆర్‌డిఓ కార్యాలయం ఎదుట జిల్లా రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ రైతులకు సకాలంలో యూరియాను అంధించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నియోజకవర్గ బాధ్యుడు ఎం.సుధాకర్ గౌడ, జిల్లా కార్యదర్శి ఎం.ప్రభు లింగం, రైతులు ఎం.సత్తిరెడ్డి, పాపయ్య, మహిళా రైతులు వెంకటమ్మ, గంగోత్రి, దేవి, లలితలు పాల్గొన్నారు.

## మట్టి వినాయకుడిని పూజిద్దాం

కార్పొరేటర్ బానోత్ సుజాత నాయక్



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు మట్టి వినాయకుని పూజించాలని జిహెచ్‌ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు, స్థానిక కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ అన్నారు. మంగళవారం జిహెచ్‌ఎంసి ఆధ్వర్యంలో మట్టి గణానాథులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడానికి మట్టి వినాయకులను పూజించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ప్లాస్టిక్, కేమికల్స్ లేకుండా వినాయకులను పూజించడంతో భవిష్యత్ తరాలకు మరో వందేళ్ల భవిష్యత్‌ను ఇచ్చే విధంగా ఉంటామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చంద్రమోహన్‌రెడ్డి, మల్లారెడ్డి, అనంతరెడ్డి, నరసిహారెడ్డి, నరేష్, శ్రీనివాస గౌడ్, నరసింహ, డేరంగుల కృష్ణ, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల్లో గెలుపే లక్ష్యం

ఎంపి డికె అరుణ



**ప్రజాపక్షం/ఫరూక్‌నగర్:** వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని ఎంపి డికె అరుణ సూచించారు. మంగళవారం కేశంపేట మండలానికి చెందిన పవన్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు బిజెపిలో చేరారు. వారందరికి బిజెపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపి డికె అరుణ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయయే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో మహేందర్‌రెడ్డి, పసుల నర్సింహా యాదవ్, కంచుకోట మహేష్, కర్రెద్ల నరేందర్‌రెడ్డి, పల్లె అంజయ్య, శివాజీ, తిరుపతి, సతీష్, దశరథ, మల్లేష్, కృష్ణ, శ్రీశైలం, శివ, రాజు, మహేష్, రామకృష్ణ, రాము, శంకర్, ప్రసాద్, రాజశేఖర్ పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా జాగ్రత్తలు పాటించాలి




**ప్రజాపక్షం/సరూర్‌నగర్:** సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా జాగ్రత్తలు పాటించాలని కామినేని ఆసుపత్రి జనరల్ మెడిసిన్ విభాగాధిపతి, సీనియర్ కన్సల్టెంట్ ఫిజిషియన్ డాక్టర్ ఎం.స్వామి అన్నారు. మంగళవారం ఎల్‌బినగర్ కామినేని ఆసుపత్రిలో డాక్టర్‌లు హరికిషన్, శ్రీకృష్ణ రాఘవేందర్, ప్రదీప్‌కుమార్‌పటేల్‌లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్వామి మాట్లాడుతూ వర్షాలు వస్తున్న ఈతరుణంలో పలురకాల జ్వరాలు, ముఖ్యంగా ఇన్‌ఫ్లూయెంజా, డెంగ్యూ, చికన్ గున్యాలాంటివి కనిపిస్తున్నాయని, వీటిపై ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, వేడి చేసి చల్లార్చిన నీటిని తాగాలని, నిల్వ ఉంచిన ఆహారాన్ని తినొద్దని తెలిపారు.

# నగరవ్యాప్తంగా ముమ్మరంగా రోడ్డు భద్రతా డ్రైవ్







**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) పరిధిలో రోడ్డు భద్రతా కార్యక్రమంలో భాగంగా రోడ్డు మరమ్మతులు పనులు ముమ్మరంగా కొనసాగిస్తోంది. పౌరుల భద్రత దృష్ట్యా ప్రధాన రహదారులపై గుంతలు, క్యాచ్‌పిట్స్, సెంట్రల్ మీడియన్ తదితర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటివరకు మొత్తం 13,120 గుంతలు గుర్తించారు. వాటిలో 10,390 గుంతలు మరమ్మతులు చేయడం జరిగింది. 522 క్యాచ్ పిట్స్ రిపేర్ పనులు, 301 క్యాచ్ పిట్ కవర్ రీప్లేస్‌మెంట్లు, 8 సెంట్రల్ మీడియన్ చిన్నపాటి రిపేర్ పనులు పూర్తి చేశామని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ తెలిపారు.

జోన్‌ల వారీగా వివరాలు..

- ఎల్.బి. నగర్ జోన్‌లో – 2,868 గుంతలు గుర్తించగా, వాటిలో 2,381 మరమ్మతులు పనులు పూర్తి చేశారు.
- చార్మినార్ జోన్ లో – 2,227 గుంతలు గుర్తించగా, 1,826 మరమ్మతులు చేపట్టారు.
- ఖైరతాబాద్ జోన్‌లో – 1,721 గుంతలు గుర్తించగా, 1,343 మరమ్మతులు పనులు పూర్తి చేశారు.
- శేరిలింగంపల్లి జోన్‌లో– 1,938 గుంతలను గుర్తించగా, 1,290 మరమ్మతు పనులు పూర్తి చేశారు.
- కూకట్‌పల్లి జోన్‌లో –1,941 గుంతలను గుర్తించగా, 1,706 మరమ్మతులు పనులు పూర్తి చేశారు. సికింద్రాబాద్ జోన్ లో – 2,425 గుంతలను గుర్తించగా, 1,844 మరమ్మతు పనులు పూర్తయ్యాయి.

రహదారులపై ఉన్న అన్ని లోపాలను వేగవంతంగా సరిచేసి, వర్షాకాలంలో రోడ్ల భద్రత కోసం అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కమిషనర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పౌరులు సమస్యలు గమనించిన వెంటనే జిహెచ్‌ఎంసి హెల్ప్‌లైన్‌కి సమాచారం ఇవ్వాలని ఆయన నగరపౌరులకు విజ్ఞప్తి చేశారు.

## ఆప్ నేతలపై ఇడి దాడులు తగదు

ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్




**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఢిల్లీ అధ్యక్షుడు సౌరవ్ భరద్వాజ్‌పై వచ్చిన ఆరోపణలు నిరాధారమని, ఆయనపై ఇడి దాడులను ఖండిస్తున్నామని ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ లిబర్టీలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ భరద్వాజ్‌పై ఇడి మోపుతున్న అభియోగం ఆయన ఆరోగ్యమంత్రిగా లేని కాలానికి సంబంధించినదన్నారు. అప్పుడు సత్యేంద్ర జైన్ ఆరోగ్యమంత్రిగా ఉన్నారని, ఆయనపై ఎలాంటి ఆధారాలు లేనందున సిబిఐ క్లీన్‌చిట్ ఇచ్చిందని గుర్తుచేశారు. బిజెపి అధికారంలో కొచ్చి 5,267 ఇడి, సిబిఐ కేసులను తమ వ్యతిరేకులపై మోపి, బెదిరించి పార్టీలోకి చేర్చుకొంటున్నదని తెలిపారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర మాజీ కన్వీనర్ బుర్రా రాములు గౌడ్, నేతలు విజయ్ మల్లంగి, యమునగౌడ్, హేమ జిల్లోజు, జావీద్ షరీఫ్, శివాజీ పాల్గొన్నారు.

# బిసి రిజర్వేషన్లకు కేంద్రం అడ్డుపుల్ల

ఐదు నెలలుగా బిల్లును తొక్కిపెడుతున్న బిజెపి ప్రభుత్వం

28న 'ఏది నిజం' అంశంపై బిసి సంఘాల సమావేశం

జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడి



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** కేంద్రప్రభుత్వం రాష్ట్రపతి భవన్‌ను, రాజ్‌భవన్‌ను తమ జేబుసంస్థగా మార్చుకొని, విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బిసిల 42శాతం రిజర్వేషన్ల పెంపును అడుగడుగునా అడ్డుకొంటున్నదని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ధ్వజమెత్తారు. మూడు నెలల్లో పరిష్కరించే బిసి బిల్లులను కేంద్రం తొక్కిపెడుతుందని మండిపడ్డారు. మంగళవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బిసి కుల సంఘాల జెఎసి చైర్మన్ కుందారపు గణేశ్‌చారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ పోరాట ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం బిసిలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42శాతం రిజర్వేషన్లు పెంచుతూ అసెంబ్లీలో బిల్లు పెట్టి ఏకగ్రీవంగా ఆమోదించి, కేంద్రప్రభుత్వానికి పంపించి ఐదు నెలలు అవుతున్నదని తెలిపారు. అయినా, కేంద్రం బిసి రిజర్వేషన్ల బిల్లుపై ఎటూ తేల్చకపోవడం బాధాకరమన్నారు. మొన్న పార్లమెంట్ సమావేశాల్లో బిసి బిల్లులపై ప్రస్తావన తేకపోవడం పట్ల బిజెపికి బిసిలపై ఉన్న వ్యతిరేకతకు నిదర్శనమని విమర్శించారు. నాటి మండల్ కమిషన్ నుంచి నేటి బిసి బిల్లు వరకు బిజెపి బిసిలను మోసం చేస్తూనే ఉన్నదని మండిపడ్డారు. ఇకనైనా బిసి రిజర్వేషన్లను పెంచకొంటే బీహార్ ఎన్నికల్లో బిజెపి కూటమికి బిసిలే తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. హైదరాబాద్‌లో ఈ నెల 28న బిసి బిల్లులపై 'ఏది నిజం?' అనే అంశంపై బిసి సంఘాల విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, విద్యార్థి జాతీయ అధ్యక్షులు విక్రమ్ గౌడ్, యువజన సంఘం అధ్యక్షులు శ్యాం కుర్మ, విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు మహేశ్ యాదవ్ , నేతలు ఉప్పరి శేఖర్ సగర, ఈడిగ శ్రీనివాస్‌గౌడ్ తదితర బిసి నేతలు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు ముందస్తు ఏర్పాట్లు

రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లు చేయాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో జిల్లా నోడల్ అధికారులు, ఎంపిడిఒ లు,మండల ప్రత్యేక అధికారులు, ఎంపిఒలు, ఇతర అధికారులతో ముందస్తు ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా అదనపు కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల వారీగా పోలింగ్ బూతులు, ఓటర్ లిస్టులు, 1పోలింగ్ అధికారులు, పోలింగ్ సిబ్బందికి సంబంధించి అన్ని సిద్ధం చేసుకోవాలన్నారు. ఓటర్ జాబితాను కూడా సిద్ధం చేసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా ప్రజా పరిషత్ సిఇఓ కృష్ణారెడ్డి,జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్,జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీలత పాల్గొన్నారు.

### నిమజ్జనానికి చెరువుల వద్ద తగిన ఏర్పాట్లు

గణేష్ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ కె.శ్రీనివాస్ ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనము సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ గణేష్ ఉత్సవాల ఏర్పాట్లపై, ఇందిరమ్మ ఇండ్లపై, వనమహోత్సవంపై మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సెప్టెంబర్ 6న నిమజ్జనం ఉన్నందున వినాయక మంటపాలు నిర్వాహకులు అందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి మంటపాల నిర్వాహకులు తగు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. జిల్లాలో మున్సిపాలిటీల పరిధిలో గణేష్ నిమజ్జనం నిర్వహించేందుకు గుర్తించిన చెరువుల వద్ద సానిటేషన్, భారీ కేడింగ్, లైటింగ్, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గణేష్ నిమజ్జనం నిర్వహించే ప్రదేశాల వద్ద క్రెన్లు, బారికేడింగ్,వేదిక ఏర్పాట్లు మున్సిపల్ కమిషనర్లు,ఆర్ అండ్ బి శాఖ అధికారులు కలసి చేపట్టాలని, అధికారులు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా ప్రణాళిక రూపొందించుకొని సమన్వయముతో పని చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల పై సమీక్షిస్తూ జిల్లాలో మున్సిపల్ కార్పొరేషన్ల, మున్సిపాలిటీల పరిధిలో గ్రౌండింగ్ పూర్తి అయి బేస్మెంట్ స్థాయి వరకు వచ్చిన ఇండ్ల లబ్దిదారులకు పేమెంట్ చేయాలని సూచించారు. వనమహోత్సవంపై సమీక్షిస్తూ మున్సిపల్ కార్పొరేషన్ల, మున్సిపాలిటీల పరిధిలో నిర్దేశించిన లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనరులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## శివారు కాలనీల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** బిఎన్‌రెడ్డినగర్ డివిజన్ శివారు కాలనీలకు ఫారెస్టు ప్రాంతం గుర్రంగూడ నుంచి వచ్చే డ్రైనేజీ నీరు కాలనీలపై ప్రవహించడంతో కాలనీల్లో తీవ్ర దుర్వాసనతో ప్రజలు సతమతం అవుతున్నారని ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం డివిజన్లోని శివారు కాలనీలు గాంధీ నగర్ సౌత్ కాలనీలకు కాలనీ వాసులతో కలిసి పర్యటించారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఎ సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఒకవైపు ప్రభుత్వం నిర్లక్ష్యం, మరోవైపు అధికారుల చేతగాని తనంతో ప్రజలు ఇబ్బందిపడే పరిస్థితి ఉందన్నారు. తక్షణమే అధికారులు స్పందించి డ్రైనేజీ నీరు కాలనీలపై రాకుండా జాగ్రతలు తీసుకోని, సమస్యలను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, ఫారెస్టు అధికారి కస్నా నాయక్, జిహెచ్‌ఎంసి అధికారులు సతీష్ నాయక్, నాయకులు సుమన్ గౌడ్, ముద్దగోని సతీష్ గౌడ్, అమర్త్యరెడ్డి, కృష్ణారెడ్డి, శంకరయ్య గౌడ్, సందీప్‌రెడ్డి, నరేన్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## మారుతున్న కాలానికి అనుగుణంగా పనితీరు మెరుగు పర్చుకోవాలి

మహేశ్వరం డిసిపి సునితారెడ్డి

హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ తనిఖీ

**ప్రజాపక్షం/యాచారం :** మారుతున్న కాలానికి అనుగుణంగా పోలీసులు తమ పనితీరు మార్చుకోవాలని మహేశ్వరం డిసిపి సునితారెడ్డి అన్నారు. మంగళవారం మేడిపల్లి గ్రామంలో ఉన్న హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సంధర్భంగా డిసిపి సునితారెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పోలీసులు ముందుండి పని చేయాలన్నారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి వారి నమ్మకాన్ని గెలుచుకొవాలన్నారు. నేరాల నివారణ, మహిళా భద్రత, సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పోలీస్ స్టేషన్ భద్రత గురించి అడిగి తెలుసుకున్నారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉంచుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను వేగవంతం చేయాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సిబ్బందికి మార్గ దర్శకాలు అందించారు. దర్యాప్తులో ఉన్న కేసులకు సంబంధించిన పైళ్ళను, రికార్డులు పరిశీలించారు కార్యక్రమంలో ఇబ్రహింపట్నం ఎసిపి కెపివి రాజు, గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ సిఐ సత్యనారాయణ, పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు విస్తరణ పనులకు నిధులు మంజూరు : ఎమ్మెల్యే శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** రోడ్డు విస్తరణతోపాటు రీ బిటి నిర్మాణ పనులు చేసేందుకు ప్రభుత్వం రూ.5.50కోట్ల నిధులు మంజూరు చేసిందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ షాద్‌నగర్ ముఖ్యకూడలి నుండి రెండు కిలో మీటర్లు కిషన్‌నగర్ రోడ్డు వరకు రోడ్డు విస్తరించడంతోపాటు రీ బిటి నిర్మాణం పనులు చేపట్టడం జరుగుతుందని వివరించారు. పాత జాతీయ రహదారి అభివృద్ధి తరహా పరిగి రోడ్డును అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రోడ్డు మధ్యలో ఉన్న మిషన్ భగీరథ పైపులైన్ నిర్మాణాలను ఒకసైడ్ వేసి డివైడర్ వేయడంతోపాటు సెంట్రల్ లైటింగ్‌తో ఇరువైపుల రెండు లైన్ల చొప్పున నాలుగు లైన్ల రహదారిని నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. నాణ్యత ప్రమాణాలతో త్వరలో నిర్మాణ పనులు ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. షాద్‌నగర్ మున్సిపాలిటిని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటుంటే కొంతమంది వ్యాపారులు సహకారం అంధించడం లేదని అన్నారు. సమావేశంలో కాశీనాథ్‌రెడ్డి, జకారం శేఖర్, లింగారెడ్డిగూడ అశోక్‌లు ఉన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులు



రంగారెడ్డి కలెక్టర్ నారాయణ రెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను పూజిద్దామని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కాలుష్య నియంత్రణ మండలి రంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలోని జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టరేట్ సిబ్బందికి కలెక్టర్ నారాయణరెడ్డి మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని పర్యావరణాన్ని పరిరక్షించడానికి మట్టి గణపతులనే పూజిద్దాం అన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌ని నిర్మూలించే దిశగా మట్టితో చేయబడ్డ గణనాథులను ఏర్పాటు చేసుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. వినాయక చవితి పండుగ సందర్భంగా జిల్లాలోని ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. నవరాత్రి ఉత్సవాలను సమన్వయంతో భక్తి శ్రద్దలతో నిర్వహించుకోవాలన్నారు. రసాయనాలతో తయారు చేసిన విగ్రహాల వలన పర్యావరణం కలుషితం అవుతున్నదని, కాలుష్య నివారణకు, పర్యావరణాన్ని కాపాడుకోవడానికి మట్టి వినాయకులను వినియోగించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారి వెంకట నర్సు, ఎఇఎస్ ఆర్.మహేష్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## కాలనీలో సమస్యలు పరిష్కరించేందుకు కృషి



**ప్రజాపక్షం/చర్లపల్లి:** కాలనీలో మౌలిక సదుపాయల కల్పనకు కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం చర్లపల్లి డివిజన్ పరిధిలోని లోక్‌మాత కాలనీలో అసోసియేషన్ ఆఫీసును ప్రారంభించి కాలనీవాసులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే కాలనీలోని సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, నాయకులు మహేష్‌గౌడ్, కొండ జంగారెడ్డి, ఎంకిరాల నర్సింహ, గిరిబాబు, అబ్బయ్య, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.



## లక్ష్మినారాయణ చెరువును పరిశీలించిన అదనపు డిసిపి

**ప్రజాపక్షం/ ఘట్‌కేసర్ :** వినాయకుల ఉత్సవాలు నిమజ్జనం కార్యక్రమాలు జరుగనున్నందున ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎదులాబాద్ గ్రామంలోని లక్ష్మి నారాయణ చెరువును నిమజ్జనం ఏర్పాట్ల కోసం మల్కాజ్గిరి జోన్ అడిషనల్ డిసిపి వెంకటరమణ, ఏసిపి చక్రపాణి, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ ముల్లి పావనిజంగయ్య యాదవ్, సిఐ బాలస్వామి, రాజువర్మలు ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డిసిపి మాట్లాడుతూ ప్రతి ఏటా లక్ష్మి నారాయణ చెరువులో వందలాదిగా వినాయకులను తీసుకువచ్చి నిమజ్జనం చేయటం జరుగుతుందని ఈ నేపథ్యంలో ఏర్పాట్ల నిమిత్తం సందర్శించినట్లు తెలిపారు. వినాయకుల ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా నిర్వహించాలని ఉత్సవాలతో పాటు నిమజ్జనం కార్యక్రమాలను కూడా నిబంధనలు మేరకు నిర్వహించుకోవాల్సి ఉంటుందని, ముందుస్తుగా ప్రజలను యువతను చైతన్యం చేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిఐ శ్రీనివాస్, ట్రాపిక్ సిఐ రవీందర్, ట్రాఫిక్ ఎస్సైలు మున్సిపల్ కమిషనర్లు,రాజకీయ నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సర్ఫరాజ్ అహ్మాద్‌కు ధన్యవాదాలు తెలిపిన తోటకూర అజయ్ యాదవ్

**ప్రజాపక్షం/బోడుప్పల్ :** అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, మంగళవారం హెచ్ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మాద్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా అజయ్ యాదవ్ మాట్లాడుతూ, బోడుప్పల్ పరిధిలో రోడ్ల నిర్మాణం,రోడ్ల విస్తరణ, సదుపాయాల మెరుగుదలకు హెచ్ఎండిఏ నిధులు కేటాయించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధులతో స్థానిక ప్రజలకు ప్రయాణ సౌకర్యాలు, రవాణా వ్యవస్థ మరింత మెరుగవుతుందని అన్నారు. అలాగే భవిష్యత్తులో బోడుప్పల్ ప్రజావసరాలను దృష్టిలో ఉంచుకొని లైబ్రరీ, మినీ ఫంక్షన్ హాల్స్ వంటి సామాజిక వసతుల కోసం నిధులు మంజూరు చేయాలని ఆయన హెచ్ఎండిఏ కమిషనర్‌ను కోరారు. ప్రజలకు అవసరమైన వసతులు అందించడానికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని అజయ్ యాదవ్ హామీ ఇచ్చారు. అదే విధంగా బోడుప్పల్‌లో రెండు వైకుంఠ దామాల నిర్మాణాల కోసం కూడా నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. పై అంశాల పట్ల హెచ్ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మాద్ బోడుప్పల్ అభివృద్ధి అవసరాలను గమనించి, సాధ్యమైన మేరకు సహకరిస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. కమిషనర్ ను కలిసిన వారిలో మాజీ కార్పొరేటర్లు సింగిరెడ్డి పద్మారెడ్డి, సీసా వెంకటేష్ గౌడ్, భూక్య సుమన్ నాయక్ తదితరులు ఉన్నారు.





## చెరువును సందర్శించిన డిసిపి పద్మజ

**ప్రజాపక్షం/చర్లపల్లి:** కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాప్రా చెరువును మల్కాజ్‌గిరి డిసిపి పద్మజ మంగళరం సందర్శించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బందికి పలు సూచనలు చేశారు. నిమజ్జనం సందర్భంగా అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లాలని అన్నారు. విగ్రహ నిమజ్జన కార్యక్రమంలో ఎక్కడా చెట్ల కొమ్మలు అడ్డురాకుండా తొలగించాలని, వేలాడుతున్న విద్యుత్ వైర్లు గుర్తించి సరి చేయలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసిపి వెంకట్‌రెడ్డి, సిఐ భాస్కర్‌రెడ్డి, జిహెచ్ఎంసి, ఎలక్ట్రికల్ ఆఫీసర్స్, ఎఐలు సుధాకర్‌రెడ్డి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## ధృవీకరణ పత్రాలు జాప్యం లేకుండా జారీ చేయాలి : అదనపు కలెక్టర్

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ధృవీకరణ పత్రాల కోసం వచ్చే ధరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత వ్యవధిలో ఎలాంటి జాప్యానికి తావివ్వకుండా జారీ చేస్తుండాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం బాచ్‌పల్లి మండలంలో పర్యటిస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసారు. అక్కడ వివిధ రికార్డులు పరిశీలించిన అనంతరం కులం, లోకల్(స్థానికత) ఆదాయం లాంటి ఇతరత్రా ధృవీకరణ పత్రాల నిమిత్తం విద్యార్థులు, ఉద్యోగాలకు వెళ్లే వారు, ఉపాధి రుణాలు పొందే వారు రెవెన్యూ అధికారులను ఆశ్రయిస్తుంటారని, వీటన్నింటిని ధరఖాస్తుదారులు పొందుపరచిన వివరాలు, జత పరచిన పత్రాలన్నింటిని పరిశీలించటం, అవసరమైన సందర్భాల్లో క్షేత్ర స్థాయికి వెళ్లటం చేయటం ద్వారా ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా సత్వరం జారీ చేస్తుండాలే తప్ప ఎవరనీ ఇబ్బందులకు గురి చేయవద్దని సూచించారు.అదే విధంగా పరిపాలనాపరమైన ఫైళ్లను పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు. కార్యాలయ సిబ్బంది, శిక్షణ పొందిన సర్వేయర్ల్యల పని తీరును అడిగి తెల్సుకొన్నారు. మల్కాజిగిరి ఆర్‌డిఓ శ్యామ్‌ప్రసాద్,ఆర్ఐలు రేణుక,భానుచందర్, సర్వేయర్ సంధులు ఈ కార్యక్రమంలో ఉన్నారు.

## గణేశ్ ఉత్సవాలు
# ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

### డిసిపి పద్మజా రెడ్డి







**ప్రజాపక్షం/మల్కాజిగిరి/కాప్రా:** నేటి నుండి ఆనందోత్సవాలతో ప్రారంభం కానున్న గణేశ్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని మల్కాజిగిరి డిసిపి పద్మజా రెడ్డి సూచించారు. వివిధ ప్రాంతాల్లో నెలకొల్పే మంటపాల వద్ద నిర్వాహకులు పోలీసులతో పాటు సంబంధిత వివిధ ప్రభుత్వ విభాగాధికారులు, సిబ్బందిని సమన్వయ పరచుకొంటూ భక్తులు, సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు ఏర్పాట్లు చేయాలన్నారు. మంగళవారం భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటి మల్కాజిగిరి అసెంబ్లీ కన్వీనర్ రుత్విక్, కో కన్వీనర్ సూరజ్, జిహెచ్ఎంసి ఏఈ మహేశ్వర్, కుషాయిగూడ ఎసిపి వెంకటరెడ్డి, నేరేడ్‌మెట్ ఇనస్పెక్టర్ సందీప్‌కుమార్‌లతో కల్సి నిమజ్జనాలు జరిగే సఫిల్‌గూడ బేబిపాండ్‌ను సందర్శించారు. ఎక్కడా ఎలాంటి తోపులాటలు చోటు చేసుకోకుండా చూడాలన్నారు.

పోలీసు విభాగం పూర్తి స్థాయిలో భద్రతాఏర్పాట్లు చేస్తోందని,అవసరమైన సందర్భాల్లో సహాయత కోసం సమీప పోలీసులను కానీ డయల్ 100 ద్వారా కానీ సంప్రదించాలని డిసిపి కోరారు. నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో ఇనస్పెక్టర్ సందీప్‌కుమార్ సిబ్బందికి మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేసారు.

**నాచారంలో...**కాంగ్రెస్ పార్టీ,ఎస్ఎస్ యువసేన ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పరమేశ్వరరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, నాచారంలోని మహంకాళి దేవస్థానం చైర్మన్ శ్రీనివాసరెడ్డి, మామిడాల సంతోష్, రాజిరెడ్డి, బాల్‌రాజ్, ఫిరోజ్, శ్రీనివాస్,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్ వార్డు కార్యలయం వద్ద స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేసారు.

## వినాయక ఉత్సవాలపై కమిషనర్ సమీక్ష

### తూంకుంట కమిషనర్ జ్యోతి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** తూంకుంట మున్సిపల్ కార్యాలయలంలో వినాయక చవితి ఉత్సవాలపై వార్డు ఆఫీసర్లతో తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి సమీక్ష సమావేశం నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన సమీక్షలో తూంకుంట కమిషనర్ జ్యోతి మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని చెరువులు, కుంటల్లో గణేశ్ నిమజ్జనానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. చెరువుల వద్ద ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు ఏర్పాటు చేయాలని చెప్పారు. అనంతరం తూంకుంట మున్సిపల్‌లో విధులు నిర్వహిస్తున్న వార్డు ఆఫీసర్లకు, మేనెజర్లకు, సిబ్బందికి ఈకో ఫ్రెండ్లిలో భాగంగా మట్టి గణపతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రావణ్‌కుమార్, మున్సిపల్ వార్డు ఆఫీసర్లు, తదితరులు పాల్గొన్నారు



## వాలీబాల్‌లో సత్త చాటిన బంట్వారం విద్యార్థులు

**ప్రజాపక్షం/బంట్వారం :** మండల పరిధిలో ఉన్న ఆదర్శ పాఠశాల విద్యార్థులు 69 వ ఎస్‌టీ ఆట పోటిలో బాగంగా మా పాఠశాల విద్యార్థులు వాలిబాల్ సత్తా చాటారని ప్రిసిపాల్ బ్యూలా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సందర్బంగా అమె మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఉన్న మర్పల్లి మండలం పట్లూర్ నిర్వహించిన 69 వ ఎస్‌టీ క్రీడ స్థాయిలో (వాలిబాల్) అండర్ 17 విబాగంలో బంట్వారం ఆదర్శ పాఠశాల విద్యార్థులు మొదటి బహుమతి గెలుచుకోవడం జరిగిందన్నారు. అదే విధంగా బాలుర విభాగం అండర్ 17 లో శ్రావణ్ కూమార్ మరియు అండర్ 17 బాలికలు అందరు డిస్రిక్ట్ లెవల్ ఎంపింకయినట్లు పేర్కోన్నారు. 69 వ ఎస్‌టీ క్రీడ స్థాయిలో గెలుపోందిన విద్యార్థులను ప్రిసిపాల్ బ్యూలా , వ్యాయమ ఉపాధ్యాయులు స్వరూప, రామకృష్ణ ,అభినందించారు.

## హెచ్‌ఐవి ఎయిడ్స్‌పై జిల్లా స్థాయి క్విజ్ పోటీలు




**ప్రజాపక్షం/వికారాబాద్ :** డిస్టిక్ ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజీ ఫర్ హెచ్ ఐ వి ఎయిడ్స్ పై జిల్లా వైద్యారోగ్యశాఖ వికారాబాద్ ఆధ్వర్యంలోయ అలంపల్లి హైస్కల్‌లో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి లలితా దేవి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన వారిని రాష్ట్రస్థాయిలో క్విజ్ పోటీలకు పంపిచడం జరుగుతుంది. ఈ క్విజ్‌లో విజేతలుగా నిలిచిన వారిని మిగతా విద్యార్థులను ఉద్దేశిస్తూ డిఎంఎచ్ఓ హెచ్ఐవిపై అవగాహన పెంచుకోవడంతో పాటు అందరికీ తెలియజేయాలని, చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఆటలు మిగతా విషయాలలో కూడా ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి డిఎంహెచ్ఓ రవీంద్రయాదవ్, దేవయ్య, నరేందర్, రమేష్ , రత్నాకర్ తదితరులు పాల్గోన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలకు చేయూతనివ్వాలి

### ఆర్‌టిఐ మెంబర్ జైపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం/శామీర్‌పేట:** ప్రభుత్వ పాఠశాలలకు ప్రతి ఒక్కరు తమకు తోచిన విధంగా సహాయ సహకారాలు అందించాలని, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు, జిల్లా ఆర్‌టిఐ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం తూంకుంట మున్సిపల్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు అసెంబ్లీ నిర్వహించడానికి పోర్టబుల్ డిజిటల్ మైక్‌సెట్‌ను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ తూంకుంట పాఠశాలకు మైక్‌సెట్ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ఉపాధ్యాయులు తన దృష్టికి తీసుకువచ్చారని చెప్పారు. వెంటనే నాణ్యమైన మైక్‌సెట్‌ను పాఠశాలకు విరాళంగా అందజేశామన్నారు. దీంతో పాఠశాల యాజమాన్యం జైపాల్‌రెడ్డిని అభినందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తూంకుంట మాజి సర్పంచ్ ఎద్దు నాగేష్, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు నాగమణి, రామిడి శశిధర్‌రెడ్డి, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు తిరుమలేష్, సత్తిరెడ్డి, అన్నపూర్ణ, నాగశారద, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కంపెనీ వ్యర్థ జలాలతో ఇక్కట్లు

### దోమలు విజృంభిస్తున్నా పట్టించుకోని కంపెనీ యాజమాన్యం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మున్సిపల్ పరిధిలోని నాగిశెట్టిపల్లి తండాలో ఉన్న జెర్సి డైరి కంపెనీ రోడ్డు పక్కన మురికి నీరు వదలడంతో భరించలేని దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని నాగిశెట్టిపల్లి తండావాసులు కంపెని ముందు మంగళవారం ఆందోళనకు దిగారు. కంపెని వ్యర్థ జలాలు ప్రహరీగోడ పక్క నుంచి వదలివేస్తున్నారని దీంతో దోమలు విజృంబించి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన చెందారు. కంపెనీ గేట్ ముందు సెక్యూరిటి గార్డు లేకపోవడంతో కంపెనికి చెందిన వాహనాలు రోడ్డుపైకి వేగంగా వచ్చి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. కంపెనీ వదులుతున్న వ్యర్థ రసాయనాలు భూమిలోకి ఇంకి భూగర్భ జలాలు కలుషితమైతున్నాయని ఆరోపించారు. ఆ నీటితో స్నానాలు చేస్తే చర్మ రోగాలు వస్తున్నాయని, బోజనం సహించడం లేదని వాపోయారు. రోడ్డు ప్రమాదాల్లో చనిపోయిన కుక్కలను రోడ్డు పక్కకు వేస్తున్నారని దీంతో పరిసరాలు దుర్వాసనతో భరించలేని కంపుతో నిండి పోతున్నాయని తెలిపారు. రాత్రిపూట కంపెని నుంచి వదులుతున్న పొగతో ముక్కుపుటాలాదిరే వాస న వస్తుందని, పర్యావరణం దెబ్బతింటుందన్నారు. ఇప్పటికైన పోల్యుషన్ కంట్రోల్ బోర్డు అదికారులు కంపెనీలో వదులుతున్న విష రసాయనాలను పరీక్షలు చేసి కంపెనిపై తగు చర్యలు తీసుకోవాలని తండావాసులు డిమాండ్ చేస్తున్నారు.




## నిర్లక్ష్యం.. నిండు ప్రాణం బలి

### బస్సును ఢీ కొన్న ద్విచక్ర వాహనం : యువకుడి మృతి

**ప్రజాపక్షం / కొడంగల్ :** అతినిర్లక్ష్యంతో రాంగ్ రూట్‌లో అతి వేగంగా వేళ్తు ఎదురుగా వస్తున్న ఆర్‌టీసీ బస్సును ఢీకొని ఓ యువకుడు మృతి చేందిన ఘటన మంగళవారం కొడంగల్ పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు బొంరాస్ పేట మండల పరిధిలోని ఎన్కెపల్లి గ్రామానికి చెందిన తలారి నర్సమ్మ ఒక్కడా నోక్క కుమారుడు తలారి వినోద్(21) కొడంగల్‌లో ఓ సంస్థలో డెలివరి భాయ్‌గా పనిచేస్తు జీవనం సాగిస్తుండేవాడు. మంగళవారం ఉదయం తన స్నేహితులతో తన పల్సర్(టిఎస్ 34కె7493) ద్విచక్ర వాహనంపై కొడంగల్‌కు వచ్చి టిఫిన్ చేసి తన స్నేహితులకు రెండు నిమిషాల్లో మళ్లీవస్తా అని చెప్పి కొడంగల్ నుంచి పరిగి రూట్‌లో అతివేగంగా రాంగ్ రూట్‌లో వెళ్తుండగా హైద్రాబాద్ నుంచి సేడం వేళ్తున్న ఆర్‌టీసీ బస్సు(టిఎస్34జెడ్0020) బస్సు వస్తుండగా ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడిని 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పోందుతు మృతి చెందడం జరిగింది. తలకు హెల్మెట్ ఉంటే బ్రతికుండేవాడని పోలీసులు పేర్కోన్నారు. మృతుడి బాబాయ్ రామ్‌చందర్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.



## మట్టి గణపతి విగ్రహాలే వాడాలి

### కలెక్టర్ మనుచౌదరి

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** ప్రతి ఏడాది అత్యంత ఉత్సాహంతో, భక్తి శ్రద్దలతో నిర్వహించుకొనే వినాయకచవితి పర్వదినాన్ని మట్టి గణపతి విగ్రహాలతో మాత్రమే జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి సూచించారు. పండుగ శుభాకాంక్షలు తెలియచేస్తూ ఆయన ప్లాస్టర్ ఆఫ్ పారిస్, కెమికల్స్‌తో తయారు చేసే వినాయక విగ్రహాలను వాడటం వల్ల జల వనరులు కాలుష్యం అవటంతో పాటు పర్యావరణ నాశనం జరుగుతుందన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఆవరణలో మట్టి వినాయకులను ఆయన పంపిణీ చేసారు. ఈ సందర్భంగా మట్టి గణపతుల ప్రాధాన్యత వివరించే విధంగా తెలంగాణా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు జిల్లా ప్రాంతీయ కార్యాలయం రూపొందించిన గోడపత్రికలను ఆయన విడుదల చేసారు. జిల్లాలోని కూకట్‌పల్లి, బాలానగర్,జీడిమెట్ల తదితర ప్రాంతాల్లోనూ మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా, డిఆర్‌ఓ హరిప్రియ, ఏఓ రాంమోహన్, పర్యావరణ సహాయక శాస్త్రవేత్త జి,లంగయ్య, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

**మెరుగైన చికిత్సనందించాలి :** సీజనల్ వ్యాధులను నివారించటంతో పాటు అవసరమైన వారికి సత్వర చికిత్సలందించటంలో ప్రత్యేక శ్రద్ద కనపరచాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి వైద్యులను, వైద్య సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా.ఉమాగౌరితో కల్సి ఆల్వాల్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఆయ న అక్కడికి ప్రతిరోజు చికిత్సల కోసం వస్తున్న రోగుల వివరాల రిజిస్టర్లు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, నివేదికల రికార్డులు, మందుల నిల్వ లు, ఇతర రికార్డులన్నింటిని పరిశీలించారు. అనంతరం ఆయన వైద్యులనుద్దేశించి మాట్లాడుతూ ప్రభు త్వం వైద్యానికి అత్యంత ప్రాధాన్యత కల్పిస్తోందని, వైద్యారోగ్య విభాగ వైద్యులు,సిబ్బంది రోగులకు మెరుగైన చికిత్సలిందించటంలో ఎలాంటి నిర్లక్ష్యం కనపరచకుండా సేవాభావంతో తమతమ విధులు నిర్వహిస్తుండాలని సూచించారు.



## ఫీర్జాదిగూడ ప్రజల కష్టాలకు శాశ్వత విముక్తి

### మున్సిపల్ కమిషనర్, ఎస్ఎన్‌డిపి అధికారులు, కాంగ్రెస్ నేతలకు కృతజ్ఞతలు తెలిపిన తుంగతుర్తి రవి

**ప్రజాపక్షం/బోడుప్పల్ :** వర్షాకాలం వచ్చిందంటే వరద నీటిలో ఇండ్లు మునిగిపోయి. ఇంట్లో వస్తువులు కొట్టుకుపోయి,పిల్లల సర్టిఫికెట్లు తడిచి పోయి బిక్కుబిక్కున ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపిన పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ ప్రజల కన్నీటి కష్టాలు అతి త్వరలో శాశ్వతంగా తీరబోతున్నాయి. బోడుప్పల్, పీర్జాదిగూడ కార్పొరేషన్ల పరిధిలోని వరద నీరు నేరుగా మూసీనదిలో కలిపేందుకు సుమారు రూ.110 కోట్ల నిధులతో ప్రారంభమైన ఎస్ఎన్ డిపి పనులు శరవేగంగా చకచకా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర రావు తో కలిసి పిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి ఎస్ఎన్‌డిపి పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రారంభమైన ఎస్ ఎన్ డిపి పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ముందుకు సాగలేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పీర్జాదిగూడ ప్రజల కన్నీటి కష్టాలను తొలగించేందుకు కాంగ్రెస్ పెద్దల చొరవతో ఎస్ ఎన్ డిపి పనులు పున:ప్రారంభమై యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయి. మరి కొద్ది రోజుల్లో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ ప్రజల వరద కష్టాలకు విముక్తి లభించబోతుంది. ఎస్ఎన్‌డిపి పనులు శరవేగంగా జరగడంలో ప్రముఖ పాత్ర వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర రావు, ఎస్ఎన్‌డిపి అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాంట్రాక్టర్లకు పీర్జాదిగూడ ప్రజల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానని తుంగతుర్తి రవి అన్నారు.





## మట్టి గణపతులనే పూజించాలి

**ప్రజాపక్షం/వికారాబాద్:**వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్ సుధీర్, ట్రైనింగ్ కలెక్టర్ హర్స్ చౌదరి లతో కలిస మట్టి గణపతులు పంఫిణీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూజిల్లాలో 12000 మట్టి వినాయక ప్రతిమలను పంఫిణీ చేయడం జరిగిందన్నారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి గణపతి విగ్రహలను చెరువుల మట్టితో తయారు చేసి చెరువులోనే నిమజ్జనం చేద్దా అని పోస్టర్‌ను విడుదల చేసి మట్టి వినాయకులను పూజించాలని పంఫిణీ చేశారు. పర్యావరణ సమతుల్యత కోసం మట్టి విగ్రహలను ప్రతిష్టించాలన్నారు. ప్లాస్టర్ ఆప్ ప్యారిస్,ఇతర రసాయనిక రంగులతో రుపోందించిన విగ్రహ కారణంగా జల వనరులు కలిషితం అయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రజలందరూ మట్టి గణపతులను ప్రతిషించి,పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని పిలుపునించ్చారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి రేణుకాదేవి, కాలుష్యనియంత్రణ మండలి అసిస్టెంట్ ఎన్విరాన్ మెంట్ ఇంజనీర్ సదార్థ జిల్లా శిశుసంక్షేమ అధికారి కృష్ణవేణి, డిపిఆర్‌ఓ చెన్నమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## యూరియా లభ్యతపై రైతులకు భరోసా

### అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

**ప్రజాపక్షం/వికారాబాద్:**వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లాలో యూరియా లభ్యత సరిహద్దుల్లో చెక్ పోస్ట్‌ల ఏర్పాటు తదితర అంశాలపై వ్యవసాయ అధికారులతో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ అదేశాల మేరకు జిల్లాలో రైతులకు యూరియా లభ్యతకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. గత సంవత్సరం జిల్లాలో 19,764 మెట్రిక్ టన్నుల యూరియాను అందించామన్నారు. వారం రోజుల్లోగా జిల్లాకు అదనంగా 1080 మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉందని తెలిపారు. మండల వ్యవసాయ అధికారులు ,విస్తకఱ అధికారులు యూరియా విక్య కేంద్రాల వద్ద ఉంటూ క్షణంగా పరిశీలిస్తూ రైతులకు యూరియా అందే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఇప్పటివరకు జిల్లాలో 1000లీటర్ల నానో యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. నానో యూరియాను ఉపయోగించడం ద్వారా రైతులు సాంప్రదాయ యూరియా ఏరువులపై ఆదారపడాటాన్ని తగ్గించవచ్చని అయన ఈ సందర్భంగా తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో వ్యవసాయశాఖ అధికారి రాజారత్నం,ఏడిఏ సందీప్ కుమార్, ఏడిలు, తదితరులు పాల్గోన్నారు.

# రీల్



## 'మిస్టర్ రాము' ఆడియో ఆవిష్కరణ

బొంత రాము హీరోగా నటిస్తున్న సినిమా 'మిస్టర్ రాము'. ఈ చిత్రంలో అజయ్ ఘోష్ విలన్‌గా నటిస్తున్నారు. జబర్దస్త్ అప్పారావు మరో కీ రోల్ పోషించారు. ఈ చిత్రాన్ని రేణుక దేవి ఫిలింస్ బ్యానర్‌పై బొంత రాము నిర్మించారు. అజయ్ కౌండిన్య దర్శకత్వం వహించారు. ఈ సినిమా ఆడియో ఆవిష్కరణ హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నటుడు జబర్దస్త్ అప్పారావు మాట్లాడుతూ ఈ చిత్రంలో మంచి రోల్ చేసే అవకాశం ఇచ్చారు. ఈ సినిమాకు హృదయ్ ముగ్దల్ సూపర్ హిట్ మ్యూజిక్ అందించారు. నిర్మాత, హీరో బొంత రాము మాట్లాడుతూ నాకు హీరోగా నటించాలని కల ఉండేది. దర్శకుడు అజయ్ కౌండిన్య నాకు ఈ సబ్జెక్ట్ చెప్పినప్పుడు కథ నచ్చి తప్పకుండా చేద్దామని ముందుకు వచ్చాను. ఈ చిత్రంలో ఆటో డ్రైవర్ రోల్‌లో నటించాను. మిస్టర్ రాము తో పాటు నేను, డైరెక్టర్ అజయ్ కౌండిన్య కాంబినేషన్ లో మరో 9 చిత్రాలు చేయబోతున్నాం. మొత్తం మా కాంబినేషన్‌లో 10 సినిమాలు రాబోతున్నాయి.



## మంచి ఎంటర్‌టైనర్ సినిమా 'కన్యా కుమారి' : బన్నీవాసు

ప్రముఖ నటి మధు శాలిని ప్రెజెంటర్‌గా రూరల్ లవ్ స్టోరీ 'కన్యా కుమారి' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నారు. రాడికల్ పిక్చర్స్ బ్యానర్‌పై సృజన్ అట్టాడ రచన, దర్శకత్వం, నిర్మాతగా రూపొందించిన ఈ చిత్రంలో గీత్ సైని, శ్రీచరణ్ రాచకొండ ప్రధాన పాత్రల్లో నటించారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రం నేడు వినాయక చవితి సందర్భంగా గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రెస్ మీట్‌లో నిర్మాత బన్నీ వాస్ మాట్లాడుతూ డైరెక్టర్ సృజన్ ఈ సినిమా చూడమని చాలా రోజులుగా అడిగారు. తర్వాత మధు శాలిని ఈ సినిమా గురించి చెప్పారు. మధు శాలిని సినిమాలో సంపాదించి మళ్లీ సినిమాల్లోనే ఇన్వెస్ట్ చేయడం అనేది చాలా గొప్ప విషయం. పంట పొలాలతో ఒక ప్రేమ కథని ముడి పెడుతూ చెప్పడం అనేది నాకు చాలా నచ్చింది. సినిమా స్క్రీన్ ప్లే చాలా బ్యూటిఫుల్‌గా ఉంటుంది. గీత్ సైని చాలా అద్భుతంగా నటించింది. తన క్యారెక్టర్ గుర్తుండిపోతుంది. ఈ మధ్యకాలంలో నేను చూసిన బెస్ట్ పెయిర్ ఇది. ఈ సినిమాని సపోర్ట్ చేయడానికి థియేటర్లో రిలీజ్ చేస్తానని చెప్పడానికి మెయిన్ రీజన్ ఈ సినిమా నాకు చాలా నచ్చింది. చాలా హార్డ్ వర్క్ తో చేసిన సినిమా అందుకే సపోర్ట్ చేస్తున్నాను అని చెప్పారు.



## 'మాస్ జాతర' వాయిదా

మాస్ మహారాజా రవితేజ హీరోగా నటించిన తాజా చిత్రం 'మాస్ జతర' చిత్రం ఆగస్టు 27వ తేదీన థియేటర్లలో విడుదల కావాల్సి ఉండగా కొన్ని సాంకేతిక కారణాల వల్ల వాయిదా పడింది. ఇటీవల పరిశ్రమ వ్యాప్తంగా జరిగిన సమ్మె, కీలకమైన కంటెంట్ పూర్తి చేయడంలో ఊహించని జాప్యం కారణంగా.. సినిమాను అనుకున్న తేదీకి సకాలంలో సిద్ధం చేయలేకపోయామని నిర్మాతల్లో ఒకరైన సూర్యదేవర నాగ వంశీ తెలిపారు. కంగారుగా సినిమాని విడుదల చేయడం కంటే కాస్త సమయం తీసుకొని అత్యుత్తమ చిత్రంగా మలిచి, ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని అందించాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు నిర్మాతలు స్పష్టం చేశారు.మాస్ జతార చిత్రాన్ని అసలైన పండుగ సినిమాగా తీర్చిదిద్దడానికి ప్రతి విభాగం అవిశ్రాంతంగా కృషి చేస్తోందని, ప్రస్తుతం చిత్రానికి సంబంధించిన పనులు వేగంగా జరుగుతున్నాయని నిర్మాతలు తెలిపారు. కొత్త విడుదల తేదీ ఇంకా ఖరారు కానప్పటికీ, త్వరలోనే ప్రకటన వస్తుందని పేర్కొన్నారు.


## ఒగ్గు కళాకారుల నేపథ్యంలో 'బ్రహ్మాండ'

ప్రస్తుతం తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీలో ఆధ్యాత్మిక కథలకు కూడా మంచి ఆదరణ లభిస్తుంది. ఒకవైపు పెద్ద సినిమాలు ఎలా అయితే ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకొస్తున్నాయో, మరోవైపు చిన్న సినిమాలు చాలామంది హృదయాలను తాకుతున్నాయి. ఇక ప్రస్తుతం రాబోతున్న సినిమాలలో బ్రహ్మాండ సినిమా ఒకటి. ఈ సినిమా త్వరలోనే విడుదల అవుతున్న సందర్భంగా సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ సినిమాలో ప్రధాన పాత్రలో నటించిన ఆమని మాట్లాడుతూ.. బ్రహ్మాండ మూవీ




తెలుగు ప్రేక్షకులకి ఓ కొత్త అనుభూతి అనుభూతిని ఇస్తుంది అని తెలిపారు. ఇంత మంచి సినిమా సినిమా డైరెక్ట్ చేసిన రాంబాబు మన మధ్య లేకపోవడం బాధ కారం అని అన్నారు. ఈ ఈవెంట్‌లో తెలంగాణ ఫిలిం ఛాంబర్ అధ్యక్షుడు డాక్టర్ ప్రధాని రామకృష్ణ గౌడ్ సంగీత దర్శకుడు వారిఉప్పల యాదగిరి, హీరో బన్నీ రాజు, నిర్మాత దాసరి సురేష్ పాల్గొన్నారు.

## 'నాలో నేను' సాంగ్ రిలీజ్



సంతోష్ శోభన్ హీరోగా నటిస్తున్న సినిమా 'కపుల్ ఫ్రెండ్లీ'. ఈ చిత్రంలో మానస వారణాసి హీరోయిన్‌గా నటిస్తోంది. యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో నిర్మిస్తోంది. అజయ్ కుమార్ రాజు.పి కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. మ్యూజికల్ రొమాంటిక్ లవ్ స్టోరీ మూవీగా 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమా నుంచి 'నాలో నేను' సాంగ్ రిలీజ్ చేశారు.

## 'ఏం జరుగుతోంది' పాట విడుదల




రశ్మిక మందన్న, దీక్షిత్ శెట్టి జంటగా నటిస్తున్న సినిమా 'ది గర్ల్ ఫ్రెండ్'. ఈ సినిమాను ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో దర్శకుడు రాహుల్ రవీంద్రన్ రూపొందిస్తున్నారు. ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలుగా వ్యవహిస్తున్నారు. 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమా నుంచి 'ఏం జరుగుతోంది...' అనే పాటను ఆవిష్కరించారు.

## క్రీడా నేపథ్యంలో సినిమా చేయాలనుంది

నారా రోహిత్



హీరో నారా రోహిత్ హీరోగా నటించిన తాజా చిత్రం 'సుందరకాండ'. నూతన దర్శకుడు వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా 27న (నేడు) విడుదల అవుతున్న సందర్భంగా మీడియాతో నారా రోహిత్ చిట్ చాట్ చేశారు. నిజానికి కంబ్యాక్ సుందరకాండతోనే చేయాలి. 2022లోనే ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్ స్టార్ట్ చేశాము. డైరెక్టర్ వెంకటేష్ ఈ ఐడియా చెప్పినప్పుడు కంగారు పడ్డాను. ఆడియన్స్ ఎలా తీసుకుంటారో అనిపించింది. ఐతే అదే సమయంలో వచ్చిన బ్రో డాడీ సినిమా ఒక విండో ఓపెన్ చేసింది. వెంకటేష్ ఒక 30 సీన్స్ రాసుకుని వచ్చాడు. నాకు చాలా నచ్చాయి. అలా ప్రాజెక్ట్ స్టార్ట్ చేశాం. చూస్తున్నంత సేపు ఆడియన్స్ ఫేస్‌లో ఒక స్మైల్ ఉంటుంది. డైరెక్టర్ వెంకటేష్ నాతో ఐదేళ్లుగా ట్రావెల్ అవుతున్నాడు. మేము ఈ సినిమా కోసం చాలా డిస్కస్ చేశాము. అవన్నీ కూడా మాకు చాలా హెల్ప్ అయ్యాయి. ఈ జనరేషన్ కి ఇది చాలా కొత్త కథ. క్యారెక్టర్‌లో కొత్త ఎగ్జిట్ ఉంది. ఈ క్యారెక్టర్ ని చాలా ఎంజాయ్ చేశాను. సుందరకాండ చాలా క్లీన్ ఫిలిం. సీన్స్ ట్రీట్మెంట్ చాలా ఫ్రెష్‌గా ఉంటుంది. అందరికీ కనెక్ట్ అయ్యే సినిమా. ఇందులో నా క్యారెక్టర్ కి కొన్ని లిమిటేషన్స్ ఉంటాయి. 30 దాటినా కూడా కావలసిన క్వాలిటీస్ ఉన్న అమ్మాయి కోసం వెతకడం అనేది చాలా ఇంట్రెస్టింగ్. కాంప్లికేటెడ్ క్యారెక్టర్. ఆ కాంప్లికేషన్ నుంచే ఫన్ క్రియేట్ అవుతుంది.ఈ ప్రేమ కథలో ఉన్న కనిఫ్లిక్ట్ ఇప్పుడే చెప్పలేను. ఇందులో హీరో కావలసిన ఫైవ్ క్వాలిటీస్ అనేవి చాలా పెక్యులర్. అవి మీరు స్క్రీన్ మీద చూడాలి. ఇందులో హీరో పడే సిచువేషన్ నుంచి సినిమా కామెడీ జనరేట్ అవుతుంది.ఈ సినిమా నా ప్రొడక్షన్ లోనే స్టార్ట్ చేశాను. సంతోష్ నా కజిన్. తను ఎప్పటి నుంచి ఒక మంచి ప్రాజెక్ట్ చేయాలనుకుంటున్నారు. ఈ ప్రాజెక్టుకు జాయిన్ అయ్యారు. గౌతమ్ రాకేష్.. వెంకీ చెప్పిన కథ నచ్చి జాయిన్ అయ్యారు. స్టోరీ కారణంగానే నలుగురం కలిశాం. మ్యూజిక్ డైరెక్టర్ లియాన్ వండర్ఫుల్ పర్సన్. టెరిఫిక్ సాంగ్స్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఇచ్చాడు. సినిమా చూసిన తర్వాత పాటలు మరింత కనెక్ట్ అవుతాయి. డియర్ ఐరా నా ఫేవరెట్ సాంగ్. పెద్ద నరేష్ క్యారెక్టర్ చాలా బాగుంటుంది. ఆయన చాలా అనుభవం ఉన్న నటుడు. ఏ పాత్రనైనా చాలా అద్భుతంగా చేయగలరు. అలాగే సత్య క్యారెక్టర్ కూడా చాలా ఫ్రెష్‌గా ఉంటుంది. నాకు రొమాంటిక్ కామెడీస్, అలాగే స్పోర్ట్స్ డ్రామాలు ఇష్టం. మంచి స్పోర్ట్స్ డ్రామా, ఇన్స్పిరేషనల్ క్యారెక్టర్ వస్తే ఖచ్చితంగా చేస్తాను.వెంకటేష్ తోనే మరో సినిమా కూడా చేస్తున్నాను.



## యాక్షన్ నేపథ్యంలో మిరాయ్

తేజ సజ్జా పాన్‌ఇండియా సూపర్ హీరో విజువల్ వండర్ 'మిరాయ్'లో సూపర్ యోధ పాత్రలో అలరించబోతున్నారు. ఈ చిత్రానికి కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్ ఆగస్టు 28న లాంచ్ చేయనున్నారు.హీరో, విలన్ పవర్ ఫుల్ గా కనిపించిన ట్రైలర్ పోస్టర్ అదిరిపోయింది. తేజ సూపర్ యోధాగా ఎనర్జీతో మెరుస్తున్న మ్యాజికల్ స్టిక్ తో కనిపించగా, మనోజ్ ఫెరోషియస్ బ్లాక్ స్వోర్డ్‌గా, భారీ ఖడ్గాన్ని పట్టుకుని ఎదురు నిలబడ్డాడు. ఈ పోస్టర్‌తో సినిమా మీద అంచనాలు పెరుగుతున్నాయి. ఈ చిత్రంలో తేజ సజ్జ సరసన రితికా నాయక్ కథానాయికగా నటిస్తుండగా, శ్రీయా శరణ్, జయరామ్, జగపతిబాబు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

## తీవ్ర ప్రభావం

**(మొదటి పేజీ తరువాయి)**

కొనసాగిస్తానని దేశానికి హామీ ఇస్తున్నానని పేర్కొన్నారు. మంగళవారం ఆయన సమాజ్‌వాదీ పార్టీ ప్రధాన కార్యాలయంలో ఎస్‌పి చీఫ్, కాంగ్రెస్ నాయకుల సమక్షంలో జరిగిన విలేకరుల సమావేశంలో సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. తన అభ్యర్థిత్వానికి ఇండియా కూటమిలో లేని వారు కూడా తనకు మద్దతు ఇవ్వడానికి ముందుకు వస్తున్నందుకు వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. పార్టీ శ్రేణులకు అతీతంగా తన అభ్యర్థిత్వాన్ని యోగ్యత, సిద్ధాంతం ఆధారంగా పరిగణించాలని సుదర్శన్‌రెడ్డి అన్ని రాజకీయ పార్టీల సభ్యులకు విజ్ఞప్తి చేశారు. 'ప్రతిపక్షం నన్ను విశ్వసించిందని, నన్ను అభ్యర్థిగా ఎంపిక చేశారని మీకు ఇప్పటికే తెలుసు. ఇండియా కూటమి మాత్రమే కాకుండా కూటమి వెలుపల ఉన్న వ్యక్తులు కూడా మద్దతు తెలిపేందుకు ముందుకు వస్తున్నందుకు నేను చాలా కృతజ్ఞుడను. నా స్నేహితుడు అఖిలేష్ యాదవ్ లేకుండా ఇది సాధ్యం అయ్యేది కాదు' అని అన్నారు. పత్రిక సమావేశంలో పాల్గొన్న ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ అజయ్ రాయ్ తరువాత పిటిఐతో మాట్లాడుతూ తామంతా ఒక్కటేనని, బిజెపిని ఇబ్బంది పెట్టడానికి తమ వద్ద కొన్ని ఆశ్చర్యకరమైన అంశాలు ఉన్నాయన్నారు. కాగా, ఇటీవల ఢిల్లీలో ఆప్ నాయకుడు అరవింద్ కేజ్రీవాల్‌ను, చెన్నైలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్‌ను కలిశానని సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా నక్సలిజానికి మద్దతు ఇస్తున్నారనే ఆరోపణపై ఆయన మాట్లాడుతూ దానిపై చర్చను కొనసాగించకూడదన్నారు. ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టిన 130వ రాజ్యాంగ సవరణ బిల్లుపై విలేకరులు ప్రశ్నించగా, సుదర్శన్‌రెడ్డి బదులిస్తూ ఈ బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీ ముందు ప్రవేశపెట్టినందునఇప్పుడే దానిపై వ్యాఖ్యానించడం సరైనది కాదని అన్నారు. 'నేను రాజకీయ రంగంలోకి ఎందుకు అడుగుపెట్టానని మీలో కొందరు అడగవచ్చు. నేను రాజకీయాల్లోకి అడుగుపెట్టలేదు. ఇది ఉన్నత రాజ్యాంగ పదవి అని నేను చెబుతున్నాను. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, డాక్టర్ జాకీర్ హుస్సేన్, డాక్టర్ కె ఆర్ నారాయణన్, తరువాత శ్రీ హమీద్ అన్సారీ జీ. వంటి తత్వవేత్తలు, జాతీయ నాయకులు, విద్యావేత్తలు దీనిని ఇంతకు ముందు నిర్వహించారు. వారు నాకు స్ఫూర్తినిస్తారు. వారు ఒకప్పుడు నడిచిన మార్గంలో నడవడానికి నన్ను నామినేట్ చేసినందుకు అన్ని ప్రతిపక్ష పార్టీలకు నేను కృతజ్ఞుడను' అని ఆయన అన్నారు. తాను నిరంతరం ఎంపిలతో మాట్లాడుతున్నానని, దాదాపు ప్రతిరోజూ మీడియాతో కూడా సంభాషిస్తున్నానని సుదర్శన్ రెడ్డి అన్నారు. డాక్టర్ రామ్ మనోహర్ లోహియా, ఎస్పీ వ్యవస్థాపకుడు ములాయం సింగ్ యాదవ్ గురించి కూడా రెడ్డి ప్రస్తావించారు, వారి నుండి ఆయన చాలా నేర్చుకున్నారని చెప్పారు. తాను (డాక్టర్ రామ్ మనోహర్) లోహియా జీ, నేతాజీ (ములాయం సింగ్ యాదవ్) నుండి కూడా చాలా నేర్చుకున్నానని, కానీ దక్షిణ భారతదేశం నుండి వచ్చినందున హిందీలో ప్రసంగం ఎలా చేయాలో ఎప్పుడూ సరిగ్గా నేర్చుకోలేదన్నారు.

## రాష్ట్ర ప్రజలకు గణేష్ చతుర్థి శుభాకాంక్షలు

గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

ప్రజాపక్షం/హైదరాబాద్: రాజ్‌భవన్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో అధికారులు, సిబ్బందికి సహజ సేంద్రీయ రంగులతో పేయింట్ చేయబడిన పర్యావరణ అనుకూలమైన మట్టి గణేశ విగ్రహాలను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు గవర్నర్ గణేష్ చతుర్థి శుభాకాంక్షలు తెలిపారు. అడ్డంకులను తొలగించే గణేశుడు తెలంగాణ రాష్ట్రం, దేశం యొక్క ఐక్యత, శాంతి, పురోగతి, శ్రేయస్సు మార్గంలో ఉన్న అన్ని అడ్డంకులను తొలగిస్తాడని తన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

## ప్రపంచ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో.. చికితా తానిపర్తికి స్వర్ణం




ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణకు చెందిన 20 ఏళ్ల చికితా తానిపర్తి ప్రపంచ ఆర్చరీ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం సాధించి చరిత్ర సృష్టించారు. పల్లెటూరి రైతు కుటుంబం నుంచి వచ్చిన చికితా, కెనడాలోని విన్నిపెగ్‌లో జరిగిన వరల్డ్ యూత్ ఛాంపియన్‌షిప్స్‌లో అండర్21 మహిళల కాంపౌండ్ విభాగంలో ఈ ఘనత సాధించారు. దీనితో, జూనియర్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ టైటిల్ గెలుచుకున్న భారతదేశపు మొదటి మహిళా కాంపౌండ్ ఆర్చర్‌గా నిలిచారు. పెద్దపల్లి జిల్లా సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన చికితా, తన క్రీడా ప్రయాణంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నారు. ముఖ్యంగా, పోటీలకు వెళ్లే ముందు ఎయిర్‌లైన్ సమ్మె కారణంగా ఆమె విమానం రద్దు కావడంతో పోటీల్లో పాల్గొనడంపై అనిశ్చితి నెలకొంది. అయితే, నిర్మాణ్ ఆర్గనైజేషన్, అలాగే తెలంగాణ ప్రభుత్వ ఐటీ, పరిశ్రమల ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ తక్షణ జోక్యం చేసుకొని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంతో ఆమె సకాలంలో విన్నిపెగ్ చేరుకోగలిగారు. నిర్మాణ్ ఆర్గనైజేషన్, కె.రహేజా కార్పొరేషన్ వారి సిఎస్ఆర్ కార్యక్రమం ధనుష్ శక్తి ద్వారా చికితాకు చాలా సంవత్సరాలుగా మద్దతు అందిస్తూ వచ్చారు. ఆమె శిక్షణ, అవసరమైన ఆర్చరీ పరికరాలను ఈ సంస్థలు సమకూర్చాయి. కె.రహేజా కార్పొరేషన్ సిఓఓ శ్రావణ్ కుమార్ గోనే మాట్లాడుతూ ప్రస్తుతం చికితా ప్రపంచ యువ ఛాంపియన్‌గా ఉండటం తమకు గర్వకారణమన్నారు. ప్రాజెక్ట్ ధనుష్ శక్తి కింద గత కొన్ని సంవత్సరాలుగా ఆమెకు సహాయం అందించి, ఆమె అంతర్జాతీయ ఛాంపియన్‌గా ఎదగడానికి తోడ్పడ్డామన్నారు. ఈ బంగారు పతకం విజయం భారత్‌ను గర్వపడేలా చేసిందన్నారు. ఇనార్బిట్ మాల్ హైదరాబాద్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ శరత్ బేలవాడి మాట్లాడుతూ ధనుష్ శక్తి ప్రాజెక్టు కింద చికితాకు అనేక సంవత్సరాలుగా అవసరమైన సహాయం అందించామని, ఆమె గెలిచిన ఈ స్వర్ణ పతకం ఆమె పట్టుదలను, సరైన సమయంలో అందించిన సహాయం ఎంత ముఖ్యమో నిరూపించిందని చెప్పారు. నిర్మాణ్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు మయూర్ పట్నాల మాట్లాడుతూ చికితా వరల్డ్ యూత్ ఛాంపియన్‌షిప్స్‌లో బంగారు పతకం సాధించి దేశాన్ని గర్వపడేలా చేశారన్నారు. వెనుకబడిన, గిరిజన యువ క్రీడాకారులకు సహాయం చేయాలనే తమ లక్ష్యం ఈ విజయంతో మరింత బలోపేతం అయిందన్నారు. ఇలాంటి మరెన్నో ప్రతిభావంతులను ప్రోత్సహించడానికి ఈ విజయం తమకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. 2019లో తన ఆర్చరీ ప్రయాణాన్ని ప్రారంభించిన చికితా, 2020లో మొదటి జాతీయ పతకాన్ని గెలుచుకున్నారని, అప్పటి నుంచి అనేక అంతర్జాతీయ వేదికలపై పతకాలు సాధించి తన ప్రతిభను చాటుకున్నారని తెలిపారు.

## గాజా యుద్ధం ముగియొచ్చు

**(మొదటి పేజీ తరువాయి)**

రెండు విడతలుగా 11 మంది ముఖ్యమైన జర్నలిస్టులను, కెమేరామెన్‌ను ఇజ్రాయెల్ సైన్యం దాడుల్లో హతమార్చడంపట్ల ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశార. గాజాలో ఇటీవల సామాన్య ప్రజల మరణాలు తనను కలచివేస్తున్నాయని మానవత్వం ప్రదర్శించారు. ఈ మరణాలపట్ల తాను ఎంతమాత్రం సంతోషంగా లేనన్నారు. దక్షిణగాజాలోని నస్సెర్ ఆసుపత్రిపై ఇజ్రాయెల్ సైనిక దళాలు రెండుసార్లు వరుసగా సోమవారం క్షిపణి దాడులు చేయడంతో ఐదుగురు జర్నలిస్టులు, రోగులు, సహాయ సిబ్బంది మరణించడంపట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. 'గాజాలో అధికారికంగా కరువు దుర్భర పరిస్థితులు ప్రారంభమయ్యాయని ఐక్యరాజ్యసమితి మద్దతుగల సంస్థ ప్రకటించిన నేపథ్యంలో నెతన్యాహూతో మీరు టచ్‌లో ఉండి సంభాషణలు చేస్తున్నారా?' అని పాత్రికేయులు అడిగిన ప్రశ్నకు ట్రంప్ స్పందిస్తూ, ఇజ్రాయెల్ ప్రధానమంత్రితో తనకు ఎంతో మంచి సంబంధాలున్నాయంటూ ఇటీవల ఇరాన్‌పై యుద్ధంలో వారి ఉమ్మడి యుద్ధ సహకార అనుభవాలను గుర్తుచేసుకున్నారు. 'వారు ప్రస్తుతం గాజా సిటీ గురించి మాట్లాడుతున్నారు, వారు ఎప్పుడూ ఏదో ఒకటి మాట్లాడుతూనే ఉంటారు, ఇక ఈ యుద్ధం ఏదో ఒకచోట పరిష్కారం కాక తప్పదు, త్వరలోనే ఈ సమస్య పరిష్కారం కావడం మీరు చూస్తారు' అని ట్రంప్ చెప్పారు. పత్రికాగోష్ఠిలో ట్రంప్‌తోపాలు పాల్గొన్న విదేశాంగమంత్రి మార్కో రుబియో మాట్లాడుతూ, ఈ యుద్ధం ముగిసిపోవాలంటే గాజాలో హమాస్ అధికారం నుండి వైదొలగాలన్న కీలకమైన షరతు ఇంకా మిగిలిపోయిందని అన్నారు. మేం దీని పరిష్కారం కోసం చూస్తున్నాం, ఏదో ఒక పరిష్కారం సాధిస్తాం, ముగింపు తెస్తాం, హమాస్‌ను తుడిచిపెట్టడంతోనే ముగింపు వస్తుంది అని మార్కో రుబియో అన్నారు.

**ట్రంప్‌కు అలవాటుగా మారిన రెండువారాల గడువు ప్రకటన!**

రాజకీయాల్లో, విధానపరమైన ప్రకటనలు చేసేటప్పుడు ప్రపంచ ప్రాధాన్యంగల ప్రధానాంశాల విషయంలో మాట్లాడేటప్పుడు డోనాల్డ్ ట్రంప్‌కు రెండు వారాలు గడువు విధించడం ఒక అలవాటుగా మారింది! సమస్యను సాగదీసేటప్పుడు ఆయన రెండు వారాల గడువు పదాన్ని ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ఉక్రేన్ విషయంలో, పుతిన్ విషయంలో కూడా ఆయన ఇదే వైఖరి అనుసరించారు. వాణిజ్య సంబంధాలు, పన్నుల సంస్కరణలు, ఆరోగ్య సంరక్షణ ప్రకటనలు, బొగ్గు గనులు పునఃప్రారంభం, మౌలిక ప్రాజెక్టులు.. ఇలా దేనికి సంబంధించిన అంశంలోనైనా రెండు వారాల గడువు విషయాన్ని ఆయన ఉపయోగిస్తున్నారు. ఇప్పుడు గాజా యుద్ధం ముగింపు విషయంలో కూడా ట్రంప్ తాజా ప్రకటన చేస్తూ, రెండు మూడు వారాల్లో యుద్ధం ముగిసిపోయే అవకాశాలున్నాయన్నారు.

రష్యా–ఉక్రేన్ యుద్ధ విషయంలో ఇంతకు ముందు రెండు వారాలు డెడ్‌లైన్ విధించారు. పుతిన్ నిర్ణయం చెప్పకపోతే ఆంక్షలు విధిస్తామని హెచ్చరించారు. అనేక అంశాలలో తర్వాత చూద్దాం అనే పదానికి బదులుగా ట్రంప్ ఈ రెండు వారాల గడువు పదం ఉపయోగిస్తున్నారని న్యూయార్క్ టైమ్స్ పత్రిక వ్యాఖ్యానించింది.






Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com